


visit us @ http://epaper.suryaa.com

నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com




సంపుటి 17 | సంచిక 248

గురువారం | 8 ఆగస్టు 2024 | విజయవాడ

| పేజీలు 10+8 | వెల: రూ. 6.50

Published from Hyderabad, Visakhapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Kadapa, Kurnool, Anantapuram, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bangalore, Mumbai, New Delhi


అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం దక్షిణాయణం - శిశిర ఋతువు, శ్రావణ మాసం శుద్ధ చవితి రా.9.00, ఉత్తరా నక్షత్రం రా.10.08, వర్జ్యం లేదు
రాహుకాలం మ.1.30 నుంచి 3.00 వరకు దుర్ముహూర్తం ఉ.9.53 నుంచి 10.48 వరకు తిరిగి మ.3.02 నుంచి 3.52 వరకు

## నేతన్నల జీవితాల్లో
# వెలుగులు నింపుతాం

● చేనేత వస్త్రాలపై జీఎస్టీ రద్దుకు ప్రయత్నాలు ● నెలలో ఒక రోజు చేనేత వస్త్రాలు ధరించి నేతన్నలను ప్రోత్సహిద్దాం ● గత ప్రభుత్వం చేనేతలకు ఇచ్చే ప్రోత్సాహకాలన్నీ రద్దు చేసింది ● ఐదేళ్ల పాలనలో ఏ శాఖలో చూసినా విధ్వంసమే కనిపిస్తోంది ● ఫోటోలకు వందల కోట్లు తగలేసిన గత ప్రభుత్వం..చేనేతల సంక్షేమంపై దృష్టి పెట్టలేదు ● చేనేత కార్మికుల గృహాలకు సౌరవిద్యుత్ సదుపాయం కల్పిస్తాం : ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు




2 లో

నెలలో ఒక రోజు అందరం చేనేత వస్త్రాలు ధరించి చేనేత కార్మికుల ప్రగతికి తోడ్పాటును అందిద్దామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రజలకు పిలుపునిచ్చారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా విజయవాడ మేరీస్ స్టెల్లా కళాశాలలో జరిగిన వేడుకల్లో సీఎం పాల్గొన్నారు. ఎగ్జిబిషన్ లో ఏర్పాటు చేసిన చేనేత వస్త్రాల మాల్ ను సందర్శించారు. కార్మికుల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం చేనేత కార్మికులను ఉద్దేశించి ప్రసంగించారు.టీడీపీ ఆవిర్భావం నుంచి అన్ని వేళలా చేనేతలు అండగా నిలిచారు. చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించడం నా బాధ్యత. మా ప్రభుత్వం చేనేత కార్మికులకు పూర్తి అండగా ఉంటుంది.

## భావి తరాలకు డొక్కా సీతమ్మ గారి
# దాతృత్వం తెలియాలి

● మధ్యాహ్న భోజన పథకానికి అపర అన్నపూర్ణ పేరు సబబు ● ప్రభుత్వం నిర్వహించే కాంటీన్లను ఎన్టీఆర్ పేరుతో కొనసాగించాలి ● ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రతిపాదన



2 లో

*ప్రభుత్వం ఆగస్టు 15 నుంచి ప్రారంభించే కాంటీన్లకు పేరు ఖరారు విషయంలో ఒక ఆసక్తికర చర్చ చోటు చేసుకొంది. వీటికి ఎన్టీఆర్ గారి పేరుతో అన్నా కాంటీన్లు అని కొనసాగించాలా, డొక్కా సీతమ్మ గారి పేరు కూడా జోడించాలా అనే చర్చ వచ్చింది. ఈ సందర్భంగా 2019 వరకూ ఉన్న విధంగా అన్నా కాంటీన్లు అని కొనసాగించాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సూచించారు. అపర అన్నపూర్ణ డొక్కా సీతమ్మ గారి పేరు పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకానికి నిర్ణయించిన క్రమంలో కాంటీన్లకు ఎన్టీఆర్ పేరును కొనసాగించవచ్చని ప్రతిపాదనను ముందుకు తీసుకువెళ్లారు.*

## వయనాడ్ విషాదం..జాతీయ విపత్తుగా ప్రకటించాలి



● లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ● కేంద్రం బాధిత కుటుంబాలకు అండగా నిలవాలి ● సమగ్ర పునరావాసం కల్పించాలి ● సహాయం చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు : రాహుల్

వివరాలు-6లో

## భూ సమస్యలను పరిష్కరిస్తాం

● తిరుమలగిరి సాగర్ మండలాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక ● రాష్ట్ర రెవిన్యూ ప్రిన్సిపల్ కార్యదర్శి, భూ పరిపాలన ఛీఫ్ కమిషనర్ నవీన్ మిట్టల్



7 లో

సూర్య వెబ్‌సైట్

సూర్య ఈ - పేపర్

## అక్టోబర్ 1న నూతన
# మద్యం పాలసీ

● గత పాలకులు మద్యం ఆదాయం కోసం అడ్డదారులు తొక్కారు ● కమీషన్ల కోసం కల్తీ బ్రాండ్లను ప్రజల నెత్తిన రుద్దారు ● కల్తీ మద్యం నుండి రాష్ట్ర ప్రజలకు విముక్తి కల్పిస్తాం ● పాత బ్రాండ్లు తీసుకొచ్చేందుకు ప్రాధాన్యమిస్తాం ● ఆదాయం కంటే ప్రజల ప్రాణాలే మాకు ముఖ్యం ● మద్యం ఎంఎన్‌సీ ప్రతినిధులతో సమావేశంలో గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర




2 లో

# హోమ్ మంత్రితో సునీత భేటీ

● తన తండ్రి హత్య కేసులో జరిగిన అన్యాయంపై అనితకు ఆమె వివరించారు ● ప్రస్తుతం సీబీఐ విచారణలో ఉన్న కేసుకు సంబంధించి సంపూర్ణ సహకారం ఉంటుందని అనిత భరోసా ఇచ్చారు



2 లో

## రేవంత్... పదవి శాశ్వతం కాదు.. గుర్తు పెట్టుకో

● ఎంబీబీఎస్ కోర్సుల ప్రవేశాల కోసం జారీ చేసిన జీవో 33పై ఆగ్రహం ● జీవో 33తో తెలంగాణ బిడ్డలే నాన్ లోకల్ అయ్యే పరిస్థితి ఉంటుందని వ్యాఖ్య ● మన ఉద్యోగాలు మనకే అనే ఉద్దేశంతో తాము 114 జీవోను తెచ్చామన్న హరీశ్ రావు



6 లో

## అంతా ఇంతే!




శ్రావణ శుక్రవారం కానుకా... సార్

## జగన్ కేసుల కాలయాపన
# ఎందుకు?



6 లో

జగన్ అక్రమాస్తుల కేసుల విచారణను వీలైనంత వేగంగా పూర్తి చేయాలని సుప్రీంకోర్టు.. సీబీఐ కోర్టును ఆదేశించింది. రఘురామ కృష్ణరాజు దాఖలు చేసిన పిటిషన్పై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. జగన్ అక్రమాస్తుల కేసుపై జరుగుతోన్న విచారణలో కాలయాపనపై జస్టిస్ సంజీవ్ ఖన్నా అసహనం వ్యక్తం చేశారు.

● సుప్రీంకోర్టు ధర్మాసనం ఆగ్రహం ● రఘురామ కృష్ణరాజు దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ ● చార్జిషీట్లు దాఖలు చేసి పన్నెండేళ్లు దాటినా ముందుకు సాగలేదని ఆరోపణ ● ట్రయల్స్ ముందుకు సాగకుండా డిశ్చార్జ్ పిటిషన్లు వేస్తున్నారన్న సిబిఐ ● వేగంగా విచారణ పూర్తి చేయాలని సుప్రీం కీలక ఆదేశాలు

# వినేష్ అనర్హతపై కలకలం

● అంతర్జాతీయ రెజ్లింగ్ అసోసియేషన్ ముందు భారత్ తీవ్ర నిరసన ● చేసిన ప్రయత్నాలు వెల్లడించిన కేంద్ర మంత్రి ● పార్లమెంటులో కేంద్రం అధికారిక ప్రకటన ● పార్లమెంటు నుంచి విపక్షాల వాకౌట్



6 లో

## శ్రీలంకలో మరోసారి తెరపైకి రాజపక్సా కుటుంబం



6 లో

● అధ్యక్ష ఎన్నికల బరిలో రాజపక్సా వారసుడు ● ఎస్ఎల్పీపీ పక్షాన బరిలోకి నమల్ ● మహీంద్రా రాజపక్సా కుమారుడే నమల్ ● అధ్యక్ష ఎన్నికల్లో నలుగురి మధ్యే ప్రధాన పోరు



# భావి తరాలకు డొక్కా సీతమ్మ దాతృత్వం తెలియాలి

ఏపీ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : ప్రభుత్వం ఆగస్టు 15 నుంచి ప్రారంభించే కాంటీన్లకు పేరు ఖరారు విషయంలో ఒక ఆసక్తికర చర్చ చోటు చేసుకొంది. వీటికి ఎన్టీఆర్ గారి పేరుతో అన్నా కాంటీన్లు అని కొనసాగించాలా, డొక్కా సీతమ్మ గారి పేరు కూడా జోడించాలా అనే చర్చ వచ్చింది. ఈ సందర్భంగా 2019 వరకూ ఉన్న విధంగా అన్నా కాంటీన్లు అని కొనసాగించాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సూచించారు. అపర అన్నపూర్ణ డొక్కా సీతమ్మ గారి పేరు పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకానికి నిర్ణయించిన క్రమంలో కాంటీన్లకు ఎన్టీఆర్ పేరును కొనసాగించవచ్చని ప్రతిపాదనను ముందుకు తీసుకువెళ్లారు. డొక్కా సీతమ్మ గారి పేరుతో మధ్యాహ్న భోజన పథకాన్ని కొనసాగిస్తే ప్రతి విద్యార్థికి సీతమ్మ గారి గొప్పదనం తెలుస్తుందని, పాఠశాల స్థాయిలో విశిష్ట వ్యక్తులు, దాతృత్వం కలిగినవారి పేర్లు మీద పథకాలు ఉండటం వల్ల భావితరాలకు మేలు కలుగుతుందని పవన్ కళ్యాణ్ అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా తాను పాఠశాల దశలో ఉండగా డొక్కా సీతమ్మ గారి గురించి చదివిన విషయాన్ని జ్ఞప్తికి తెచ్చుకున్నారు. కంబాల కృష్ణమూర్తి గారు రాసిన అమృతవాక్కులు అనే సంకలనాన్ని మా నాన్నగారు ఇచ్చారు. అందులో డొక్కా సీతమ్మ గారి దాన గుణాన్ని, ఆకలి అన్న వారికి అర్ధరాత్రి వేళ కూడా వండివార్చి పెట్టేవారనీ, అంతర్వేది దర్శనానికి బయలుదేరితే... దారిలో తన ఇంటికి భోజనానికి యాత్రికులు వస్తున్నారని తెలిసి దైవ దర్శనానికి వెళ్లకుండా వెనక్కి వచ్చి ఆకలి తీర్చారని చదివాను. ఆ రోజు నుంచి డొక్కా సీతమ్మ గారి దాతృత్వ భావనలు గుర్తుకు వస్తూనే ఉంటాయని పవన్ కళ్యాణ్ ప్రస్తావించారు. స్కూలు విద్యార్థులకు భోజనం అందించే పథకానికి డొక్కా సీతమ్మ గారి పేరు ఉండటం వల్ల భావి తరాలకు విలువలు అందించగలమన్నారు.




# ముగ్గురు పిల్లలున్నా

# స్థానిక ఎన్నికలలో పోటీ చేయొచ్చు

● పట్టాదారు పాస్ పుస్తకాలపై ఇక క్యూఆర్ కోడ్ ● జి.ఓ.ఆర్టీ 217, 144 ల రద్దుకు ఆమోదం ● నూతన వైద్య కళాశాలల మంజూరైన పోస్టులకు అదనంగా మరి 380 పోస్టుల భర్తీ ● నైపుణ్యం కలిగిన ఏజెన్సీ (కన్సల్టెంట్ )ని ఏర్పాటు చేసేందుకు నిర్ణయం ● 1 అక్టోబర్, 2024 నుండి కొత్త మద్యం విధానం అమలుకు ఆమోదం ● అనేక అంశాలపై ఏపీ కేబినెట్ కీలక నిర్ణయాలు

వెల్లడించిన మంత్రి కొలుసు పార్థసారధి



ఏపీ బ్యూరో,సూర్య ప్రధాన ప్రతినిధి ః రాష్ట్ర మంత్రి మండలి సమావేశం బుధవారం జరిగింది. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలు నిర్ణయాలను తీసుకుంది. వీటి వివరాలను వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయం నాల్గవ భవనం ప్రచార విభాగంలో రాష్ట్ర సమాచార పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖా మంత్రి కొలుసు పార్థసారధి మీడియాకు వివరించారు. గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను రద్దు చేస్తూ నిర్ణయం తీసుకుంది. అదే విధంగా కొన్నిసంస్థలపై ఉన్న నిషేధాన్ని కొనసాగించాలని నిర్ణయం తీసుకుంది. వాటికి సంబంధించిన వివరాలు ఇవి

1.సాధారణ పరిపాలన శాఖ: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సెక్యూరిటీ యాక్ట్ – 1992, సెక్షన్ 3 ప్రకారం (ఎ) కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (మావోయిస్టు) మరియు రివల్యూషనరీ డెమోక్రటిక్ ఫ్రంట్ (ఆర్.డి.ఎఫ్) సంస్థలపై ప్రస్తుతం ఉన్న నిషేధాన్ని మరో ఏడాది పాటు పొడిగించేందుకు చేసిన ప్రతిపాదనలకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది. వామపక్ష భావజాలం ప్రచారం చేస్తూ, ఘర్షణ వాతావరణానికి తెరతీయడం, రాష్ట్ర ప్రభుత్వ కార్యక్రమాలకి వ్యతిరేకంగా, ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్తులకు భంగం కలిగించడం, శాంతియుత వాతావరణానికి విఘాతం కల్గించడం, వ్యక్తులు మరియు పోలీసు సిబ్బంది హత్యలకు కారణమవుతున్న నేపథ్యంలో ఏ కేటగిరిలోని సంస్థలపై 17.8.2005 నుండి ఈ నిషేధం కొనసాగుతుంది. అదే విధంగా బి కేటగిరి లోని సంస్థలను చట్టవ్యతిరేక సంఘాలుగా గుర్తిస్తూ 9.8.2012 నుండి నిషేధం కొనసాగిస్తున్నారు.

**2.పశు సంవర్థక, పాడి పరిశ్రమాభివృద్ధి మరియు మత్స్య శాఖ:**

పశు సంవర్థక శాఖకు సంబంధించి తేదీ.18.08.2021 నాడు జారీ చేసిన జి.ఓ.ఆర్టీ నంబర్ 217 మరియు మత్స్యశాఖకు సంబంధించి తేదీ.08.09.2020 నాడు జారీ చేసిన జి.ఓ.ఆర్టీ సంఖ్య. 144 ల రద్దు కోసం చేసిన ప్రతిపాదనలకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది.

గత 3 దశాబ్దాలుగా మత్స్యకార సంపద, సంక్షేమం కోసం నామ మాత్రపు లీజుతో ప్రభుత్వ చెరువులను మత్స్యకార సహకార సంఘాలకు ఇచ్చారు. కానీ మత్స్యకారుల హక్కులకు భంగం కలిగించేలా జీవో నెంబర్ లు 144, 217 లను గత ప్రభుత్వం జారీ చేసింది. అందులో భాగంగా పైలట్ ప్రాజెక్ట్ క్రింద ఎస్పీఎస్ఆర్ నెల్లూరు జిల్లాలో 25,380 హెక్టార్ల నీటి విస్తీర్ణంతో ఎంపిక చేసిన 27 ప్రభుత్వ చెరువులను 6592 మత్స్యకార కుటుంబాలకు చెందిన 27 మత్స్యకార సహకార సంఘాలకు కేటాయించకుండా పబ్లిక్ ఆక్షన్ వేయడం జరిగింది. ఇచ్చిన జీవోలను నిలువుదల చేయాలని కోరుతూ ఇప్పటికే అనేక మంది మత్స్యకారులు, సంఘాలు 11 కోర్టు కేసులు ( 7 రిట్ పిటిషన్లు, 4 రిట్ అప్పీల్స్) వేసి న్యాయస్థానాలను ఆశ్రయించారు. దీంతో ఇచ్చిన జీవోలు అమలుకు సాధ్యం కాలేదు. అదే విధంగా సదరు జీవోలకు అనుగుణంగా ఇన్ లాండ్ ఫిషర్ మేన్ కో ఆపరేటివ్ సొసైటీలను ఏర్పాటుపై ఎలాంటి స్పష్టత లేదు. తద్వారా మత్స్యకార సంఘాలకు చెరువులు కేటాయించని కారణంగా జీవనోపాధికి ఆటంకం ఏర్పడింది. మధ్యేమార్గంగా అక్రమార్కులు లబ్ధి పొందుతున్నారు. దీనికి చెక్ పెట్టేందుకు చేప పిల్లల పెంపకం నుండి మార్కెటింగ్ వరకు మధ్య దళారీ వ్యవస్థ లేకుండా మత్స్యకారుల కుటుంబాలకు లబ్ధి చేకూర్చేలా ఒక సమగ్రమైన యాక్షన్ ప్లాన్ రూపొందించాలని కేబినెట్ ముఖ్యమంత్రి సూచించారు. పర్యాటక అభివృద్ధి కోణంలో కూడా ఆలోచించాలని తద్వారా ఉపాధి, ఆర్థిక ప్రగతి కలుగుతాయని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. మత్స్యకారుల ఆర్థిక పరిస్థితి, జీవన ప్రమాణాల పెంపు లక్ష్యంగా తరువాతి కేబినెట్ కు యాక్షన్ ప్లాన్ అందించాలని సూచించారు.

దీంతో సదరు 27 మత్స్యకార సంఘాలకు మేలు కలించాలని, పైన పేర్కొన్న 11 కేసులను పరిష్కరించాలనే సదుద్దేశ్యంతో సంబంధిత జీవోలను రద్దు చేయాలనే ప్రతిపాదనకు కేబినెట్ ఆమోదం తెలియజేసింది. తద్వారా రాష్ట్రంలోని లక్షలాది మత్స్యకారులకు మేలు జరుగుతుందని భావిస్తున్నాం.

**3.పురపాలక పరిపాలన మరియు పట్టణాభివృద్ధి శాఖ:**

ఇద్దరు పిల్లలకు మించి ఉన్న వారు మునిసిపల్ కార్పొరేషన్ మరియు మున్సిపాలిటీ ఎన్నికల్లో పోటీచేయడం మరియు సభ్యులుగా కొనసాగడాన్ని నిషేధిస్తూ ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ కార్పొరేషన్ చట్టం – 1955 మరియు ఆంధ్రప్రదేశ్ మున్సిపాల్టీస్ చట్టం 1965 లో చేసిన చట్ట సవరణల రద్దు కోసం చేసిన ప్రతిపాదనలకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది. తగ్గుతున్న పునరుత్పత్తి రేటును పరిగణలోకి తీసుకుంటూ మారుతున్న సామాజిక, ఆర్థిక అవసరాలను, జనాభా స్థిరీకరణ, జనాభా సమతౌల్యతను దృష్టిలో ఉంచుకొని సదరు నిబంధనలు ప్రస్తుత పరిస్థితులకు వర్తించనందున ఆ చట్టసవరణల రద్దుకు మంత్రిమండలి ఆమోదం తెలిపింది.

జాతీయ పునరుత్పత్తి రేటు 2.1 గా ఉంటే ఆంధ్రప్రదేశ్ లో అది కేవలం 1.5 గా ఉంది. ప్రస్తుత లెక్కల ప్రకారం మన రాష్ట్రంలో పురుషుల పునరుత్పత్తి వయసు సగటున 32.5 కాగా 2047 నాటికి 40 ఏళ్లుకానుంది. అదే విధంగా మహిళల్లో ప్రస్తుత పునరుత్పత్తి వయస్సు సగటున 29 సంవత్సరాలు కాగా అది 2047 నాటికి 38 సంవత్సరాలు కానుంది. ఆర్థికాభివృద్ధికి దోహదపడే పనిచేసే వ్యక్తుల సంఖ్య గణనీయంగా తగ్గనుంది. అదే విధంగా ప్రస్తుతం ఏపీలో 60 ఏళ్లకు పై బడిన వ్యక్తుల సంఖ్య 11 శాతం కాగా ఇది 2047 నాటికి 19 శాతం కానుంది. ఇదే వయస్సు జాతీయ స్థాయిలో ప్రస్తుతం 10 శాతంగా ఉండగా, 2047 నాటికి 15 శాతం కానుంది. ఈ నేపథ్యంలో ఇద్దరి కంటే ఎక్కువ మంది పిల్లలున్న వారిని అర్బన్ లోకల్ బాడీస్ లో అనర్హులుగా ప్రకటిస్తూ 1955, 1965, 1994 లో వచ్చిన ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ చట్టాలకు సవరణల ద్వారా కుటుంబ నియంత్రణ ప్రోత్సహించేలా జత చేసిన నిబంధనలను రద్దు చేసే ప్రతిపాదనలకు రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలిపింది.

**4.పంచాయతీరాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖ:**

ఇద్దరు పిల్లలకు మించి ఉన్నవారు పంచాయతీ ఎన్నికల్లో పోటీచేయడం మరియు సభ్యులను అనర్హులుగా ప్రకటిస్తూ ఆంధ్రప్రదేశ్ పంచాయితీ రాజ్ చట్టం – 1994 లోని సెక్షన్ 19 కు చేసిన సవరణను రద్దు చేసేందుకు చేసిన ప్రతిపాదనలకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది.

1980, 1990 దశకాల్లో జనాభా పెరుగుదల అధికంగా ఉన్న నేపథ్యంలో జనాభా నియంత్రణను అట్టడుగు స్థాయికి తీసుకువెళ్లాల్సిన పరిస్థితి. ఈ క్రమంలో గ్రామ పంచాయతీలు, మండల ప్రజా పరిషత్, జిల్లా ప్రజా పరిషత్ లలో పోటీ చేసే వాళ్లకు ఏపీ పంచాయతీరాజ్ చట్టం – 1994 లోని సెక్షన్ 19 ప్రకారం ఇద్దరు పిల్లలు చాలు అని చట్ట సవరణ చేయడం జరిగింది. కానీ ఈ చట్టంను 30 ఏళ్ల పాటు అమలు పరిచిన ప్రభుత్వం సంతానోత్పత్తి రేటు, పనిచేయగల సామర్థ్యం ఉన్న జనాభా గణనీయంగా తగ్గుతున్న నేపథ్యంలో పిల్లల సంఖ్య పై నిషేధం అనవసరమని భావిస్తూ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రతిపాదన చేసిన ఈ సవరణకు మంత్రి మండలి ఆమోదం తెలిపింది.

**5.హెల్త్ అండ్ మెడికల్ ఫ్యామిలీ వెల్ఫేర్:**

ఫేజ్–1 క్రింద నేషనల్ మెడికల్ కమిషన్ నిబంధనలకు అనుగుణంగా విజయనగరం, రాజమహేంద్రవరం, ఏలూరు, మచిలీపట్నం, నంద్యాలలో 150 సీట్లతో నిర్మించిన నూతన వైద్య కళాశాలలకు సంబంధించి గతంలో మంజూరైన పోస్టులకు అదనంగా 380 పోస్టుల భర్తీ చేపట్టాలన్న ప్రతిపాదనకు మంత్రిమండలి ఆమోదం తెలిపింది. ఫేజ్–2 క్రింద పాడేరు, మార్కాపూర్, పులివెందుల, ఆదోని మరియు మదనపల్లె లలో నిర్మించిన నూతన వైద్య కళాశాలలో 2024 - 25 విద్యా సంవత్సరంకు సంబంధించి 100 సీట్లతో మొదటి సంవత్సరం ఎంబీబీఎస్ కోర్సును ప్రారంభించడానికి అనుమతి కోరుతూ చేసిన ప్రతిపాదనకు కేబినెట్ ఆమోదం తెలిపింది.. నేషనల్ మెడికల్ కమిషన్ నూతన నిబంధల అవసరాలకు అనుగుణంగా నిర్ణయం తీసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా గుజరాత్ పీపీపీ మోడల్ ను అధ్యయనం చేయాల్సిందిగా ముఖ్యమంత్రి కేబినెట్ కు సూచించారు.

**6.వాటర్ రిసోర్సెస్:**

జీవో నెంబర్. 40 రద్దు కోసం జలవనరుల శాఖ చేసిన ప్రతిపాదనకు మంత్రి మండలి ఆమోదం తెలిపింది.

తేదీ: 11.05.2023 నాడు జారీ చేసిన జీవో నెంబర్ 40 ప్రకారం నంద్యాల జిల్లా సుండిపెంట (శ్రీశైలం ప్రాజెక్టు) గ్రామ పంచాయతీకి కేటాయించిన భూమిని రద్దు చేస్తూ నీటిపారుదల శాఖకు బదిలాయించే ప్రతిపాదనను రాష్ట్ర మంత్రిమండలి ఆమోదం తెలిపింది. జలవనరుల శాఖకు బదిలీ చేసిన 208.74 ఎకరాల భూమిలో చేపట్టిన నిర్మాణాలను భవిష్యత్ అవసరాల దృష్ట్యా యథాతథంగా ఉంచాలని చేసిన ప్రతిపాదనను మంత్రిమండలి ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ తిరుపతి అధ్యాత్మిక క్షేత్రం తర్వాత రాష్ట్రంలో అత్యధికంగా టెంపుల్ టూరిజం, రెవెన్యూ ఉన్న దేవాలయం శ్రీశైలం అని, ఈ శ్రీశైలం ప్రాజెక్టు నీటి విడుదల సందర్భంగా అత్యధిక భక్తులు, పర్యాటకులు సుండిపెంట , శ్రీశైలం ప్రాజెక్టుకు, దేవాలయానికి వస్తున్న తరుణంలో ఆదాయం పెంచేందుకు, పర్యాటకాభివృద్ధికి ఈ స్థలాన్ని భవిష్యత్ లో బదలాయించాలని సూచించారు.

**7.రెవెన్యూ (ఎక్సైజ్):**

2014-19 మరియు 2019-24 మధ్య ఎక్సైజ్ పాలసీల (తులనాత్మక విశ్లేషణ) మరియు వే ఫార్వర్డ్ మదింపు కోసం మంత్రుల మండలిలో చర్చకు ప్రతిపాదన..

2014–19తో పోలిస్తే ప్రస్తుత పాలసీ ఫ్రేమ్వర్క్ లోపభూయిష్టంగా, పారదర్శకంగా లేకుండా ఉంది. పర్యవేక్షణలో అంతరాలు, విఫలమైన పునర్నిర్మాణం, నేరాలు మరియు ఆదాయ నష్టాల పెరుగుదలకు దారితీశాయి. రానున్న నెలన్నర రోజుల్లో ఎక్సైజ్ శాఖను మెరుగైన పర్యవేక్షణ మరియు నియంత్రణకై ఏకీకృత పరిపాలన విధానం క్రిందకు తెచ్చేందుకు ఎక్సైజ్ శాఖను పునర్నిర్మించేందుకు ప్రతిపాదించబడింది. మద్యం రిటైల్ అమ్మకాలు, ప్రొక్యూర్ మెంట్, క్వాలిటీ కంట్రోల్, ధరల నిర్ధారణ విధానాలకు సంబంధించి ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, కేరళ, తమిళనాడు, కర్ణాటక మరియు తెలంగాణ రాష్ట్రాల్లో అమలు చేస్తున్న విధానాలను అధ్యయనం చేసేందుకు మన రాష్ట్రానికి చెందిన అధికారుల బృందం ఇప్పటికే ఆయా రాష్ట్రాల్లో పర్యటిస్తున్నాయి..

నైపుణ్యం కలిగిన ఏజెన్సీ (కన్సల్టెంట్ ) ని ఏర్పాటు చేసేందుకు చర్యలు..

మంత్రివర్గం యొక్క తుది ఆమోదానికి ముందు ఎక్సైజ్ శాఖ ప్రతిపాదనను అధ్యయనం చేయడానికి కేబినెట్ సబ్కమిటీ ఏర్పాటు..

సెప్టెంబర్ 5, 2024 నాటికి ఆమోదం ప్రక్రియను పూర్తి చేసి, 1 అక్టోబర్, 2024 నుండి కొత్త మద్యం విధానం అమలు..

కొత్తగా అమల్లోకి రానున్న నూతన మద్యం విధానంలో రాష్ట్రంలోకి అక్రమ మద్యం రవాణా, గంజాయి, నాన్ డ్యూటీ పెయిడ్ మద్యం (ఎన్డీపీఎల్) ప్రవేశించకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.. అంతేకాక అల్పాదాయ వర్గాల వారికి అందుబాటు ధరలకు నాణ్యమైన మద్యాన్ని అందుబాటులో ఉంచేందుకు అవకాశం కలుగుతుంది..

రానున్న 60–65 రోజుల్లో మార్కెట్ డిమాండ్ కు అనుగుణంగా పారదర్శకంగా మద్యం సేకరణ విధానాన్ని ఆటోమేటెడ్ సిస్టం క్రింద అందుబాటులోకి తీసుకురానున్నాం..

అంతేకాక, ఎఫ్ఎస్ఎస్ఏఐ (ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా) మరియు బీఐఎస్ (బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ మార్గదర్శకాలకు అనుగుణంగా కాంప్రహెన్సివ్ క్వాలిటీ కంట్రోల్ విధానాన్ని అమల్లోకి తీసుకురానున్నాం. అక్రమ మద్యం (ఐడీ లిక్కర్) నియంత్రణపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు చేపట్టనున్నాం..

ఇతర రాష్ట్రాల్లో నిర్వహిస్తున్న డీ–అడిక్షన్ మరియు రిహబిలిటేషన్ విధానాన్ని అధ్యయనం చేసి మన రాష్ట్రంలో కూడా సమర్థవంతంగా ఆ కేంద్రాలను నిర్వహించేందుకు చర్యలు చేపట్టడం జరుతుంది..

దేశవ్యాప్తంగా అమలవుతోన్న ఉత్తమ విధానాలను తెలుసుకోవడానికి ఈ అధ్యయన బందాలు పర్యటిస్తున్నాయి. 2014–19 మధ్య మా ప్రభుత్వం అధికారంలో ఉండగా ఎక్సైజ్ విధానాన్ని చాలా పారదర్శకంగా అమలు చేయడం జరిగింది..కానీ, 2019–24లో గత ప్రభుత్వం ఎక్సైజ్ విధానాన్ని అస్తవ్యస్తం చేయడంతో చాలా దుష్పరిణామాలు చోటుచేసుకున్నాయి..

ముఖ్యంగా ఐఎంఎఫ్ఎల్ మద్యం అమ్మకాలు 232 లక్షల కేసులకు, బీరు అమ్మకాలు 436 లక్షల కేసులకు పడిపోవడంతో రాష్ట్ర ప్రభుత్వానికి 2019–24లో రూ.18,860 కోట్లు నష్టం వాటిల్లింది. ఆ సమయంలో సరిహద్దు రాష్ట్రాలైన తెలంగాణ, కర్ణాటకలు మద్యం అమ్మకాల్లో అన్నివిధాల లబ్ధి పొందాయి.

అంతేకాక, గత ప్రభుత్వం మద్యం అమ్మకాల సప్లై చైన్ ఉత్పత్తి నుంచి రిటైల్ అమ్మకాల వరకు గుత్తాధిపత్యం చెలాయించింది..వివిధ మల్టీ నేషనల్ కంపెనీలు మరియు జాతీయస్థాయి ప్రముఖ బ్రాండ్ల మద్యాన్ని మార్కెట్ లో అందుబాటులో లేకుండా చేసింది.. నాణ్యత లేని మద్యం అమ్మకాలతో లక్షలాదిమంది ప్రజల ఆరోగ్యంపై ప్రతికూలం ప్రభావం చూపించింది..

# అక్టోబర్ 1న నూతన మద్యం పాలసీ

● గత పాలకులు మద్యం ఆదాయం కోసం అడ్డదారులు తొక్కారు ● కమీషన్ల కోసం కల్తీ బ్రాండ్లను ప్రజల నెత్తిన రుద్దారు ● కల్తీ మద్యం నుండి రాష్ట్ర ప్రజలకు విముక్తి కల్పిస్తాం ● పాత బ్రాండ్లు తీసుకొచ్చేందుకు ప్రాధాన్యమిస్తాం ● ఆదాయం కంటే ప్రజల ప్రాణాలే మాకు ముఖ్యం ● మద్యం ఎంఎన్సీ ప్రతినిధులతో సమావేశంలో గనులు, భూగర్భ వనరులు,

ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర



ఏపీ బ్యూరో,సూర్య ప్రధాన ప్రతినిధి : ప్రజల ప్రాణాలు హరిస్తున్న కల్తీ మద్యం బ్రాండ్ల నుండి విముక్తి కలిగించేలా త్వరలోనే మెరుగైన పాలసీ తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నామని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. సచివాలయంలో మద్యం తయారీ ఎంఎన్సీ కంపెనీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు. 2014-19 మధ్య కాలంలో రాష్ట్ర ప్రభుత్వం మద్యాన్ని కేవలం ప్రైవేటు వ్యాపారంగా మాత్రమే భావించింది. దేశం మొత్తం లభించే బ్రాండ్లను ఏపీలో కూడా అందుబాటులో ఉంచింది. కానీ, 2019లో ప్రభుత్వం మారిన తర్వాత నాటి పాలకులు మద్యాన్ని ఆదాయ వనరుగా మార్చుకుని ప్రజల ప్రాణాలు హరించారు. మద్యం ఆదాయాన్ని తాకట్టు పెట్టి అప్పులు తెచ్చే పరిస్థితికి రాష్ట్రాన్ని దిగజార్చారు. సంక్షేమ పథకాలకు, మద్యం అమ్మకాలకు ముడి వేసి ప్రజల ఆదాయాన్ని హరించారు. అమ్మకాలకు, కొనుగోళ్లకు సంబంధమే లేకుండా వేల కోట్లు దోచుకున్నారు. దేశమంతా డిజిటల్ పేమెంట్ల వైపు వెళ్తుంటే ఏపీలో మాత్రం క్యాష్ అండ్ క్యారీ విధానంలో మద్యం అమ్మకాలతో వేల కోట్ల లూటీ చేశారు. వినియోగదారుడు తనకు నచ్చిన బ్రాండ్ కాకుండా.. ధర చెప్పి కొనుగోలు చేసే దుస్థితి కల్పించారు. పైగా కల్తీ మద్యం తీసుకొచ్చి వేలాది మంది మరణాలకు, అనారోగ్యానికి కారమయ్యారు. రాష్ట్రంలో జరిగిన మద్యం అక్రమాలను త్వరలోనే బయటపెడతాం. అక్టోబర్ 1 నాటికి నతన మద్యం పాలసీని అందుబాటులోకి తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నాం. అందుకోసం మెరుగైన పాలసీల కోసం అధ్యయనం చేస్తున్నాం. నాణ్యమైన మద్యం బ్రాండ్లను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు మంత్రి కొల్లురవీంద్ర పేర్కొన్నారు.

# రేవంత్.. సోదరులపై విరుచుకుపడ్డ బాల్క సుమన్

తెలంగాణ బ్యూరోప్రతినిధి: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. సీఎం రేవంత్ తన సోదరులను తెలంగాణ మీదకు వదిలేశారని.. అతని సోదరులకు ఏ పదవులు లేకున్నా రాజ్యాంగేతర శక్తులుగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. సాక్షాత్తూ అసెంబ్లీ కమిటీ హాల్లో రేవంత్ సోదరుడు తిరుపతి రెడ్డి ఏ హోదా లేకున్నా స్పీకర్ దగ్గర వికారాబాద్ రివ్యూ



మీటింగ్లో పాల్గొన్నారని తెలిపారు. కొడంగల్లో తిరుపతి రెడ్డి కల్యాణ లక్ష్మి చెక్కులను పంచుతుంటే తమ జెడ్పిటీస్ మహిపాల్ అడ్డుకున్నారని తెలిపారు. రేవంత్ మరో సోదరుడు కొండల్ రెడ్డికి ఏ హోదా ఉందని అధికారులతో కలిసి ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్నారని ప్రశ్నించారు. రేవంత్ అమెరికా పర్యటనలో స్వచ్ బయోతో రాష్ట్ర ప్రభుత్వం వెయ్యి కోట్ల ఒప్పందం కుదుర్చుకుందని... ఆ కంపెనీ రేవంత్ మరో సోదరుడు ఎనుముల జగదీశ్ రెడ్డిది అని తెలిపారు. పదిహేను రోజుల క్రితమే ఆ కంపెనీ ఏర్పాటయ్యిందని అన్నారు. ఇవే కాకుండా రేవంత్ సోదరుల ఆధ్వర్యంలో నాలుగు సంస్థలు ఏర్పాటు అయ్యాయన్నారు. ఈ సంస్థల ద్వారానే రేవంత్ బ్లాక్ మనీని వైట్గా మారుస్తున్నారని విమర్శలు గుప్పించారు.


రేవంత్ సోదరులు రియల్టర్లను బెదిరించి విచ్చల విడిగా అవినీతికి పాల్పడుతున్నారని మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ వ్యాఖ్యలు చేశారు

# హోమ్ మంత్రి అనితతో వైఎస్ సునీత భేటీ



ఏపీ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : హోం మంత్రి వంగలపూడి అనితతో వైఎస్ వివేకానందరెడ్డి కుమార్తె సునీత భేటీ అయ్యారు. తన తండ్రి హత్య కేసులో జరిగిన అన్యాయంపై అనితకు వివరించారు. వివేకా హత్య తదనంతర పరిణామాలను హోం మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. గత ప్రభుత్వ హయాంలో స్థానిక పోలీసులు హంతకులకు అండగా నిలిచారనీ, వారిపై చర్యలు తీసుకోవాలని సునీత కోరారు. కేసు విచారణ జరుపుతున్న సీబీఐ అధికారులపై తప్పుడు కేసులు పెట్టడంతో పాటు సాక్ష్యుల్ని బెదిరించి పోలీసులు కేసును నీరుగార్చే విధంగా వ్యవహరించారని తెలిపారు.తప్పు చేసిన పోలీసులను వదిలిపెట్టం: ప్రస్తుతం సీబీఐ విచారణలో ఉన్న కేసుకు సంబంధించి సంపూర్ణ సహకారం ఉంటుందని అనిత భరోసా ఇచ్చారు. దోషులకు శిక్షపడేలా చూసేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందన్న అనిత, తప్పు చేసిన పోలీసులను వదిలిపెట్టమని స్పష్టం చేశారు.

# చేనేతకు జీవం : ఏపీ డిప్యూటీ సీఎం



ఏపీ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ రంగంపై ఆధారపడ్డ ప్రతి ఒక్కరికీ ఎపి ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పిలువు ఇచ్చారు. హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు. ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. దేశంలో అతిపెద్ద అసంఘటిత ఆర్థిక కార్యకలాపాలు నిర్వహించే రంగాల్లో చేనేత ఒకటి అని.. చేనేత ఒక కళాత్మకమైన పరిశ్రమ అని అన్నారు. ఏపీలో ఉప్పాడ, మంగళగిరి, చీరాల, పెడన, పొందూరు, ఎమ్మిగనూరు, వెంకటగిరి చేనేత వస్త్రాలకు ప్రతీకలు అంటూ ఆయన వ్యాఖ్యానించారు. దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో చేనేత వస్త్రాలు అనే మాట ప్రజల్లో ఒక భావోద్వేగాన్ని నింపాయన్నారు. అలాంటి చేనేత రంగానికి జీవం పోయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. రాష్ట్రంలోని ఎన్.డి.ఏ. ప్రభుత్వం కచ్చితంగా చేనేత పరిశ్రమకు, ఈ రంగంపై ఆధారపడ్డ నేతన్నలకు భరోసా ఇస్తుందని హామీ ఇచ్చారు. అదే విధంగా ప్రజలు సైతం ఈ రంగానికి ప్రోత్సాహం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. కొన్ని సంవత్సరాల కిందటే చేనేత వస్త్రాలకు బ్రాండ్ అంబాసిడర్గా ఉంటానని చెప్పినట్లు పేర్కొన్నారు. ఆ క్రమంలోనే నేత వస్త్రాలను ధరిస్తున్నానని వెల్లడించారు. యువత, ఉద్యోగులు వారంలో ఒక రోజైనా చేనేత వస్త్రాలను ధరిస్తే ఈ రంగంపై ఆధారపడ్డవారికి ధీమా కలుగుతుందని పవన్ స్పష్టం చేశారు.

# చేనేతకు చేయూతనిస్తాం : సుజనా చౌదరి



ఏపీ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : చేనేత వస్త్రాలను ఆదరించి చేనేత కార్మికులను ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పశ్చిమ నియోజకవర్గ బిజెపి ఎమ్మెల్యే యలమంచిలి సత్యనారాయణ (సుజనా చౌదరి) అన్నారు. జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకొని సూర్యరావుపేటలోని ఎన్టీఆర్ జిల్లా బిజెపి కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమానికి బుధవారం హాజరయ్యారు. తొలుత మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా చేనేత కార్మికులకు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం సుజనా మాట్లాడుతూ చేనేత మగ్గాల పై ఆధారపడి అవస్థలు పడుతున్న చేనేత కార్మిక రంగాన్ని , కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. ఉద్యోగులు ప్రతి సోమవారం చేనేత వస్త్రాలు విధిగా ధరించాలన్నారు. మనదేశంలో వ్యవసాయ రంగం తర్వాత ఎక్కువ మంది ఉపాధి కల్పిస్తున్నది చేనేత రంగమేనని ఈ రంగాన్ని మరింత అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ప్రతి సంవత్సరం ఆగస్టు 7వ తేదీ జాతీయ చేనేత దినోత్సవం గా పాటించాలని 2015 లో కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. విదేశీ వస్త్రాల మోజులో పడకుండా ప్రజలు చేనేతను ప్రోత్సహించి చేయూత నివ్వాలన్నారు. వైసిపి ఐదేళ్ల పాలనలో నేతన్నల పరిస్థితి మరీ దారుణంగా తయారైందని చేనేత కార్మికులను ఆదుకోవడం కోసం తెలుగుదేశం హయాంలో అమలు చేసిన పథకాలను తిరిగి అమలు చెసి చేనేతకు పూర్వ వైభవం తేవడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తున్నారని అన్నారు. చేనేత కార్మికులకు బాసటగా నిలవాలని జనసేన అధినేత డిప్యూటీ సీఎం కొణిదల పవన్ కళ్యాణ్ పిలుపునిచ్చారని గుర్తు చేశారు. చేనేతను ధరిస్తూ తనను తాను చేనేత బ్రాండ్ అంబాసిడర్ గా ప్రకటించుకున్న పవన్ కళ్యాణ్ ను యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. నేతన్నల కళ్ళలో సంతోషాన్ని చూడటానికి ప్రధాని నరేంద్ర మోదీ తగిన ప్రోత్సాహాన్ని, సబ్సిడీలను, బ్యాంకు రుణాలను,అందజేసి చేనేతకు చేయూతనిస్తున్నారని తెలిపారు. అనంతరం బిజెపి నాయకులతో కలిసి చేనేత వాక్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా బిజెపి అధ్యక్షులు అడ్డూరి శ్రీరామ్, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజి చైర్మన్ నాగుల్ మీరా, బిజెపి నాయకులు శ్రీనివాస్ రాజు ,షేక్ బాజీ, బోగవల్లి శ్రీధర్, బి ఎస్ కే పట్నాయక్, అవ్వారు బుల్లబ్బాయి, మువ్వల వెంకటసుబ్బయ్య, కేఎస్ ఆర్ముగం, పైలా సోమినాయుడు, నరసరాజు, పోతిన బేసు కంటేశ్వరుడు, మహిళా మోర్చా అధ్యక్షురాలు యర్ర సునీత పాల్గొన్నారు.

# సీఎం దృష్టికి రియల్ ఎస్టేట్ సమస్యలు



ఏపీ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : రెవిన్యూ విభాగానికి సంబంధించి రియల్ ఎస్టేట్ రంగం ఎదుర్కొంటున్న సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళతామని రాష్ట్ర రెవిన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్ పి సిసోడియా తెలిపారు. నేషనల్ రియల్ ఎస్టేట్ డవలప్ మెంట్ కౌన్సిల్ (నెరెడ్కో) ప్రతినిధుల బృందం బుధవారం సచివాలయంలో సిసోడియాను కలిసి రియల్ ఎస్టేట్ పరిశ్రమ ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను వివరించింది. నారెడ్కో బృందంలో రాష్ట్ర అధ్యక్షుడు గద్దె చక్రధరరావు, సెక్రటరీ జనరల్ సీతారామయ్య, సెంట్రల్ జోన్ అధ్యక్షుడు సందీప్ మండవ, రాష్ట్ర కార్యనిర్వాహక ఉపాధ్యక్షుడు కిరణ్ పరుచూరి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోడె జగన్ తదితరులు ఉన్నారు. ఉన్నారు. ప్రధానంగా నెరెడ్కో ప్రతినిధులు గత ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ల్యాండ్ పార్శిల్ మ్యాప్ విధానాన్ని రద్దు చేయాలని, నాలా (నాన్ అగ్రికల్చరల్ ల్యాండ్ అసెస్మెంట్) పన్ను తగ్గించాలని కోరారు. ఉమ్మడి అభివృద్ధి ఒప్పందం (జెడిఎ) కోసం రిజిస్ట్రేషన్ ఛార్జీలు మినహాయింపుతో డెవలపర్లపై ఆర్థిక భారాన్ని తగ్గించాలని, మరిన్ని జాయింట్ డెవలప్మెంట్ ప్రాజెక్టలను ప్రోత్సహించేలా నిబంధనలు రూపొందించాలని కోరారు. వ్యవసాయ భూమిని రెసిడెన్షియల్ ల్యాండ్గా మార్చే సమయంలో పట్టణ ప్రాంతంలో స్క్వేర్ యార్డ్ రేట్ల ఆధారంగా మార్పిడి ఛార్జీలను విధిస్తోందని, దానికి బదులుగా ఎకరాలలో లెక్కించాలని నెరెడ్కో విన్నవించింది. విభిన్న సమస్యలను సానుకూలంగా పరిశీలించిన సిసోడియా అన్ని విషయాలను ముఖ్యమంత్రి దృష్టి తీసుకువెళతామని , ప్రభుత్వానికి అదాయం సమకూరేందుకు కూడా రియల్టర్లు సహకరించాలని కోరారు.

## చేనేత వస్త్రంపై మోడీ చిత్రం

● ప్రధానికి టీడీపీ ఎంపీ అపురూప కానుక

చేనేత దినోత్సవం వేళ బహూకరణ

● నేతన్నలకు మోడీ ధన్యవాదాలు



ఢిల్లీ: జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ప్రధాని నరేంద్ర మోడీకి తెలుగుదేశం పార్టీ ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అవురూప కానుకను అందజేశారు. ప్రధానిగా హ్యాట్రిక్ విజయం సాధించిన మోడీ లఘు చిత్రాన్ని ఓ చేనేత కుటుంబానికి చెందిన దంపతులతో ప్రత్యేకంగా నేయించారు. ఈ కానుకను ప్రధానికి స్వయంగా అందజేశారు. ఎంపీ అప్పలనాయుడు సూచన మేరకు ఈ చిత్రాన్ని విజయనగరం లోక్సభ నియోజకవర్గ పరిధిలోని ఎచ్చెర్ల అసెంబ్లీ నియోజకవర్గం లావేరు మండలానికి చెందిన బాసిన నాగేశ్వరరావు, లక్ష్మి దంపతులు జూన్ మొదటి వారం నుంచి 40 రోజుల పాటు శ్రమించి పూర్తి చేశారు. మూడు అడుగుల వెడల్పు, ఆరు అడుగుల పొడవు కలిగిన చేనేత వస్త్రంపై మోడీ చిత్రాన్ని తీర్చిదిద్దారు. బుధవారం స్వయంగా ఎంపీ అప్పలనాయుడు మోడీకి ఈ చిత్రపటాన్ని అందజేయగా.. ఆయన చాలా సంతోషం వ్యక్తం చేశారు. చాలా చాలా ధన్యవాదాలు అన్నారు. జాతీయ చేనేత దినోత్సవం రోజున ఈ కానుక అందుకోవడం ఓ తీయని జ్ఞాపకంగా భావిస్తున్నట్లు మోడీ తెలిపారు. 40 రోజులపాటు శ్రమించి చేనేత వస్త్రంపై రూపొందించిన బాసిన నాగేశ్వరరావు, లక్ష్మి దంపతులను ప్రధాని అభినందించారని అప్పల నాయుడు తెలిపారు. అంతేకాకుండా పీవీజీ రాజు జీవిత చరిత్ర వుస్తకాన్ని కూడా మోడీకి అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజు గురించి మోడీ అడిగారని తెలిపారు. అశోక్ గజపతిరాజు ఎలా ఉన్నారు? ఆయన ఆరోగ్యం ఎలా ఉంది? అని వాకబు చేశారన్నారు. పీవీజీ రాజు జీవిత చరిత్ర వుస్తకాన్ని ఇవ్వగానే నాలుగైదు పేజీలు తిరగేశారని.. ఆయన ఫొటోలను మోడీ పరిశీలనగా చూశారన్నారు. గుడ్.. గుడ్.. అని ప్రశంసించారని అప్పలనాయుడు తెలిపారు. పీవీజీ రాజు ఒక సామాజిక చైతన్యవేత్త అని ప్రధాని మోడీ కొనియాడారన్నారు.

# నేతన్నల జీవితాల్లో వెలుగులు నింపుతాం

● చేనేత వస్త్రాలపై జీఎస్టీ రద్దుకు ప్రయత్నాలు ● నెలలో ఒక రోజు చేనేత వస్త్రాలు ధరించి నేతన్నలను ప్రోత్సహిద్దాం

● గత ప్రభుత్వం చేనేతలకు ఇచ్చే ప్రోత్సాహకాలన్నీ రద్దు చేసింది ● ఐదేళ్ల పాలనలో ఏ శాఖలో చూసినా విధ్వంసమే కనిపిస్తోంది

● ఫోటోలకు వందల కోట్లు తగలేసిన గత ప్రభుత్వం..చేనేతల సంక్షేమంపై దృష్టి పెట్టలేదు ● చేనేత కార్మికుల గృహాలకు సౌరవిద్యుత్ సదుపాయం కల్పిస్తాం ● ఆగస్టు 15 నుండి మళ్లీ అన్న క్యాంటీన్లు ● రాష్ట్రంలోని ప్రాజెక్టుల్లో జలకళ సంతోషకరం

● సీఎం నారా చంద్రబాబు నాయుడు ● విజయవాడలో జాతీయ చేనేత దినోత్సవంలో పాల్గొన్న సీఎం

● తన సతీమణి భువనేశ్వరికి రెండు చీరలు కొనుగోలు చేసిన సీఎం చంద్రబాబు



విజయవాడ :- నెలలో ఒక రోజు అందరం చేనేత వస్త్రాలు ధరించి చేనేత కార్మికుల ప్రగతికి తోడ్పాటును అందిద్దామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రజలకు పిలువునిచ్చారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా విజయవాడ మేరీస్ స్టెల్లా కళాశాలలో జరిగిన వేడుకల్లో సీఎం పాల్గొన్నారు. ఎగ్జిబిషన్ లో ఏర్పాటు చేసిన చేనేత వస్త్రాల మాల్ ను సందర్శించారు. కార్మికుల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం చేనేత కార్మికులను ఉద్దేశించి ప్రసంగించారు. టీడీపీ ఆవిర్భావం నుంచి అన్ని వేళలా చేనేతలు అండగా నిలిచారు. చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించడం నా బాధ్యత. మా ప్రభుత్వం చేనేత కార్మికులకు పూర్తి అండగా ఉంటుంది. నాడు స్వాతంత్ర్యోద్యమంలో స్వదేశీ వస్త్రాలను ప్రోత్సహించడం ఒక ఉద్యమంలా జరిగింది. అది అంతిమంగా క్విట్ ఇండియా ఉద్యమానికి దారితీసింది. 2015లో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, నాడు సీఎంగా ఉన్న నేను చేనేత అంతర్జాతీయదినోత్సవానికి శ్రీకారం చుట్టాం. రాష్ట్రంలో చేనేత కార్మికులందరికీ ఒక భరోసా కల్పిందం కోసం నేను ఈ రోజు ఇక్కడికి వచ్చాను. గత ప్రభుత్వం నేతన్న నేస్తం అని చెప్పి నేత కార్మికుడికి రూ.24 వేలు ఇచ్చేసి దాంతోనే అంతా బాగుపడిపోతారని అనుకున్నారు. మీకు రావాల్సిన అన్ని రకాల పథకాలను రద్దు చేశారు. ఆప్కో ద్వారా చేసే చేనేత వస్త్రాల కొనుగోళ్లు ఆపేశారు. నూలు, రంగులపై ఇచ్చే రాయితీలు తీసేశారు. అన్ని రకాల రుణాలు తీసేసి చేనేత కార్మికులు పొట్ట కొట్టారు. గత ప్రభుత్వం పోతూ పోతూ చేనేత రంగానికి, కార్మికులకు రూ.266 కోట్లు అప్పు పెట్టి వెళ్లిపోయింది. అని సీఎం విమర్శించారు.

**రుణ మాఫీ చేసి ఆదుకున్నాం**

చరిత్ర ఒకసారి గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఉంది. టీడీపీ అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా చేనేత కార్మికుల కోసం అవిశ్రాంత పోరాటం చేసింద. 2007లో చేనేతలకు రూ.372 కోట్ల రుణాలు మాఫీ చేయకుండా ఆనాటి ప్రభుత్వం మోసం చేస్తే పోరాడాం. మా తమ పోరాట ఫలితంగా 2009లో ముఖ్యమంత్రి రోశయ్య రూ.109 కోట్లు రుణాలు మాఫీ చేశారు. టీడీపీ అధికారంలోకి రాగానే చేనేతలకు రూ.110 కోట్లు రుణాలు మాఫీ చేసి చేనేతలకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నామన్నారు. 2014లో చేనేతలకు రూ.250 కోట్లు బడ్జెట్ కేటాయించాం. 90,795 చేనేత కుటుంబాలకు వంద యూనిట్లు కరెంటు ఉచితంగా ఇచ్చాం. చేనేత కార్మికులకు చిన్న వయసులోనే అనారోగ్య సమస్యలు వస్తున్నాయని తెలిసీ 50 ఏళ్లకే పింఛన్లు ఇచ్చిన ఘనత కూడా టీడీపీదే. నూలు, రంగులపైన సబ్సిడీ 20 శాతం ఉంటే దాన్ని 40 శాతానికి పెంచాం. మగ్గాలపై 50 శాతం రాయితీ ఇచ్చి రూ.80 కోట్లు ఖర్చు చేశాం. 70 వేల మంది చేనేత కార్మికులకు మోటరైజ్డ్ జకార్డ్ లిఫ్టింగ్ సదుపాయం కల్పించామన్నారు. చేనేత పరిశ్రమ పట్ల, చేనేతల పట్ల మాకున్న శ్రద్ధకు ఇది నిదర్శనం చేనేతలకు ఇచ్చిన అన్ని హామీలు నిలబెట్టుకుంటాం అని సీఎం స్పష్టం చేశారు.

**బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టం**

రాష్ట్రంలో బీసీల రక్షణ కోసం ఒక ప్రత్యేక చట్టాన్ని తీసుకొస్తామని ముఖ్యమంత్రి చెప్పారు. బీసీల్లో చాలా ఉప కులాలున్నాయని, వారంతా చాల వెనుకబడి ఉన్నారని, ఎక్కువ మంది కుల వృత్తులపైనే ఆధారపడి జీవిస్తున్నారని వారందర్నీ ఆదుకుంటామన్నారు. బీసీ సబ్ ప్లాన్ ద్వారా రూ.1.50 లక్షల కోట్లు ఖర్చు చేస్తామని తెలిపారు. తద్వారా బీసీ జీవితాల్లో వెలుగులు నింపుతామన్నారు. స్థానిక సంస్థల్లో మళ్లీ బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు తీసుకొస్తామన్నారు. చట్టసభల్లో వెనుకబడిన వర్గాలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించేలా అసెంబ్లీలో తీర్మానం చేస్తామని, ఇది పార్లమెంటులో చట్టమయ్యేంత వరకు బీసీల తరవున పోరాటం చేస్తామని తెలిపారు. నామినేటెడ్ పోస్టుల్లో కూడా బీసీలకు ప్రాధాన్యమిస్తామని చెప్పారు. టీడీపీ రాష్ట్ర పార్టీ అధ్యక్ష, అసెంబ్లీ స్పీకర్ ఇద్దరూ బీసీలేనని గుర్తు చేశారు.

**ఎక్కడ చూసినా విధ్వంసమే**

చేనేత దినోత్సవం సందర్భంగా చేనేతలకు ఎన్నో చెప్పాలని అనుకున్నానని, అడిగినదానికంటే ఎక్కువ ఇవ్వడం తన స్వభావమన్నారు. కానీ గత రెండు నెలలుగా ప్రభుత్వాన్ని చూస్తుంటే బాధేస్తోందని చెప్పారు. రాష్ట్ర ఖజానాను గత ప్రభుత్వం దివాలా తీయించిదన్నారు. రూ.10లక్షల కోట్లు అప్పు పెట్టిందని, దానికి వడ్డీ, అసలు చెల్లించడానికే ప్రతి యేటా రూ.80వేల కోట్లు కావాలన్నారు. ఎక్కడ చూసినా విధ్వంసం, వ్యవస్థలను సర్వనాశనం చేశారన్నారు. ప్రభుత్వంలో ఇప్పుడు చూస్తున్న ఇబ్బందులను తన అనుభవంలో ఎన్నడూ చూడలేదన్నారు. అయినా సరే ఇబ్బందులున్నాయని వెనుకడుగు వేయబోయమన్నారు. సంపద సృష్టించి రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం తొలి రోజే 5 హామీల అమలుపై సంతకాలు చేశానని తెలిపారు. 65 లక్షల మందికి ప్రతి నెలా రూ.2,737 కోట్లు పింఛన్లు చెల్లిస్తున్నామని, రాబోయే ఐదు ఏళ్లలో పింఛన్ల కిందే ప్రభుత్వం రూ.1.65 లక్షల కోట్లు పంపిణీ చేయబోతోందన్నారు.

**త్వరలో చేనేత సహకార సంఘాల ఎన్నికలు**

చేనేత సహకార సంఘాల పాలకమండళ్ల కాల పరిమితి ముగిసిపోతుందని, త్వరలోనే వాటికి ఎన్నికలు నిర్వహిస్తామని ముఖ్యమంత్రి అన్నారు. అయితే చేనేత రంగ అభివృద్ధి కోసం మేలు చేసేవారినే మీరు సభ్యులుగా ఎన్నుకోవాలని చేనేత కార్మికులకు సూచించారు. రాష్ట్రంలో 100 ఆప్కో షో రూములున్నాయని, గత ప్రభుత్వం పెట్టిన ఆప్కో బకాయిలు కూడా త్వరలో చెల్లిస్తామన్నారు. చేనేతల ప్రతి ఇంటికి సౌర విద్యుత్తు సదుపాయం కల్పిస్తామన్నారు. చేనేత కార్మికులకు పైసా ఖర్చు కాకుండా పీఎం సూర్య ఘర్ పథకం కింద ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తామన్నారు. అవసరాలకు పోను మిగిలిన విద్యుత్ ను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందన్నారు. అన్ని వేళలా తనకు పార్టీకి అండగా ఉన్న చేనేత కార్మికులు తన ఆత్మబంధువులన్నారు. చేనేత వస్త్రాలపై జీఎస్టీ భారంగా ఉందని, దాన్ని తొలగించాలని చేనేత కార్మికులు కోరుతున్నారని, కేంద్రం, జీఎస్టీ కౌన్సిల్ లో కూడా ఈ విషయాన్ని ప్రస్తావించి జీఎస్టీ తొలగించేలా చేస్తామన్నారు. చేనేత కార్మికులకు ఆరోగ్య బీమా చేయిస్తామని దానికి రూ.10 కోట్లు అవసరమవుతుందని అధికారులు అంటున్నారని, ఈ కార్యక్రమం కూడా చేపడతామన్నారు. రాష్ట్రంలో 64 చేనేత క్లస్టర్ల అభివృద్ధికి సమగ్ర విధానం తీసుకొస్తామన్నారు. 92,724 మంది చేనేతలకు 50 ఏళ్లకే పింఛను అందిస్తున్నామన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఇప్పుడు ఆలోచన తీరు మారుతోందని, ఒకప్పుడు అందరూ ఇండస్ట్రియల్ కాటన్ దుస్తులు ధరించేవారని, ఇప్పుడు ఖద్దరు, చేనేత దుస్తులు ధరించాలని ముందుకొస్తున్నారని దీన్ని మనం ఒక అవకాశంగా తీసుకుని సరైన డిజైన్లు రూపొందించి మన ప్రతిభ నిరూపించుకుని అధిక ఆదాయం పొందే స్థితికి చేరుకోవాలన్నారు. ఈ చేనేత పరిశ్రమకు చేయూతనిచ్చే బాధ్యత ప్రభుత్వానిదన్నారు.



**సతీమణి భువనేశ్వరికి రెండు చీరలు కొనుగోలు చేసిన సీఎం**

జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా మేరీస్ స్టెల్లా కాలేజీలో ఏర్పాటు చేసిన చేనేత ప్రదర్శనను ముఖ్యమంత్రి చంద్రబాబు సందర్శించారు.

అక్కడ చేనేత కార్మికులతో మాట్లాడి వారు ఎదుర్కొంటున్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీఎం తన సతీమణి నారా భువనేశ్వరికి ఉప్పాడ, వెంకటగిరి చీరలు కొనుగోలు చేశారు. తన సతీమణి కోసం ఎన్నడూ చీరలు కొనలేదని, ఎందుకో ఇక్కడికి రాగానే భువనేశ్వరి గుర్తుకు వచ్చారని, అందుకోసం ఆమెకు రెండు చీరలు కొన్నానని సరదాగా అన్నారు. తాను ఎమ్మెల్యే అయినప్పుడు పొందూరు ఖద్దరు బాగా ఇష్టపడేవాడినని గుర్తు చేశారు.





విజయవాడలో చేనేత దినోత్సవాన్ని ముగించుకుని ఉండవల్లి వెళ్తూ ప్రకాశం బ్యారేజీపై కాన్వాయ్ ఆపి కిందకు దిగిన సీఎం చంద్రబాబు నాయుడు. బ్యారేజీ వద్ద కృష్ణమ్మ పరవళ్లును ఆసక్తిగా తిలకించన సీఎం. వరద ప్రవాహాన్ని చూసేందుకు బ్యారేజీ వద్దకు వచ్చిన సందర్శకులను దగ్గరకు పిలిచి మాట్లాడిన చంద్రబాబు. కృష్ణమ్మకు జలకళ ఎంతో సంతోషాన్ని ఇచ్చిందన్న ముఖ్యమంత్రి. నీటి ప్రవాహాన్ని చూస్తుంటే ఎంతో సంతృప్తిగా ఉందంటూ సంతోషాన్ని వ్యక్తం చేసిన సీఎం చంద్రబాబు. రాష్ట్రంలో ప్రాజెక్టుల్లో నీటి ప్రవాహాలపై తాజా పరిస్థితిని అధికారులను అడిగి తెలుసుకున్న సీఎం.

## టోల్ ఛార్జీ వసూలు ప్రతిపాదన విరమించుకోవాలి

### సీపీఎం రాష్ట్ర కమిటీ



ఏపీ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : రాష్ట్ర రహదారులపై ప్రయాణించే వాహనాలకు టోల్ ఛార్జీ వసూలు చేయాలన్న ప్రతిపాదనను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని సిపిఐ(యం) రాష్ట్ర కమిటీ కోరింది. దీనికి సంబంధించి బుధవారం సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ప్రకటనను విడుదల చేశారు. పిపిపి పేరుతో రోడ్లపై టోల్ టాక్స్ వసూలుకు సన్నాహాలు చేయాలని కలెక్టర్ల సమావేశంలో అధికారులకు ముఖ్యమంత్రి ఆదేశించినట్లు మీడియాలో వార్తలు వచ్చాయని, తక్షణం వెయ్యి కిలోమీటర్ల పరిధిలో టోల్ వసూలు చేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆ సమావేశంలో నిర్ణయించారని. భవిష్యత్తులో మొత్తం 12,650 కిలోమీటర్ల రాష్ట్ర రహదారులపై టోల్ వసూలు చేసే ప్రమాదముందని తెలిపారు. రోడ్లను అభివృద్ధి చేయడం, వాటిని సక్రమంగా నిర్వహించడం రాష్ట్ర ప్రభుత్వ బాధ్యత అని చెప్పారు. వాహనాల రిజిస్ట్రేషన్ సమయంలో లైఫ్ టాక్స్, డీజిల్, పెట్రోల్ పై రోడ్డు సెస్సు తదితర రూపాలలో ప్రభుత్వాలకు ఆదాయం సమకూరుతోందని, ఆ సొమ్ము ఆయా వాహన యజమానులు, వాటిలో ప్రయాణించేవారు ఇప్పటికే భరిస్తున్నారని వివరించారు. ఇప్పటికే జాతీయ రహదారులన్నింటిలో టోల్ టాక్సుల భారంతో రవాణా రంగం నష్టాలల్లో ఉన్నదన్నారు. పిపిపిల పేరిట రాష్ట్ర రహదారుల్లో ప్రతిపాదిక టోల్టాక్సులు మోయలేని భారాలుగా మారి రాష్ట్ర రవాణా రంగాన్ని నష్టాలపాలు చేస్తాయని తెలిపారు. ప్రజలపై అదనపు భారం పడుతుందని కాబట్టి రాష్ట్ర రహదారులపై టోల్టాక్సు ప్రతిపాదన విరమించుకోవాలని సిపిఐ(యం) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేస్తున్నదని శ్రీనివాసరావు పేర్కొన్నారు.

# అన్న క్యాంటిన్లలో ధరలు

● తక్కువ ధరలకే ఆహార పదార్థాలు ● నిర్వహణ ధరలు

● ఉదయం టిఫిన్ రూ 5, మధ్యాహ్న భోజనం రూ 5, రాత్రికి భోజనం రూ 5 ● సూత్రప్రాయంగా నిర్ణయం




ఏపీ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అన్నా క్యాంటీన్లను తిరిగి ప్రారంభించేందుకు ముహూర్తం ఫిక్స్ చేసింది. ఆగస్టు 15న రాష్ట్ర వ్యాప్తంగా అన్నా క్యాంటీన్లు తిరిగి ప్రారంభం కానున్నాయి. అన్నా క్యాంటీన్ల నిర్వహణతో పాటుగా ధరల పైన ప్రభుత్వం స్పష్టత ఇచ్చింది. ఈ నెల 15న రాష్ట్రంలో రాష్ట్రంలో 100 అన్నా క్యాంటీన్లను ప్రారంభించనున్నారు. ఆ తరువాత రెండు విడతల్లో మరో 103 ప్రారంభం కానున్నాయి. ధరలను ఖరారు చేసారు. ప్రారంభానికి సిద్దం రాష్ట్రంలో అన్న క్యాంటీన్లను వునఃప్రారంభించడానికి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. గతంలో టీడీపీ హయంలో రూవుదిద్దుకున్న అన్నా క్యాంటీన్లను జగన్ సర్కార్ రాష్ట్రంలో కొలువుదీరాక నిలిపివేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పడడంతో అన్నా క్యాంటిన్లను తిరిగి అందుబాటులోకి తెస్తున్నారు. ఎన్నికల సమయంలోనే అన్నా క్యాంటీన్లను తిరిగి ప్రారంభిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. ఈ నెల 15న రాష్ట్ర వ్యాప్తంగా అన్నా క్యాంటీన్లను ప్రారంభించటంతో పాటుగా..నిర్వహణకు సంబంధించి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.మూడు విడతల్లో ఈ నెల 15న రాష్ట్రంలో తొలి విడతగా 100 అన్నా క్యాంటీన్లను ప్రారంభించాలని నిర్ణయించారు. మరో 103 అన్నా క్యాంటీన్లను 80, 23 చొప్పున రెండు విడతల్లో ప్రారంభించనున్నారు. హరేక్రిష్ణ ఛారిటబుల్ ఫౌండేషన్ ద్వారా ఈ క్యాంటీన్లను నిర్వహించనున్నారు. అన్నా క్యాంటీర్ల నిర్వహణకు పిలిచిన టెండర్లలో ఈ హరేక్రిష్ణ ఛారిటబుల్ ఫౌండేషన్ కు అవకాశం దక్కింది. ఉదయం బ్రేక్ ఫాస్ట్, మధ్యాహ్నం లంచ్, రాత్రి భోజనం ఈ క్యాంటీన్ల ద్వారా అందుబాటులోకి తీసుకురానున్నారు. వీటికి సంబంధించి ధరలను కూడా ఇప్పటికే ఖరారు చేసారు. తక్కువ ధరలకే అన్నా క్యాంటీన్లలో అతి తక్కువ ధరలకు ఆహార పదార్థాలు అందించాలని నిర్ణయించారు. ఉదయం టిఫిన్ రూ 5, మధ్యాహ్న భోజనం రూ 5, రాత్రి భోజనం రూ 5 చొప్పున అందించాలని సూత్రప్రాయంగా నిర్ణయించారు. ఇదే అంశాన్ని తాజాగా అసెంబ్లీ వేదికగానూ ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. ప్రతీ మున్సిపాల్టీ పరిధిలో ఎంపిక చేసిన ప్రాంతాల్లో ఈ క్యాంటీన్ల నిర్వహణ బాధ్యతలను మున్సిపల్ కమిషనర్లకు అప్పగించారు. ఈ నెల 10వ తేదీ లోగా క్యాంటీన్ల ఏర్పాటు పనులు పూర్తి కావాలని ప్రభుత్వం ఆదేశించింది.

## జీవీఎంసీలో ఎన్డీయే కూటమి జోరు

● వైసీపీకీ భారీ షాక్ ● పదికి పది స్థానాల్లో ఘన విజయం

● స్థానిక ఎన్నికల్లో మూడేళ్ల తర్వాత క్లీన్ స్వీప్

● వైవీ సుబ్బారెడ్డి విశాఖలో మకాం వేసినా తప్పని పరాభవం



విశాఖ: మహా విశాఖ నగరపాలక సంస్థ (జీవీఎంసీ) స్థాయీ సంఘం ఎన్నికల్లో ప్రతిపక్ష వైసీపీకి గట్టి షాక్ తగిలింది. ఈ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి విజయకేతనం ఎగురవేసింది. పదికి పది స్థానాలు గెలుచుకొని ఘన విజయం సాధించింది. వైసీపీ ఉత్తరాంధ్ర ఇన్ఛార్జి వైవీ సుబ్బారెడ్డి విశాఖలో మకాంవేసి పార్టీ వీడతారన్న కార్పొరేటర్లతో చర్చించినా, మిగిలిన వాళ్లతో క్యాంపు రాజకీయాలకు తెరలేపినా ఆ పార్టీకి ఘోర పరాభవం తప్పలేదు. ఇప్పటివరకు మూడు పర్యాయాలు జీవీఎంసీ స్థాయీ సంఘం ఎన్నికలు జరగ్గా.. హ్యాట్రిక్గా వైసీపీ సభ్యులే గెలుస్తూ వచ్చారు. తాజాగా సార్వత్రిక ఎన్నికల్లో గెలుపుతో జోరుమీద ఉన్న కూటమి స్థాయీ సంఘం ఎన్నికల్లో మూడేళ్ల తర్వాత క్లీన్స్వీప్ చేసింది.

స్థాయీ సంఘం ఎన్ఇనకల్లో జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో బుధవారం ఉదయం 10గంటల నుంచి 2గంటల వరకు జరిగాయి. పది స్థానాలకు వైకాపా, తెదేపా అభ్యర్థులు పోటీ పడ్డారు. మొత్తం 96మంది కార్పొరేటర్లు ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఒక్కొక్కరికి పది ఓట్లు వేసే అవకాశం ఉండటంతో మొత్తం 960 ఓట్లు పోలయ్యాయి. కూటమితరవున నిలబడిన పది మంది తెదేపా అభ్యర్థులు అన్ని స్థానాలూ గెలుచుకున్నారు.ఈ విజయంతో కూటమి శ్రేణుల్లో సంబరాలు మిన్నంటాయి. జీవీఎంసీ కార్యాలయం బయట సంబరాలు చేసుకొని మిఠాయిలు తినిపించుకున్నారు.

# పెద్దిరెడ్డి తీరుపై మంత్రి సత్యప్రసాద్ సెటైర్లు

● ప్రభుత్వ ఆఫీసుల్లో ఫైళ్లు తగులపెట్టించి.. ● అమాయక ముఖం పెడితే ప్రజలు నమ్మరు

● తిన మరిగిన కోడి ఇల్లెక్కి కూసినట్లు ఉంది ● మదనపల్లె వ్యవహారంపై డైలాగ్ వార్



అమరావతి: మదనపల్లె ఫైళ్ల దహనం వ్యవహారంపై ప్రభుత్వ, విపక్ష పార్టీ వైసీపీ నేతల మధ్య పరస్పర విమర్శల పర్వం కొనసాగుతోంది. తాజాగా మంత్రి అనగాని సత్య ప్రసాద్ స్పందించారు. తిన మరిగిన కోడి ఇల్లెక్కి కూసినట్లుగా ఉంది మాజీ మంత్రి పెద్దిరెడ్డి తీరు అంటూ మంత్రి సెటైర్లు వేశారు. ప్రభుత్వ ఆఫీసుల్లో ఫైళ్లు తగులపెట్టించి అమాయక ముఖం పెడితే ప్రజలు నమ్మే స్థితిలో లేరని విమర్శించారు. పాపాలు చేసి ఫైళ్లు తగులబెట్టడడం పెద్దిరెడ్డి అలవాటుగా చేసుకున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. పెద్దిరెడ్డి, అతని అనచరులకు వ్యతిరేకంగా ఉమ్మడి చిత్తూరు జిల్లాలో వేల సంఖ్యలో ఫిర్యాదులు అందాయని వెల్లడించారు.మదన పల్లె ఫైళ్ల దహనం ఘటనకు ముందు కాలుష్య నియంత్రణ మండలిలో కూడా ఫైళ్లు తగలబెట్టారని మంత్రి అనగాని సత్యప్రసాద్ ప్రస్తావించారు. మదన పల్లె ఫైళ్ల దహనం ఘటన కుట్ర కోణంలో జరిగిందేనని అభిప్రాయపడ్డారు. సీఐడీ విచారణలో దోషులను కచ్చితంగా తెలుస్తామని, పెద్దిరెడ్డే కాదు... అంతకన్నా పెద్ద వారు ఉన్నా చట్టం నుంచి తప్పించుకోలేరని హెచ్చరించారు.జగన్, ఆయన కార్యకర్తలకి భయమెందుకు?: కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి తెలుగుదేశం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి నెల్లూరులో మీడియాతో మాట్లాడారు. జగన్, ఆయన కార్యకర్తలకి భయమెందుకు?. రెండు నెలలు గడవక ముందే రాష్ట్రపతి పాలన అంటున్నారు. సామాజిక బస్సుయాత్ర చేపట్టే అర్హత జగన్కి లేదు. జగన్ హయాంలో 28 మంది దళితులు అత్యాచారాలు, ఆపై హత్యలకు గురయ్యారు.

6 వేల మంది దళితులపై అత్యాచారాలు జరిగాయి. ఎమ్మెల్సీ అనంతబాబు ఆయన వద్ద డ్రైవర్గా పనిచేసే దళిత యువకుడు సుబ్రహ్మణ్యంని హతమార్చి శవాన్ని డోర్ డెలివరీ చేశాడు. అనంతబాబుపై ఎందుకు చర్యలు తీసుకోలేదు అని కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి విమర్శించారు. జగన్ రూ.33 వేల కోట్ల ఎస్సీ సబ్ ప్లాన్ నిధులను దారి మళ్లించారు. ఏపీ కోసం జగన్ ఏ రోజైనా రాష్ట్రపతిని కలిశాడా?. ఇవాళ రాష్ట్రపతి పాలన కావాలంటున్నాడు అని అన్నారు.

# దళితులపై దాడులు చేసినా చర్యల్లేవు

● అప్పటి అధికారులు మీద చర్యలు తీసుకోవాలి ● 21 పథకాల రద్దుతో దళితులు తీవ్రంగా నష్టపోయారు

● హైకోర్టు జడ్జితో విచారణ జరిపించాలి ● బీజేపీ ఎస్సీ మోర్చ రాష్ట్ర అధ్యక్షుడు దేవానంద్

విశాఖపట్నం: గత ఐదేళ్లలో జాతీయ క్రైమ్ రిపోర్ట్ ప్రకారం రాష్ట్రంలో 750 మంది దళితుల మీద దాడులు జరిగితే చర్యలు లేవు అని బీజేపీ ఎస్సీ మోర్చ రాష్ట్ర అధ్యక్షుడు గుడిసె దేవానంద్ మండిపడ్డారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు వురంధేశ్వరి ఆధ్వర్యంలో గవర్నర్ కి ఎస్సీ కమిషన్ కు ఫిర్యాదు చేశామని తెలిపారు. దీంతో కమిషన్ స్పందించి ఈ వ్యవహారం మీద ప్రభుత్వాన్ని నివేదిక కోరిందని చెప్పారు. ఈ దాడులు మీద హైకోర్టు న్యాయమూర్తి చేత విచారణ చేయాలి అని డిమాండ్ చేశారు. అప్పటి అధికారులు మీద చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్రంలో 21 ఎస్సీ కార్పొరేషన్ పథకాలు రద్దు చేయడం వల్ల దళితులు తీవ్రంగా నష్టపోయారని అవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో జరిగే జాతీయ జెండా ఆవిష్కరణ, అమ్మ పేరుతో చెట్టు నాటే కార్యక్రమాలను పార్టీ శ్రేణులు విజయవంతం చేయాలని పిలువునిచ్చారు. ఆయన విశాఖ బీజేపీ కార్యాలయంలో బుధవారం జరిగిన బీజేపీ ఎస్సీ మోర్చ ఉత్తరాంధ్ర జోనల్ సమావేశంలో మాట్లాడారు. దేశవ్యాప్తంగా ప్రతి ఇంటి మీద జాతీయ జెండా ఆవిష్కరణ లో భాగంగానే రాష్ట్రంలో 25 పార్లమెంట్, 175 అసెంబ్లీ స్థానాల్లో అమ్మ పేరుతో చెట్టు నాటే కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు.

ఎస్సీ మోర్చా అఖిల భారత కార్యదర్శి ఎస్.కుమార్ మాట్లాడుతూ, ఎస్సీ మోర్చా పటిష్టం అయ్యేలా కార్యక్రమాలు నిర్వహించాలని పిలువు ఇచ్చారు. గత వైసీపీ ప్రభుత్వం హయాంలో కేంద్ర నిధులు ఖర్చు చేయలేదని మండి పడ్డారు. కేంద్ర బడ్జెట్ లో సామాజిక న్యాయం కోసం పెద్ద పీట వేశారని, విద్యార్థుల్లో దేశభక్తి పెంచే దిశగా అడుగులు వేస్తున్నామని అన్నారు. ఎస్సీ మోర్చ విశాఖ జిల్లా అధ్యక్షుడు గని రెడ్డి రాకేష్ చంద్ర మాట్లాడుతూ, జాతీయ కార్యవర్గం పిలువు మేరకు విశాఖ జిల్లా వ్యాప్తంగా ఈ రెండు కార్యక్రమాలు విజయవంతం చేయాలి అని కోరారు.

బీజేపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు మెదపాటి రవీంద్ర, పార్వతి వురం ఇంఛార్జి ఎస్ వి ఎస్ ప్రకాష్ రెడ్డి ,బీజేపీ ఎస్సీ మోర్చ రాష్ట్ర కార్యదర్శి కోడూరి సంజీవ్ రావు, కణితి విజయలక్ష్మి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు చార్లెస్ మాధవి లత, ఉపాధ్యక్షులు మౌళి, రాష్ట్ర కో కన్వీనర్ శివ, పార్వతి వురం ఇంఛార్జి కల్యాణి, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దామోదర్, అధిక సంఖ్యలో బీజేపీ ఎస్సీ మోర్చా కార్యకర్తలు పాల్గొన్నారు.




## ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసీపీ ఓటమి తథ్యం

● జీవీఎంసీ ఎన్నికల ఫలితాలు పునరావృతం ఖాయం

● ఓటమిని జీర్ణించుకోలేక ఆరోపణలు

● జనసేన ఎమ్మెల్యే వంశీకృష్ణ యాదవ్



విశాఖపట్నం: విశాఖ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసీపీ ఓడిపోవడం ఖాయమని జనసేన ఎమ్మెల్యే వంశీకృష్ణ యాదవ్ కీలక వ్యాఖ్యలు చేశారు. బుధవారం యన మీడియాతో మాట్లాడారు. ఓటమిని జీర్ణించుకోలేకనే వైసీపీ ఆరోపణలు చేస్తోందని విమర్శించారు. గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్కు చెందిన పలువురు వైసీపీ కార్పొరేటర్లు ఆ పార్టీకి షాక్ ఇచ్చి జనసేన పార్టీలో చేరిన విషయం తెలిసిందే. మంగళగిరి పార్టీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం పార్టీ అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. తాజాగా బుధవారం గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ లో కూటమి అభ్యర్థులు విజయం సాధించారు. విశాఖలో భారీ మెజార్టీ ఉన్నప్పటికీ వైసీపీ విజయం సాధించలేకపోయింది. 97 మంది కార్పొరేటర్లు ఉన్న జీవీఎంసీలో 10 వార్డులకు ఒకరు చొప్పున మొత్తం 10 మందిని స్టాండింగ్ కమిటీగా ఎన్నుకుంటారు. ఇందులో భాగంగా 10 స్థానాలను కూటమి కైవసం చేసుకోవడం వైసీపీకి తీరని షాక్ తగిలింది. ఈ పరిణామాలు ఎమ్మెల్సీ ఎన్నికలపై పడి వైసీపీ ఓడిపోయే ప్రమాదం ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

## అస్థిరతకు, సంక్షోభానికి భారత్ దూరం

భారత్ ప్రపంచంలోనే ఓ అతి పెద్ద ప్రజాస్వామ్య దేశం. ప్రతిదీ క్రమశిక్షణ, నిబద్ధతతో జరుగుతాయి. ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికలే దానికి ఉదాహరణ.ఒక స్వయం ప్రతిపత్తి ఉన్న ఎన్నికల సంఘం భారత్‌లో జరిగే ఎన్నికలను పర్యావేక్షిస్తుంది. ఆసియా ఖండం చాలా పెద్దది. అది,తూర్పు ఆసియా, ఆగ్నేయ ఆసియా, దక్షిణ ఆసియా, నైరుతి ఆసియా, యూరేషియా అని ఉంది. మన భారత దేశం దక్షిణ ఆసియాలో ఉంది. దక్షిణ ఆసియాలో మొత్తం ఏడు దేశాలు. వాటిలో భారత్ పెద్దది. మొత్తం ఆసియా ఖండంలో చైనా పెద్దదేశం. మన దక్షిణ ఆసియా వైపు చుస్తే మన పొరుగున ఉన్న పాక్, శ్రీలంక దేశాలలో రాజకీయ అస్థిరత, సంక్షోభం ఇటీవల చూశాం, చూస్తున్నాం. ఆయా దేశాలలో నిలకడలేనితనం గొచరిస్తా ఉంది. మరియు పాలకులు పరిపాలన సామర్థ్యం లేని వారు అనిపిస్తోంది. ఇది క్రమంగా నేపాల్ కు కూడ పాకింది. అక్కడ రాజకీయ సంక్షోభం వెలుగు చూసింది. ప్రపంచ దేశాలలో ఏదో ఒక చోట రాజకీయ పోకడలు కానవస్తున్నాయి. భారత్‌లో ఎన్నడూ అటువంటి నేపథ్యం లేదు. ప్రభుత్వాలు కూలి పోవడం ఉన్నాయి కాని, పాలకుల నివాసాలను, నిర్భంధం చేయడం, దౌర్జన్యంగా జొరబడటం, పాలకులు పలయానం చేయడం ఎప్పుడు జరగలేదు. ఏ సమస్య కయైన చర్చలే పరిష్కారం. మాటలలో చిత్త శుద్ధి, సౌమ్యం అవసరం. అది సదరు దేశాలకు లేదు. ఇటీవల తాజాగా పొరుగు దేశం బంగ్లాదేశ్ లో తీవ్ర అస్థిరత్వం ఏర్పడింది. ఆ దేశ మాజీ ప్రధాని హసీనా భారత్‌కు అత్యంత ఆప్తురాలు. హసీనా స్వయం కృతమే ఆమె మెడకు చుట్టుకుంది. స్వాతంత్ర్య సమర యోధుల కుటుంబాలలోని వారసులకు ఇచ్చే రిజర్వేషన్‌లో అక్రమాలు జరిగాయాని, హసీనా పార్టీ వారే లబ్ది పొందారు అని బంగ్లా ప్రజలు ఓడ్డ ఎత్తున నిరసన తెలియజేశారు. అది ప్రళయ జ్వాల గా మారి, విధ్వం సంగా రూపాంతరం చెందింది. ప్రజలు ఓ కెరటం లా హసీనా నివాస భవనం లోకి ప్రవేశించి నానా యాగి చేశారు. వారి ధాటికి తట్టుకోలేక హసీనా దేశం విడిచి, భారత్ చేరుకున్నారు. చేరుకున్నారు అని అనడం కంటే బంగ్లా ప్రజల మాటలలో పారి పోయింది అనడం సబ బేమో. ప్రస్తుత బంగ్లా దేశ్ పరిస్థితులు అన్ని భారత్ నిశితంగా గమనిస్తోంది. హసీనా భారత్‌కే రావడం అంటే తల దాచుకోవడానికే, ఏ దేశంలో కూడ ఆమెకు ప్రవేశం కష్టం. భారత్ అందరిని, అన్ని దేశాలను సమంగా చూస్తుంది. శరణార్థులకు భారత్ స్వర్గ ధామం. తల దాచుకోవడానికి వచ్చిన ఎవరిని భారత్ తరస్కరించదు, వారికి ఆశ్రయం కల్పిస్తుంది. అయితే బంగ్లాలో జరిగిన రాజకీయ అస్థిర తలో భారత్ హస్తం లేనే లేదు అనేది నగ్న సత్యం. ప్రస్తుతం బంగ్లాలో కొంచెం కుదుట పడ్డాయి. బంగ్లాలో రాజకీయ కారణాలు ఉంటే, పాక్‌లో కరువు ఏర్పడింది. కరువును జయించడానికి పాక్ చాలా కసరత్తులే చేసింది. డబ్బు సహాయం కోసం భారత్‌ను అది అడగలేదు. అడగాలి అంటే పాక్‌లోని నాయకులకు అవమానం.భారత్ అభివృద్ధి పథంలో వెళుతుంటే మనం కరువు బారిన పడ్డాము అని ఆ దేశ నాయకులకు ఉన్న దుగ్ధ. పాక్ అడిగి ఉంటే భారత్ సహాయం చేసేదే. పాక్ మిన్న కుండి వేరే దేశాల సహాయం కోరింది. భారత్ ను అడగడం పాక్‌కు నామోషీ.కాని భారత్ మాత్రం మానవతా దృక్పధం తో వ్యవహరిస్తుంది. ఎన్నో దేశాలు భారత్ నుంచి లబ్ధి పొందాయి. కరోనా సమయంలో భారత్ చేసిన సహాయం ఎవరూ మరువరు. భూటన్ దేశానికి స్వంత నిధులతో అక్కడ వైద్యశాలను కట్టించింది. విశ్వంలో ఎక్కడ అస్థిరత, సంక్షోభం ఏర్పడినా భారత్‌లో అటువంటి పరిస్థితి ఉండదు, రాదు. ఎందుకంటే భారత్ లో మంచి పాలనా సామర్థ్యం కలిగిన నాయకులు ఉన్నారు. దేశ సంక్షేమం, పౌరుల భద్రత ముఖ్యం అనే దిశలో సాగుతుంది. అదే దేశానికి పెద్ద ఆస్తి. భారత్‌లో ఎప్పుడు సైన్యం అధికారం చెజిక్కించుకునే దాఖలాలు లేవు. సైన్యం అంతా అధ్యక్షుని చేతిలో ఉన్నా, ప్రధాని, మంత్రి మండలి కీలకం. ప్రధాని ఎన్నిక చేసిన వ్యక్తే రాష్ట్రపతి.కాకపోతే ఎన్నిక పరోక్ష పద్ధతిలో జరుగుతుంది. త్రివిధ దళాదీపతులను నియమించేది రాష్ట్రపతే అయినా అంతిమ నిర్ణయం, నియామకం అంతా ప్రధానే. ప్రధాని ప్రజలచేత ఎన్నుకొబడతాడు.నిజమైన, వాస్తవమైన అధికారాలు కలిగి ఉంటాడు. నియంతలకు భారత్‌లో చోటు లేదు. అటువంటి వారు భారత్‌లో ఉండరు, ఉన్నా అధికారం చేపట్టలేరు. మంచి నీతి,నిజాయితీ గల వ్యక్తులు అధికారం స్వీకరిస్తారు. నిర్ణయాలు ఆచి తూచి తీసుకుంటారు. ప్రజావ్యతిరేక నిర్ణయాలు ఉంటే ఎన్నికలలో ప్రజలు బుద్ధి చెబుతారు. అందుకే భారత్‌లో ఎప్పుడు బలమైన ప్రభుత్వం ఉంటుంది.అస్తిరత, సంక్షోభం తల ఎత్తవు

**పాఠకులు, విశ్లేషకులు, రచయితలు తమ రచనలు క్రింది చిరునామాకు గానీ సూర్య దినపత్రిక ఎడిటోరియల్ మెయిల్ ఐడికి గాని పంపవలసినదిగా మనవి మెయిల్ : suryaeditpage@gmail.com**

SPR publications, Surya Soudha, Plot.No: 185, M.C.H. NO.258/1/185, siddi vinayaka nagar, Ayyappa Society
Opp: Hi-Tech City, Hyderabad - 500 072.

# న్యాయాన్ని గెలిపించిన తీర్పు

- నియంతగా మారిన మాజీ జుంటా నాయకుడు మౌసా డాడిస్ కమారా
- అధికారంలోకి వచ్చాక చెప్పిందొకటి, చేసిందికటి
- అనేక నేరాలకు పాల్పడిన గినియా దేశ మాజీ జుంటా నాయకుడు
- కిడ్నాప్లతో మానవత్వానికి వ్యతిరేకంగా చేసిన నేరాలెన్నో
- 4 ఏళ్ల నిరంకుశ పాలనతో ప్రజలు విసిగిపోయిన ప్రజలు

**జనక మోహన రావు దుంగ**
**8247045230**

మాయ మాటలతో ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన తరువాత చెప్పిందొకటి, చేసిందికటి తీరున పాలించే పాలకులని నియంతలంటారు. ఈ కోవకే చెందుతాడు గినియా దేశ మాజీ జుంటా నాయకుడు మౌసా డాడిస్ కమారా. ఈయనతో పాటు మరో ఏడుగురు మిలటరీ కమాండర్లతో కలిసి మానవత్వానికి వ్యతిరేకంగా నేరాలకు పాల్పడ్డారని నిర్ధారించి హత్య, అత్యాచారం, చిత్రహింసలు, కిడ్నాప్‌లతో సహా వారి ఆరోపణలను మానవత్వానికి వ్యతిరేకంగా చేసిన నేరాలుగా తిరిగి వర్గీకరించిన 31జూలై, 2024న ఆ దేశ కమారాకు 20 సంవత్సరాల శిక్షను విధించింది. ఈ తీర్పు మానవ హక్కుల పరిరక్షకులందరికీ, న్యాయం కోరేవారికి విజయం. పశ్చిమ ఆఫ్రికాలో పశ్చిమ తీరదేశాన ఉన్న గినియా దేశం ప్రపంచంలోని రెండవ అతిపెద్ద బాక్సైట్ల నిల్వలను కలిగి ఉంది. దేశంలో వజ్రాలు, బంగారు నిక్షేపాలు ఉన్నాయి. దేశ జనాభా 1.24 కోట్లు. దేశ ఆర్థిక వ్యవస్థ ఎక్కువగా వ్యవసాయం, ఖనిజ ఉత్పత్తిపై ఆధారపడి ఉంది. 24 డిసెంబర్ 2008న అప్పటి గినియా అధ్యక్షుడు లాన్సానా కాంటే మరణించాక కొన్ని గంటల తరువాత ఆ దేశ కెప్టెన్ మౌసా డాడిస్ కమారా రేడియోలో మాట్లాడుతూ నేషనల్ కౌన్సిల్ ఫర్ డెమోక్రసీ అండ్ డెవలప్‌మెంట్ గ్రూప్ తరుపున సైనిక తిరుగుబాటు జరిగిందని తెలిపాడు. ప్రభుత్వాన్ని, రిపబ్లిక్ సంస్థలును రద్దు చేసాడు. రాజ్యాంగాన్ని, రాజకీయ యూనియన్ కార్యకలాపాలను సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించాడు. దేశ పేదరికం, అవినీతి కారణంగా తిరుగుబాటు అవసరమని ప్రస్తుతం ఉన్న సంస్థలు "దేశం ఎదుర్కొంటున్న సంక్షోభాలను పరిష్కరించడంలో అసమర్థంగా ఉన్నాయి" అని చెప్పాడు. మిలిటరీ నుండి ఎవరైనా అధ్యక్షుడవుతారని, జాతిపరంగా సమతుల్యతతో కూడిన కొత్త ప్రభుత్వానికి ఒక పౌరుడు ప్రధానమంత్రిగా ఉంటారని పేర్కొన్నాడు. లాన్సానా కాంటే యొక్క 24 ఏళ్ల నిరంకుశ పాలనతో ప్రజలు విసిగిపోయిన కారణంగా కెమరాకు ప్రజల నుండి మద్దతు లభించింది. అధ్యక్ష ఎన్నికలలో తాను నిలబడనని కెమారా తెలిపాడు. కానీ కొన్ని నెలల పాటు పరిపాలన కమారా తన నియంతృత్వ పాలనతో హింస, దోపిడీలు, సైనిక దళాల దుర్వినియోగ ప్రవర్తన కారణంగా అనతి కాలంలోనే మద్దతు కోల్పోయాడు. విదేశీ రాయబారులును, రాజకీయ నాయకులను అవమానపరిచాడు. ఇది అతని ప్రజా ప్రతిష్టను దెబ్బతీసింది. అతని అస్థిర ప్రవర్తనకు విమర్శలను పొందింది.

**కొనాక్రీ స్టేడియంలో ఘోరం:**

తదుపరి అధ్యక్ష ఎన్నికలలో కెమారా పాల్గొనే అవకాశం ఉందని , అలా జరగకుండా ఉండడం కోసం సెప్టెంబరు 28, 2009న ప్రత్యర్థులు, ప్రతిపక్షాలు, ప్రజలు కమారాకు వ్యతిరేకంగా ప్రదర్శన నిర్వహించాలని నిర్ణయించారు. ప్రభుత్వం నిషేధం విధించినప్పటికీ గినియాలోని కొనాక్రీలో ఒక బహుళ ప్రయోజన స్టేడియం వద్ద దాదాపు 50,000 మంది ప్రజలు గుమిగూడి సైనిక వ్యతిరేక నినాదాలు చేసారు. ఆ సమయంలో రెడ్ బెరెట్స్ అని పిలవబడే ఎలైట్ ప్రెసిడెన్షియల్ గార్డ్స్ ట్రక్కులలో వచ్చి అక్కడున్న వారిపై టియర్ గ్యాస్ ప్రయోగించారు. తరువాత కాల్పులు జరిపారు. నిరసనకారులు భయాందోళనల వాతావరణంలో పరిగెత్తి స్టేడియం నుండి పారిపోయారు. అక్కడున్న వారిని సైనికులు వెంబడించి కాల్పులు జరిపారు. 109 మంది మహిళలు లైంగిక బానిసత్వంతో సహా లైంగిక హింసకు గురయ్యారు. ఆ తరువాత వాళ్ళని సైనికులు బహిరంగంగా తుపాకులతో కాల్చి చంపారు. పాల్గొన్న వందలాది మంది నిరసనకారులు ఎటువంటి ఆరోపణలు లేకుండా అరెస్టు చేసి జైలులో పెట్టబడ్డారు. సుమారు 156 మంది మరణించారు. చాలామంది తప్పిపోయారు. అనేకమంది బాధితులను చిత్రహింసలకు గురిచేసి చంపి సామూహిక సమాధుల్లో పాతిపెట్టారు. ఈ దారుణాల తరువాత కెమారా ఈ హత్యలకు తనకు ఎటువంటి సంబంధం లేదని, తాను ఎటువంటి కాల్పుల ఆదేశాలు జారీ చేయలేదని, ఈ సంఘటన జరిగినప్పుడు తన కార్యాలయంలోనే ఉన్నానని పేర్కొన్నాడు. సంఘటనల సమయంలో గినియా మాజీ అధ్యక్షుడు మౌసా డాడిస్ కమారాతో సహా 12 మంది నిందితులపై హత్య, అత్యాచారం, ఉద్దేశపూర్వక దాడి, హింస, కిడ్నాప్, లైంగిక హింస వంటి అభియోగాలు మోపబడ్డాయి. తదనంతర పరిణామాలలో వాస్తవ పరిస్థితులను స్థాపించడానికి, బాధ్యులను గుర్తించడానికి, సిఫార్సులు చేయడానికి ఐక్యరాజ్యసమితి విచారణ కమిషన్ను ఏర్పాటుచేసింది. తప్పిపోయిన వారందరి ఆచూకీని గుర్తించడం, బలవంతపు అదృశ్యాలు, సంబంధిత ఉల్లంఘనలకు బాధ్యులను గుర్తించడం గినియా ప్రభుత్వానికి కీలకమని హైకమిషనర్ పేర్కొన్నారు. 12 జనవరి 2010న, కమారా బుర్కినా ఫాసోకు పారిపోయాడు. మౌసా ఔగాడౌగౌలో ప్రవాసంలో నివసించాడు. 22 డిసెంబర్ 2021న కమారా గినియాకు తిరిగి వచ్చారు. 2022 సెప్టెంబరు 27న, కమారాను ఖైదు చేసి విచారించారు. విచారణ 28 సెప్టెంబర్ 2022న ప్రారంభమైంది. దాదాపు రెండు సంవత్సరాల పాటు కొనసాగింది. ఈ సమయంలో న్యాయమూర్తులు 100 మందికి పైగా బాధితులు, 11 మంది నిందితులు, డజనుకు పైగా సాక్షులను, ఉన్నత స్థాయి ప్రభుత్వ అధికారులను విచారించారు. 2022లో ప్రారంభమైన విచారణ తరువాత అనేక సంఘటనలు జరిగాయి. ఇందులో కొంతమంది నిందితులు తప్పించుకోవడం, సివిల్ పార్టీ సంస్థలపై విరుచుకుపడటం, పౌర సమాజం, కోర్టుపై ఒత్తిడి బెదిరింపులు ఉన్నాయి. 4 నవంబర్ 2023 నుండి



పరారీలో ఉన్న ప్రెసిడెన్షియల్ సెక్యూరిటీ ఇన్‌ఛార్జ్ మాజీ మంత్రి క్లాడ్ పివి లేకపోవడం చాలా మంది బాధితులను భయభ్రాంతులకు గురిచేసింది. జూలై 31, 2024న, 2009లో జరిగిన మారణకాండలో మౌసా డాడిస్ కమారా "మానవత్వానికి వ్యతిరేకంగా చేసిన నేరాలకు" దోషిగా నిర్ధారించబడ్డాడు. ఇరవై సంవత్సరాల జైలు శిక్ష విధించబడింది. బాధితులకు నష్టపరిహారం అందజేయనున్నారు. 28 సెప్టెంబరు 2009 ఊచకోత యొక్క విచారణ కేవలం ఒక చారిత్రాత్మక తీర్పుతో ముగిసింది.

**నియంతలకు చెంపపెట్టు:**

న్యాయం జరిగేలా చూడాలని 15 సంవత్సరాలుగా పోరాడుతున్న పురుషుల, మహిళలు అందరికీ ఈ తీర్పు ఓ విజయం. " ఈ రోజు 15 ఏళ్ల పోరాటానికి లభించిన విజయం. ఈ తేదీ మా జ్ఞాపకాలలో ఎప్పుడూ చెక్కబడి ఉంటుంది. వ్యక్తిగతంగా నేను ఆ రోజు నా కొడుకును కోల్పోయాను. బాధితులందరి బాధను నేను పంచుకున్నాను. మేము చాలా కష్టాలను ఎదుర్కొన్నాము, " అని ఆనాటి బాధితుల్లో ఒకరైన అస్మావు డియల్లో ఈ తీర్పు తరువాత గుర్తుచేసుకున్నారు. %వవ% పోరాటం ఇక్కడితో ఆగకూడదు. ప్రతి బాధితుడికి నష్టపరిహారం అందేలా చూడాలి. ఒత్తిడి ఉన్నప్పటికీ గినియా న్యాయవ్యవస్థ ఈ విచారణను విజయవంతమైన ముగింపుకు తీసుకువచ్చింది. ఇది దేశ సరిహద్దులు దాటి ప్రజలను ప్రేరేపించడానికి, బాధితులు ప్రపంచంలో ఎక్కడ ఉన్నా వదిలిపెట్టకుండా ప్రోత్సహించడానికి ఒక ఉదాహరణగా నిలవనుంది.

# ప్రమాద అంచున సింగరేణి-పోరాటమే శరణ్యమా?

- సింగరేణికి నష్టం తెచ్చే చర్యలు తీసుకుంటున్న ప్రభుత్వాలు
- నేటి తెలంగాణ సమాజంపై దుష్ప్రభావం తప్పదా?
- ప్రభుత్వ రంగసంస్థలను గనమ్మడం వెనుక కథేంటి ?
- కార్పోరేట్ సెక్టారుకు ఊడిగం చేసి లాభాలు సమకూర్చి తరించటమా?
- పాలకులు చెపుతున్నది ఏంటి? చేస్తున్నది ఏంటి?
- సరళీకరణ,ప్రయివేటీకరణ, ప్రపంచీకరణ,ఆర్థిక విధానాలతో ముందుకు సాగుతున్న ప్రభుత్వాలు

**లిడాక్టర్. కోలాహలం రామ్ కిశోర్.**
**9849328496**

ఇప్పుడు కేంద్రంలో బీజేపీ,తెలంగాణ రాష్ట్రంలో మొన్నటిదాక బీఆర్ఎస్,నేడు కాంగ్రేస్... పార్టీల పేరు మాత్రమే వేరు. కానీ వారి లక్ష్యం,కార్యాచరణ మాత్రం ఒకటే.ఇక్కడ అన్నిపార్టీల లక్ష్యం ప్రభుత్వ రంగసంస్థలను తెగనమ్మడం,కార్పోరేట్ సెక్టారుకు ఊడిగం చేసి వారికి లాభాలు సమకూర్చి తరించటం. గతంలో కార్మికుల సంక్షేమం వారి భద్రత కోసం,పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా ప్రభుత్వ రంగ సంస్థలకు కొన్ని ఉత్పత్తులను రిజర్వు చేయడం కోసం కేంద్ర ప్రభుత్వం అనేక ఉపయోగ కరమైన చట్టాలు చేసింది.కానీ1990 తర్వాత ప్రభుత్వ విధానాల్లో మౌలికంగా మార్పు వచ్చింది. సరళీకరణ,ప్రయివేటీకరణ, ప్రపంచీకరణ,ఆర్థిక విధానాలతో,మార్కెట్ల అన్వేషణతో మొదలైంది.గాట్ ఒప్పంద నియమాలు,వరల్డ్ బ్యాంక్ ఆర్థిక నియమాల నియంత్రణ,ఇంటర్ నేషనల్ మానటరీ ఫండ్ రుణాలు,వాటి అనువర్తిత నియమాలు, పీవీ నరసింహారావు,మన్మోహన్ సింగ్ అమలు చేసిన ఆర్థిక నియమ, నిబంధనలే ఆతరువాత బీజేపీ ప్రభుత్వం కూడా అనుసరిస్తూ వస్తుంది. పార్టీలు,సిద్ధాంతాలు,పార్టీ గుర్తులు మాత్రం వేరు. అనుసరించే ఆర్థికవిధానం ఒక్కటే.చంద్రబాబు ఈ ఆర్థిక విధానాలను ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో అత్యంత వేగంగా అమలు చేశాడు. వరల్డ్ బ్యాంక్,ఐఎంఎఫ్ స్థలకు దేశంలో బ్రాండ్ ఎంబాసిడర్ గా సీఈఓ గా పేరు పొందాడు.వీరి జెండాలు కేంద్రంలో గానీ రాష్ట్రాలలో గానీ వేరు,వేరు. కనీ ఎజెండా మాత్రం ఒక్కటే. ఆ నేపథ్యం లోనే సింగరేణి ప్రయివేటీకరణ సమస్యను చూడాలి.మొదట కాప్టివ్ మైనింగ్ పేరుతో కోల్ ఇండియా,సింగరేణి నుంచి కోల్ కొనకుండా తానే ఉత్పత్తి చేసుకొనేందుకు అవకాశం కల్పించింది. ఆ తర్వాత నెమ్మదిగా సాధారణ బొగ్గు తవ్వకాల్లో కూడా ప్రయివేట్ సంస్థలకు చొరబాటుకు దారి చూపి ఆపై వెసులుబాటు కల్పించింది. లీజ్ ఒప్పంద విధానాల్లో సులభతరంగా మార్పులు చేసింది. కేంద్రంలో మోదీ ప్రభుత్వం గత పదేళ్ళుగా దూకుడుగా ప్రయివేటీకరణ విధానాలను అమలు చేస్తుంది. అందులో భాగంగా సింగరేణిలో 2021లో మరో దుర్మార్గ చట్టాన్ని తీసుకొచ్చింది. బొగ్గు వేలం పాటలో నెగ్గిన వారికి ఎలాంటి కండిషన్లు లేకుండా ఆ చట్టం పూర్తి స్వేచ్ఛను ఇచ్చింది. కార్మికుల భద్రత, సంక్షేమం, పర్యావరణ సంరక్షణ మొదలైన సమస్యసు ఏమైనప్పటికీ ..ఇవేవీ వారికి ముఖ్యం కాదు.వారికి కేవలం లాభాలు దండు కోటమే లక్ష్యం.కార్పోరేట్ సెక్టారుకు ముఖ్యంగా మోదీ ప్రియ మిత్రునికి వ్యాపార సామ్రాజ్య విస్తరణలో ఇతోదికంగా సహకరించటం. రాష్ట్రంలో సింగరేణి ప్రధానమైన ప్రభుత్వ రంగ సంస్థ.ఇదిలక్షాలాది కార్మికులతో లాభాలు ఆర్జిస్తూ ముందుకు నడుస్తుంది. ఈ సింగరేణి సమస్య కేవలం ఆ ప్రాంత ప్రజల అభివృద్ధితో మాత్రమే ముడిపడి లేదు.దానితో పాటు, కొనుగోలు శక్తి పెంచేందుకు ఇది ఉపయోగకరంగా ఉంది.విద్య, ఉపాది,సాంస్కృతి పరంగా పెనవేసుకొని అభివృద్ధికి దోహదపడే సంస్థ.ఇంత ప్రాముఖ్యత కలిగిన సింగరేణి సంస్థను వేలంపాటలను నిర్వహించటం ద్వారా ప్రయివేటీకరించడం ఎంత మాత్రం తగదు. ప్రయివేటీకరణ వల్ల ఆసంస్థతో పాటు లక్షలాది కార్మిక కుటుంబాల మనుగడే ప్రశ్నార్థకంగా మారుతుంది. వాస్తవంగా ప్రభుత్వమే పూనుకొని సింగరేణి ద్వారా బొగ్గు తవ్వకాలు జరిపితే ఉత్పత్తి కారు చౌకగా లభిస్తుంది. విద్యుత్ ఉత్పత్తి కూడా ధారాళంగా,చౌవకగా లభిస్తుంది. దానితో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలకు అదనపు ఆదాయం మెండుగా సమకూరుతుంది. కార్మికుల, ప్రజల ప్రాధాన్యతలను పక్కనపెట్టి బొగ్గుబ్లాకును వేలం వేయటం దుర్మార్గం,శోచనీయం. ఈ అమానుష త్వానికి కారణం కార్పొరేట్లతో (ముఖ్యంగా అదానితో)మోదీ ప్రభుత్వానికున్న విడదీయరాని అను బంధమే అందుకు కారణమని తెలుస్తుంది.ఒక్కడి వ్యాపార ప్రయోజనాల కోసం ,ఈ బడా కార్పొరేట్ల లాభాల కోసం సక్షలాది కార్మికుల,వారిపై ఆధారపడ్డ ఇతర ప్రజల పొట్టలు కొట్టడమే మోదీ ప్రభుత్వ అంతిమ లక్ష్యం. ఈ దురాగతాన్ని వామ పక్షలాతో పాటు ఇతర విపక్షాలు ఉమ్మడిగా అడ్డుకోవాలి. సిపిఐఎం తలపెట్టిన ఈ చైతన్య యాత్రకు ప్రజలంతా స్వాగతం పలకాలి. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరించే ఈవిధానాలను సామాన్య ప్రజలవద్దకు చేర్చాలి. పాలకుల విధానాల వల్ల కోల్ ఇండియా, సింగరేణికి ఎలాంటి హక్కులు లేకుండా మిగతా వాటి లాగానే వేలం పాటలో పాల్గొనాలి.యూపీఏ ప్రభుత్వ కాలంలో కోల్ ఇండియా లో10 శాతం వాటాలు అమ్మితే, మోదీ ప్రభుత్వం మరో 29 శాతం వాటాలను అమ్మింది . క్రమంగా వాటికున్న హక్కులను నిర్వీర్యం చేయటం, తెలంగాణ వరప్రదాయని సింగరేణిని కార్పొరేట్ల చేతుల్లో పెట్టడం దాని లక్ష్యంగా ఉంది. ఆ విధానాలకు వ్యతిరేకంగా 2003లో సింగరేణి 15 రోజులు పాటు సమ్మె చేసింది. ఆ తర్వాత అనేక పోరాటం జరిగాయి. అయినా పాలకులు పెడచెవిన పెడుతున్నారు. మోదీ ప్రభుత్వం నగదీకరణ పేరుతో ,ప్రయివేటు వాళ్లకు విపరీత రాయితీలు ఇచ్చింది. బుగ్గ దిగుమతుల మీద సుంకం రద్దు చేసింది. వీటితో పాటు దేశంలో బొగ్గు వినియోగించే సంస్థలన్నీ 10 శాతం దిగుమతి చేసుకోవాలని కేంద్ర ప్రభుత్వం నిబంధనలు కూడా విధించింది. ఆ విధంగా అదాని దెగ్గర దిగుమతుల రూపంలో బొగ్గు కొనేందుకు అవకాశం కల్పించింది. దీంతో టన్ను బొగ్గు రూ.3,500, రూ.4000 కి ఇచ్చే సింగరేణి బొగ్గును కాదని అనివార్యంగా ఏపీ ప్రభుత్వం గతంలో టన్ను రూ.18 వేల రూపాయలు చొప్పున 7 లక్షల టన్నుల బొగ్గు దిగుమతి ఒప్పందం చేసుకుంది. అట్లాగే సింగరేణికి రాష్ట్ర ప్రభుత్వం జెన్ కో, ఎన్ టీ పీసీ, రూ.30 వేల కోట్లు బకాయిపడ్డాయి.అయినా సింగరేణి లాభం ల్లోనే ఉన్నదన్న విషయాన్ని మర్చిపోవద్దు. విద్యుత్ ఉత్పత్తిలోనూ ప్రయివేట్ శక్తుల ప్రయోజనాలనే ప్రభుత్వం చూస్తుంది. తద్వారా చార్జీలు పెరుగుతాయి. ఈ విధానాల వల్ల ప్రజల మీద, సమాజం మీద తీవ్ర దుష్ప్రభావం పడుతుంది. ప్రభుత్వ ఖజానా



మీద కూడా ప్రభావం ఉంటుంది.

**ప్రజలు,కార్మికుల కార్యాచరణ:**

గోదావరి నది పరివాహ ప్రాంతంలో సింగరేణి సంస్థ సొంత ఖర్చులతో అనేక ప్రాంతాల్లో సర్వే చేసి బొగ్గు బ్లాక్ లను గుర్తించింది.ఆపై బొగ్గు ఉత్పత్తిని కూడా చేపట్టింది.' శ్రావణ ఫల్లి' లో కూడా ఆ రకంగానే బొగ్గు తవ్వకాలు చేపట్టాలి. కానీ వేలం పాటలు ద్వారా దక్కించుకోవాలని బిజెపి ప్రభుత్వం నిర్ధేశిస్తుంది. గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వం కూడా ఇదే బాటలో నడిచి వేలం పాట ద్వారానే ప్రయివేటు వారికి ఇచ్చివేశారు.దీనివల్ల సింగరేణికి పని లేకుండా పోతుంది.క్రమంగా సింగరేణి నష్టాల లోకి జారుకుంటుంది. బీజేపీ పాలకులకు అదే కావాలి. అందుకే వేలాన్ని రద్దు చేయాలని కార్మికులు,వారి కుటుంబాలు ఆశేష ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.తెలంగాణలో బొగ్గు బ్లాకులన్నీ సింగరేణి హక్కుగా పరిగణించి తీరాలి.నేరుగా సింగరేణికే బొగ్గు బ్లాకులు ఇచ్చితీరాలి. సింగరేణిని ఎట్టి పరిస్థితుల్లో ప్రయివేటీకరించబోమని ఒకవైపు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చెపుతూనే, మరో ప్రక్క వేలం పాటలు పెట్టడం ఎందుకోసం? ఈ హామి పచ్చి భూటకం అని తేలటం లేదా? ఇది ప్రజలను,కార్మికులను పక్కదారి పట్టించి మోసగించడం కాదా!

**సింగరేణిపై బీజేపీ ,కాంగ్రేస్ వైఖరేమిటి?**

మొన్న జరిగిన వేలం పాట ప్రారంభం సందర్భంగా కిషన్ రెడ్డితో పాటు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి బట్టి బట్టి విక్రమార్క రాష్ట్ర ప్రభుత్వం తరపున పాల్గొనటం ఎంత మాత్రం సరికాదు.అసలు సింగరేణి సమస్యలపై కేంద్రంలో రాహుల్ గాంధీ,రాష్ట్రంలో ముఖ్యమంత్రి కాంగ్రేస్ వైకరేమిటో కార్మికులకు,ప్రజలకు స్పష్టం చేయాలి. మనుసుగులో గుద్దులాట వద్దు.

**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపూనుకోవాలి:**

రాష్ట్ర ప్రభుత్వం కూడా సింగరేణి పరిరక్షణ కోసం కేంద్ర ప్రభుత్వంపై తీవ్రంగా ఒత్తిడి తేవాలి. ప్రస్తుత రాష్ట్ర శాసనసభ సమావేశాల్లోనే ఏకగ్రీవ తీర్మానం చేయాలి. వెనువెంటనే ముఖ్యమంత్రి నేతృత్వంలో అఖిలపక్షాన్ని కేంద్ర ప్రభుత్వం వద్దకు తీసుకుపోయి ఒతితిడి పెంచాలి.

**కార్మిక వర్గం కర్తవ్యం:**

దొడ్డిదారిని సింగరేణిని వేలం ద్వారా ప్రయివేటీకరించేందుకు జరిగే కుట్రను కార్మిక వర్గం,ప్రజలు,అన్ని పార్టీల ప్రజాప్రతినిధులు ఐక్యంగా అడ్డుకోవాలి. వేలం పాటలను ప్రభుత్వ రద్దు చేసేదాక పట్టు విడవక పోరాడాలి.

## తెలంగాణ లో సామాజిక 'ఆర్థిక 'అధ్యయన పరిశోధనా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రపంచ స్థాయి ఉన్నత ప్రమాణాలతో విద్యను అందిస్తూ స్వదేశీ 'విదేశీ విద్యార్థులను ఆకర్షిస్తుంది . ఉన్నత స్థాయి ప్రమాణాలతో కూడిన అధ్యయన పరిశోధన కేంద్రంగా విలసిల్లుతోంది. కేంద్ర ప్రభుత్వం హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో తెలంగాణ సామాజిక 'ఆర్థిక ' రాజకీయ 'సాంస్కృతిక అంశాలపై అధ్యయన పరిశోధన కేంద్రాన్ని నెలకొల్పాలి. మల్టీ డిసిప్లినరీ రీసెర్చ్ సెంటర్ ఏర్పాటుచేసి వివిధ విభాగల్లో లోతైన అధ్యయనం పరిశోధన కార్యక్రమాలు చేపట్టాలి.తెలంగాణ రాష్ట్రంలో ఉన్న సామాజిక 'ఆర్థిక రాజకీయ ' సాంస్కృతిక ' ప్రాంతీయ' ఉప ప్రాంతీయ స్థితిగతులపై శాస్త్రీయ పద్ధతిలో సమగ్రమైన అధ్యయనం పరిశోధన జరుపాలి.తెలంగాణ ప్రాంతంలోని ప్రజల సామాజిక 'ఆర్థిక 'సాంస్కృతిక 'భాష ' ఆచార వ్యవహారాలు నాగరికత 'సంస్కృతి వారసత్వం 'చారిత్రిక విశేషాల మీద అధ్యయనం పరిశోధన కొరకు ప్రత్యేక పైలెట్ ప్రాజెక్టులు చేపట్టాలి.లివ్యవసాయంబిఅనుభందరంగాలు బిఅభివృద్ధిలి తెలంగాణ ప్రాంతంలో వ్యవసాయ రంగం అనుబంధ రంగాల అభివృద్ధి 'సహజ వనరులు ' భూమి లభ్యత మీధ సర్వేలు నిర్వహించి నేలల స్వరూపం 'స్వభావం పంటల తీరు 'జలవనరుల లభ్యత 'నీటిపారుదల సౌకర్యాలు' చెరువులు కుంటల సంరక్షణ.ఆదునిక వ్యవసాయ పద్ధతుల మీధ రైతులకు ఉచిత శిక్షణ ఇవ్వాలి . వాతావరణం పంటల తీరు 'సస్య రక్షణ చర్యలు 'పశుగణాభివృద్ధి పూల తోటల పెంపకం ఉద్యానవన పంటల సాగు ఉపాధి ఉత్పత్తి' ఉత్పాదకత రవాణా ' మార్కెటింగ్ మొన్నగు అంశాల మీద పరిశోధన జరగాలి. గ్రామీణ పరిశ్రమల అభివృద్ధిలి యువతకు ఉపాధి కల్పన ఆదాయ సృష్టి లో గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్న చేతివృత్తిదారులుఎదుర్కొంటున్న సమస్యలు వాటికి పరిష్కారాలు. చేతివృత్తి దారుల సంక్షేమం అభివృద్ధి కొరకు కేంద్ర' రాష్ట్ర'స్థానిక ప్రభుత్వాలు ప్రవేశ పెట్టిన పథకాలు అమలు. క్షేత్ర స్థాయిలో ఎదురవుతున్న సవాళ్లను పరిష్కరించే విధానాలను రూపొందించడం చిన్న 'లఘు 'కుటీర 'గ్రామీణ పరిశ్రమల అభివృద్ధికి కార్యాచరణ ప్రణాళికల రూపకల్పనకు శాస్త్రీయ అధ్యయంతో పరిశోధన కార్యక్రమాలు నిర్వహించి అవగాహన చైతన్యం కలిగించేందుకు అధ్యయన పరిశోధన కేంద్రం దోహదపడుతుంది . సోషల్ వెల్ఫేర్ తెలంగాణ రాష్ట్రంలో సామాజికంగా విద్యాపరంగా 'ఆర్థికంగా వెనుకబడిన వర్గాల ప్రజల ఆర్థిక స్థితిగతులు' ఎస్సీ' ఎస్టీ మైనార్టీల 'మహిళల'సామాజిక ఆర్థిక అంశాలు 'విద్య 'ఉపాధి అవకాశాలు .మహిళాసాధికారిత' యువజన సాధికారిత 'విద్య' వైద్య సౌకర్యాల కల్పన మొన్నగు పథకాల ఫలితాలు వాటిపై సమీక్ష అధ్యయనం చేసి పరిశోధనల ద్వారా పరిష్కారాలు చూయించాలి. వివిధ రకాల చేతి వృత్తుల పై ఆధారపడే జనాభా సమాచారాన్ని సేకరించి బడ్జెట్లో నిధుల కేటాయింపు వినియోగం పట్ల పరిశోధనలు చేసి లోపాలను సరిదిద్దడానికి సూచనలు చేయాలి. యువతలో వృత్తి నైపుణ్య శిక్షణ సౌకర్యాలు కల్పించి "స్కిల్ "ద్వారా ఉపాధి సౌకర్యాలు కల్పించే అవకాశాలను గుర్తించడం. యువత 'మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పన మొన్నగు అంశాలను అధ్యయనం చేయాలి. చేతువృత్తి దారులు ఎదుర్కొంటున్న ముడి సరుకుల కొరత 'ఉత్పత్తి స్టోరేజ్ 'రవాణా ' మార్కెటింగ్ సమస్యలు వాటిపరిష్కారానికి సమగ్రపరిశోధనలనుచేపట్టడం ఔత్సాహిక ఉద్యమిత్వాన్ని గుర్తించడంలి యువజన నైపుణ్య అభివృద్ధి ఉపాధి కల్పన ఆదాయ సృష్టి ఉత్పాదకత సామర్థ్యం చిన్న పరిశ్రమలఏర్పాటు.పారిశ్రామిక వ్యాపార' యాజమాన్యాన్ని ప్రోత్సహించడం' ఔత్సాహిక పారిశ్రామికవేత్తల గుర్తింపు 'పరిశ్రమల స్థల నిర్ణయం 'బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన సామాజికరుగ్మతగాపరిణమించిన బాల్యవివాహాలు నిర్మూలన 'డ్రగ్స్ మాదక ద్రవ్యాల నియంత్రణ 'మానవ అక్రమ రవాణా 'గ్రామీణ పట్టణ ఆర్థిక వ్యత్యాసాలు గ్రామీణ పట్టణ వలసలు పట్టణాభివృద్ధిలో ఎదురయ్యే సమస్యలు పరిష్కారాలు చూయించాలి. వెనుకబడిన ప్రాంతాలకు గుర్తింపు వాటి అభివృద్ధికి ప్రత్యేక ప్యాకేజీలు 'సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి తేవడం ప్రత్యేక ప్రాజెక్టుల రూపకల్పన' స్థానిక సంస్థలకు ఆర్థిక సాధికారిత మున్నగు అంశాల పట్ల సమగ్రమైన ఆర్థిక పాలనా విధానాలను రూపొందించడానికి పాలకులకు ప్రభుత్వ యంత్రాంగానికి అధ్యయన పరిశోధన కేంద్రం దశ దిశను నిర్దేశిస్తుంది. తెలంగాణ సామాజిక 'ఆర్థిక చరిత్ర' సంస్కృతి 'నాగరికత బాషా సంరక్షణకు అవలంబించాల్సిన విధానాల రూపకల్పన' ఆర్థిక వృద్ధి' అభివృద్ధి' మానవ వనరుల అభివృద్ధి 'పర్యావరణ సంరక్షణ ' కాలుష్య నియంత్రణ సాధనలో అధ్యయన పరిశోధన కేంద్రం క్రియాశీలక పాత్ర పోషిస్తుంది.భారత దేశంలోని మిజోరాం' 'రాజస్థాన్ 'తమిళనాడు రాష్ట్రాలలో సామాజిక ఆర్థిక అధ్యయన కేంద్రాలను ఏర్పాటు చేసుకొని ఆయా రాష్ట్రాలు దీర్ఘకాలికంగా ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేశాయి. అదే తరహాలో తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కొరకు అధ్యయన పరిశోధన కేంద్రాన్ని కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేయాలి. అధ్యయన పరిశోధన కేంద్రాన్ని ఏర్పాటు చేయడం ద్వారా పరిశోధక విద్యార్థులకు యువతకు ఉపాధి అవకాశాలు కలుగుతాయి. తెలంగాణ సామాజిక ఆర్థిక అభివృద్ధి ప్రక్రియలో మేధావుల 'పరిశోధకుల భాగస్వామ్యం పెరుగుతుంది. పరిశోధకుల ప్రతిభను ఉపయోగించుకుని రాష్ట్రాన్ని ప్రగతి పథంలో ముందుకు తీసుకపోయే అవకాశం కలుగుతుంది. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ ఆకాంక్షలు ధ్యేయాలు లక్ష్యాలు సాకారానికి ఈ కేంద్రాలు దిశ దశ నిర్దేశిస్తాయి, హైదరాబాద్ యూనివర్సిటీలో స్వతంత్ర ప్రతిపత్తితో తెలంగాణ సమస్యల పరిశోధన అధ్యయన కేంద్రాన్ని నెలకొల్పి తెలంగాణ రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఆశిద్దాం.

**నేదునూరి కనకయ్య**
**9440245771**

## ఇలాంటి జడ్జీలుకూడా ఉంటారా ?

నిన్న తెలంగాణ హైకోర్టు లో ఒక జడ్జీగారు కదిరి కృష్ణ కేసులో , మీకు నమ్మకం లేకపోతే పోవచ్చు , విమర్శిస్తావా అనిఅన్నాడు. అదేమిటి ? ఖచ్చితంగా విమర్శించవచ్చు. ఉన్నాడని చెప్పేహక్కు మీకెంతవుందో , లేడని విమర్శించేహక్కు తిపౌరుడుకిఉంది. ఈవిషయం మద్రాస్ హైకోర్టు చాలాసార్లు చెప్పింది. ఉన్నాడని చెప్పేవాళ్లు రుజువుచెయ్యాలి. లేనిదాన్ని వున్నదనిచెప్పటం మోసం అవుతుంది. మరి ఉన్నాడని చెప్పేవారిని రుజువుచెయ్యమని జడ్జీగారు అంటేబాగుండేది. అంతేకాదు గత మే నెలలో మద్రాస్ హైకోర్టు ఒక తమాషా తీర్పుచెప్పింది . తమిళనాడులో ఒక సమాధిదగ్గర భోజనాలు జరిగిన తరువాత , ఆ ఎంగిలి అకులమీద దళితులు , సూద్రులు పొర్లాడితే సుభం జరుగుద్దని ఒక ఆచారంగా పొర్లాడుతూ ఉండేవారు .ఈఆచారం మనుషులకు అవమానకరం , నిషేదించమని 2015 లో ఎవరో కోర్టుకి వెళ్ళగా , ఈఆచారాన్ని కోర్టు నిషేదించింది.అయితే ఈ సనాతనధర్మము కొనసాగాలని వేరొకరు కోర్టుకి వెళ్ళగా , ఈఆచారం కొనసాగవచ్చు అని మొన్న మే నెలలో మద్రాస్ హైకోర్టు లో ఒక జడ్జిగారు తీర్పు ఇచ్చారు .అంతేనా ఆమధ్య నార్త్ లో ఒక రాష్ట్రంలోకార్చిచ్చు వలన అడవి దహించుకపోతుంటే , వన్యప్రాణులుచనిపోతున్నాయి , కార్చించు ఆపేందుకు ఆరాష్ట్ర ప్రభుత్వన్ని అదేశించాలని ఒకవ్యక్తి కోర్టుకి వెళ్ళగా , ఆజడ్జి గారు కేసువేసినతనిని , ముందు మీరువెళ్లి వరుణయాగం చెయ్యమని సలహా ఇచ్చాడు. ఇలాంటివారు కూడా ఉన్నారా అని అనిపిస్తుంది. ఇస్రోచైర్మన్ ప్రతిసారి చెంగాలమ్మకు దణ్ణంపెటుకొనిగాని రాకెట్ పయికి పంపడు . ఇలాంటివారికి చిన్నపుడు వారి అమ్మమ్మలు , తాతయ్యలు చెప్పిన దేవుడు , దెయ్యం , బూచోడు లాంటి మాటలుమరచిపోకుండా , నరనరాల్లో చాందస భావాలు జీర్ణించుక పోయినందున , ఎంతచదువుకున్నా , మూఢనమ్మకాలనుండి బయటపడలేకపోతున్నారు.అందుకె ప్రాథమికవిద్యనుండి విద్యార్థులకు పుక్కిటిపురాణాలు లేని శాస్త్రీయ విద్యను అందించాలి .అపుడేసమాజం మూఢనమ్మకాలులేని ఒక ఉన్నతమయిన , శాస్త్రీయమైన , ఆదర్శవంతమైన సమాజం ఏర్పడుతుంది .

**నార్నెవెంకటసుబ్బయ్య .**
**9290617819**

# రేవంత్ రెడ్డీ... పదవి శాశ్వతం కాదు గుర్తు పెట్టుకో: హరీశ్ రావు ఆగ్రహం



తెలంగాణ బ్యూరో ప్రతినిధి:రేవంత్ రెడ్డి పదవి శాశ్వతం కాదని గుర్తు పెట్టుకో అహంకారంతో రెచ్చిపోతున్నావ్ కిందపడతావ్ జాగ్రత్త అని బీఆర్ఎస్ నేత, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు హెచ్చరించారు. ఎంబీబీఎస్ కోర్సుల్లో ప్రవేశాల కోసం రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో నెంబర్ 33పై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంటర్మీడియేట్ సహా అంతకుముందు నాలుగేళ్లు ఎక్కడ చదివితే అక్కడ 'లోకల్' అని కొత్త జీవోలో పేర్కొన్నారని తెలిపారు. కానీ ఏడేళ్లలో కనీసం నాలుగేళ్లు ఎక్కడ చదివితే అక్కడ స్థానికత వర్తిస్తుందని పాత జీవో చెబుతోందన్నారు. ఈ ప్రభుత్వం ఏడేళ్లలో కనీసం నాలుగేళ్లు అనే దానిని తొలగించి... 9, 10వ తరగతులు, ఇంటర్ ఎక్కడ చదివితే అక్కడ అని చెబుతోందన్నారు. మన ఉద్యోగాలు మనకే దక్కాలనేది తమ నినాదమని, అందుకే 95 శాతం ఉద్యోగాలు మనకు దక్కాలనే ఉద్దేశంతో జీవో 114ను తీసుకువచ్చామన్నారు. మనకు ఉద్యోగాలు దక్కాయని... ఇప్పుడు విద్యావకాశాలు కూడా మనకు దక్కాలన్నారు. ఇంజినీర్లు, డాక్టర్లు, లాయర్లు, ఫార్మసీ, అగ్రికల్చర్ బీఎస్సీ, పీజీ కోర్సులు ఇలా విద్యలోనూ స్థానికతను నిర్ధారించేందుకు గత ప్రభుత్వం నియమ నిబంధనలను రూపొందించిందన్నారు. కానీ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం మెడికల్ అడ్మిషన్స్ కోసం జీవో 33ను కొత్తగా తీసుకువచ్చిందన్నారు. ఇది అసమగ్రమైన జీవో అని విమర్శించారు. ప్రస్తుత జీవో ప్రకారం మన తెలంగాణ బిడ్డనే మనకు నాన్ లోకల్ అయ్యే పరిస్థితి ఉంటుందన్నారు.

# జగన్ కేసుల కాలయాపన ఎందుకు?

- సుప్రీంకోర్టు ధర్మాసనం ఆగ్రహం
- రఘురామ కృష్ణరాజు దాఖలు చేసిన పిటిషన్పై విచారణ
- చార్జిషీట్లు దాఖలు చేసి పన్నెండేళ్లు దాటినా ముందుకు సాగలేదని ఆరోపణ
- ట్రయల్స్ ముందుకు సాగకుండా డిశ్చార్జ్ పిటిషన్లు వేస్తున్నారన్న సిబిఐ
- ఇప్పటికి 39 క్వాష్, 95 డిశ్చార్జ్ పిటిషన్లు దాఖలు
- వీలైనంత వేగంగా విచారణ పూర్తి చేయాలని సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు



న్యూఢిల్లీ : జగన్ అక్రమాస్తుల కేసుల విచారణను వీలైనంత వేగంగా పూర్తి చేయాలని సుప్రీంకోర్టు.. సీబీఐ కోర్టును ఆదేశించింది. రఘురామ కృష్ణరాజు దాఖలు చేసిన పిటిషన్పై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. జగన్ అక్రమాస్తుల కేసుపై జరుగుతోన్న విచారణలో కాలయాపనపై జస్టిస్ సంజీవ్ ఖన్నా అసహనం వ్యక్తం చేశారు. సీబీఐ దాఖలు చేసిన అఫిడవిట్ లో పేర్కొన్న అంశాలు ఆశ్చర్యకరంగా ఉన్నాయన్నారు. కోర్టు ఇచ్చిన ఆదేశాలు తప్పు అనేలా కాలయాపన చేస్తున్నారని.. ట్రయల్స్ ముందుకు సాగకుండా డిశ్చార్జ్ పిటిషన్లు వేస్తున్నారని.. ఇదే విచారణలో జాప్యానికి కారణం అవుతుందని సీబీఐ అఫిడవిట్ దాఖలు చేసింది.జగన్ అక్రమాస్తుల కేసు వివరాలు, పురోగతిని సుప్రీంకోర్టుకు నివేదిక ఇచ్చింది. డిశ్చార్జ్ పిటిషన్లు వేసి విచారణ ముందుకు సాగనివ్వట్లేదని తెలిపింది. ఈ కేసులో ఇప్పటికి 39 క్వాష్, 95 డిశ్చార్జ్ పిటిషన్లు దాఖలు చేశారని ఈ పిటిషన్లపై తీర్పులు ఇచ్చేలోపే జడ్జీలు బదిలీ అవుతున్నారని సీబీఐ అఫిడవిట్లో తెలిపింది. ఈ కేసులో ఉన్న నిందింతులంతా శక్తిమంతులే అని సీబీఐ తెలిపింది. మొత్తంగా క్వాష్ పిటిషన్లపై విచారణ సమయంలోనే ఆరుగురు జడ్జిలు మారిపోవడం, రిటైర్ కావడం జరిగిందని రఘురామ తరపు న్యాయవాది ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. డిశ్చార్జ్ పిటిషన్లు వేస్తున్నారని ట్రయల్ ముందుకు సాగకుండా ఇది అడ్డంకిగా మారుతోందని న్యాయస్థానానికి సీబీఐ వివరించింది. దీంతో.. డిశ్చార్జ్ పిటిషన్లకు.. అసలు కేసుల ట్రయల్కు సంబంధం లేని వీలైనంత వేగంగా విచారణ పూర్తి చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించిది. తదుపరి విచారణను నవంబర్కు వాయిదా వేసింది. వైఎస్ జగన్ అక్రమాస్తుల కేసు దర్యాప్తు నానాటికీ ఆలస్యమవుతోందని, తెలంగాణ హైకోర్టు పర్యవేక్షణలో ఉన్న ఈ కేసు విచారణ ముందుకు సాగకుండా జగన్ తో పాటు ఇతర నిందితులు వందల కొద్దీ డిశ్చార్జ్ పిటిషన్లు వేస్తున్నారని వైసీపీ ఎంపీ రఘురామ గత ఏడాది సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. ఈ కేసును విచారిస్తున్న హైదరాబాద్ సీబీఐ కోర్టు ఇప్పటికే 3 వేల సార్లు వాయిదా వేసిందని జగన్ కేసుల్ని తెలంగాణ నుంచి వేరే రాష్ట్రానికి బదిలీ చేయాలని రఘురామ కోరారు. రఘురామ పిటిషన్లపై గతంలో విచారణ జరిపినప్పుడే సీబీఐ అఫిడవిట్ దాఖలు చేసింది. ఇప్పుడు నేరుగా సీబీఐ కోర్టుకు... సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేయడంతో.. జగన్ అక్రమాస్తుల కేసులో ట్రయల్ ప్రారంభమయ్యే అవ కాశాలు ఉన్నాయి. అదే జరిగితే జగన్ కోర్టుకు హాజరు కావాల్సి ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఇప్పటికే చార్జిషీట్లు దాఖలు చేసి పన్నెండేళ్లు దాటినా న్యాయవ్యవస్థలో ఉన్న అవకాశాల్ని ఆధారంగా చేసుకుని ట్రయల్ ప్రారంభం కాకుండా పిటిషన్లు వేస్తున్నారన్న ఆరోపణలను సీబీఐ చేస్తోంది.

# వయనాడ్ విషాదం..జాతీయ విపత్తుగా ప్రకటించాలి

- లోక్సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ
- కేంద్రం బాధిత కుటుంబాలకు అండగా నిలవాలి
- సమగ్ర పునరావాసం కల్పించాలి
- సహాయం చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు: రాహుల్



ఢిల్లీ: కేరళలోని వయనాడ్ జిల్లాలో వరదల కారణంగా కొండచరియలు విరిగిపడిన ఘటనలో వందలాది మంది మృతి చెందారు. మరి కొంతమంది ఆచూకీ తెలియాల్సి ఉంది. అయితే ఈ విపత్తుని జాతీయ విపత్తుగా ప్రకటించాలని లోకసభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కేంద్రాన్ని కోరారు. రాహుల్ గాంధీ బుధవారం లోక్సభలో జీరో అవర్లో మాట్లాడుతూ.. 'కొండచరియలు విరిగిపడిన ప్రాంతాలను సందర్శించాను. ఈ ఉత్పాతం జరిగిన ప్రదేశంలో కీలకమైన రహదారులు దెబ్బతిన్నాయి. ఈ ఘటనలో 200 మందికి పైగా మృతి చెందగా చాలా మంది ఆచూకి తెలియలేదు. మృతుల సంఖ్య పెరిగే అవకాశాలున్నాయి. బాధితుల్లో కుటుంబంలోని సభ్యులందరినీ కోల్పోయి ఒంటరిగా మిగిలినవారు సైతం ఉన్నారు. ఇటువంటి సందర్భాల్లో కేంద్రం బాధిత కుటుంబాలకు అండగా నిలవాలి. ఈ విపత్తును జాతీయ విపత్తుగా ప్రకటించాలి. వారికి ఇచ్చే పరిహారాన్ని పెంచి, సమగ్ర పునరావాసాన్ని కల్పించాలి' అని కోరారు. సంక్షోభ సమయంలో బాధితులకు సహాయం చేసిన వారికి రాహుల్ కృతజ్ఞతలు తెలిపారు. సహాయక చర్యల్లో సహకరించిన కేంద్ర బలగాలు, సైనికులతో పాటు కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాలను ప్రశంసించారు.

# శ్రీలంకలో మరోసారి తెరపైకి రాజపక్సా కుటుంబం

- అధ్యక్ష ఎన్నికల బరిలో రాజపక్సా వారసుడు
- ఎస్ఎల్పీపీ పక్షాన బరిలోకి నమల్
- మహీందా రాజపక్సా కుమారుడే నమల్
- అధ్యక్ష ఎన్నికల్లో నలుగురి మధ్యే ప్రధాన పోరు



కొలంబో: దేశాన్ని తీవ్ర ఆర్థిక సంక్షోభంలోకి నెట్టి.. ప్రజాగ్రహానికి గురై పదవి నుంచి వైదొలిగిన శ్రీలంకలోని రాజపక్సా కుటుంబం మరోసారి తెరపైకి వచ్చింది. ఈ సారి దేశ అధ్యక్ష ఎన్నికల బరిలో తమ కుటుంబ వారసుడి పేరును ప్రకటించింది. ఎస్ఎల్పీపీ (శ్రీలంక పొదుజన పెరమున) పార్టీ తరపున దేశ అధ్యక్ష అభ్యర్థిగా నమల్ రాజపక్సా పేరును ప్రతిపాదించారు. ఈ విషయాన్ని పార్టీ ప్రధాన కార్యదర్శి సాగర కరియవసామ్ వెల్లడించారు. దీంతో లంక అధ్యక్ష ఎన్నికల పోరు ప్రధానంగా నలుగురి మధ్య జరగనుందని విశ్లేషకులు అంచనావేస్తున్నారు. ఇప్పటికే ప్రస్తుత అధ్యక్షుడు విక్రమసింఘే, ప్రతిపక్ష నేత సజిత ప్రేమదాస, జేవీపీ నాయకుడు అరుణ కుమార దిశనాయకే బరిలో నిలిచారు. రాజపక్సాకు చెందిన కుటుంబమే 2022 జులైలో విక్రమసింఘేకు అధికారం దక్కేలా సహకరించింది. ఆయన గొటబాయ నుంచి అధికారం స్వీకరించారు. 2022 ఏప్రిల్ మధ్యలో శ్రీలంక ప్రభుత్వం తొలిసారి అప్పులు చెల్లించలేక చేతులు ఎత్తేసింది. ఆ తర్వాత దేశ వ్యాప్తంగా చోటు చేసుకొన్న ఆందోళనలు, అధ్యక్ష భవనం ఆక్రమణతో గొటబాయ పదవిని వదులుకొన్నారు. దీంతో విక్రమసింఘే అధికారం చేపట్టారు. తాజాగా ఎస్ఎల్పీపీకి చెందిన దాదాపు 100 మంది ఎంపీలు రాజపక్సాకు మద్దతుగా వచ్చిన వేళ నమల్ పేరు తెరపైకి రావడం గమనార్హం.తొలుత ఎస్ఎల్పీపీ నుంచి వ్యాపారవేత్త దమ్మిక పెరేరాను అభ్యర్థిగా బరిలోకి దించాలని భావించారు. కానీ, వ్యక్తిగత కారణాలు చూపుతు ఆయన పోటీకి విముఖత వ్యక్తం చేశారు. దీంతో అప్పటికప్పుడు నమల్ పేరును ప్రకటించారు. మహీందా రాజపక్సా కుమారుడే నమల్.

# చేనేతకు పునరుజ్జీవం కల్పించడం మా బాధ్యత

- స్వతంత్ర సంగ్రామంలో నేతన్న ఉద్యమం కీలక పాత్ర
- తెలంగాణలో నేతనలకు గుర్తింపు ఇస్తాం



తెలంగాణ బ్యూరో ప్రతినిధి: జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా నేతన్నలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు తెలియజేశారు. "నాటి స్వాతంత్ర్య సంగ్రామంలో ఒక సాధనమైన చేనేత నేటి తెలంగాణ పునర్నిర్మాణంలోనూ ప్రధానంగా నిలిచింది, చేనేతకు పునరుజ్జీవం కల్పించడాన్ని ప్రజా ప్రభుత్వం బాధ్యతగా భావిస్తోంది. నాటి స్వాతంత్ర్య సంగ్రామంలో ఒక సాధనమైన చేనేత నేటి తెలంగాణ పునర్నిర్మాణంలోనూ ప్రధానంగా నిలిచిందన్నారు. మహిళా శక్తి గ్రూపులు, ప్రభుత్వ శాఖల ద్వారా చేనేతను ప్రోత్సహించే కార్యక్రమాలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని పేర్కొన్నారు. మగ్గం తో మానవాళికి నాగరికత నేసి చూపే సాంస్కృతిక కళాకారులు మన నేతకారులు అంటూ వారి ప్రతిభా పాటవాలు, సేవలను కొనియాడారు. అని సీఎం రేవంత్ రెడ్డి ఎక్స్ ఖాతాలో పోస్టు చేశారు.

# వినేష్ అనర్హతపై కలకలం

- అంతర్జాతీయ రెజ్లింగ్ అసోసియేషన్ ముందు భారత్ తీవ్ర నిరసన
- చేసిన ప్రయత్నాలు వెల్లడించిన కేంద్ర మంత్రి
- పార్లమెంటులో కేంద్రం అధికారిక ప్రకటన
- పార్లమెంటు నుంచి విపక్షాల వాకౌట్





ఢిల్లీ: భారత స్టార్ రెజ్లర్ వినేశ్ ఫొగాట్ పై అనర్హత వేటు పడటం యావత్ భారతావనిని దిగ్భ్రాంతికి గురిచేసింది. ఫైనల్ పోరుకు ముందు ఆమె నిర్ణీత బరువు కంటే కొన్ని గ్రాములు ఎక్కువగా ఉందని అనర్హత వేటు వేసిన అనంతరం ఆమె అనారోగ్యానికి గురి కావడం సర్వత్రా ఆందోళనకు గురిచేసింది. డీహైడ్రేషన్ కారణంగా స్పృహ కోల్పోవడంతో బుధవారం ఉదయం ఆసుపత్రిలో చేర్చిన ఉదంతం కలకలం రేపింది. కేవలం 100 గ్రాముల బరువు ఎక్కువ ఉందని అనర్హత వేటు వేయడం విశ్వ క్రీడారంగంలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ అంశం భారత పార్లమెంటును సైతం కుదిపేసింది. అన్ని రంగాల క్రీడా ప్రముఖులు స్పందించిన నేపథ్యంలో కేంద్ర క్రీడా శాఖ మంత్రి మన్సుఖ్ మాండవియా పార్లమెంట్లో స్పందించారు. రెజ్లర్ వినేష్ అనర్హతపై అంతర్జాతీయ రెజ్లింగ్ అసోసియేషన్ ముందు తీవ్ర నిరసన వ్యక్తం చేసినట్లు తెలిపారు.

**కేంద్ర మంత్రి ప్రకటన..విపక్షాల వాకౌట్ :** రెండుసార్లు బరువు కొలిచినప్పుడు ఆమె 50.100 కిలోలుగా తేలిందని క్రీడా మంత్రి తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ వినేష్ ఫొగట్ అంశానికి సంబంధించి భారత ఒలంపిక్ సంఘం చీఫ్ పిటి ఉషతో మాట్లాడి, తగిన చర్యలు తీసుకోవాలని సూచించారన్నారు. వినేష్ ఫొగట్కు అన్ని రకాల సహాయ సహకారాలు అందించామని ఒలింపిక్ సంఘం తెలిపినట్లు కేంద్రమంత్రి తెలిపారు. ఆమె కోసం 70.45 లక్షలకు పైగా ఖర్చు చేసినట్లు వెల్లడించారు. వినేష్ ఫొగట్ రెజ్లింగ్ మహిళల 50 కేజీల విభాగంలో మంగళవారం జరిగిన సెమీఫైనల్స్లో క్యూబా క్రీడాకారిణి ఓడించి ఫైనల్కు చేరింది. అంతకుముందు టోక్యో ఒలింపిక్ స్వర్ణ పతక విజేత సుసాకిని ఓడించి చరిత్ర సృష్టించింది. ఫైనల్కు కొన్ని గంటల ముందు ఓ చేదు వార్త బయటకురావడంతో భారతీయులంతా నిరాశ చెందారు. వినేష్ ఫొగట్ బరువు ఎక్కువగా ఉన్నారని తేలడంతో ఒలింపిక్స్ కమిటీ ఆమెపై అనర్హత వేటు వేయడంతో విశ్వ క్రీడల నుంచి ఆమె నిష్క్రమించాల్సి వచ్చింది.

**రెండు సార్లు పరీక్షలు:** రెజ్లింగ్లో తలపడే క్రీడాకారులకు ప్రతి రోజు ఉదయం బరువును పరిక్షిస్తారని.. ఆ పరీక్షల్లో బరువు అధికంగా ఉన్నట్లు తేలడంతో వినేష్ ఫొగట్పై అనర్హత వేటు పడినట్లు కేంద్ర క్రీడల శాఖ మంత్రి తెలిపారు. 50 కిలోల విభాగంలో ఆమెను అనర్హురాలిగా ప్రకటించినట్లు చెప్పారు. ఉండాల్సిన బరువుకంటే 100 గ్రాములు అధికంగా ఉన్నట్లు గుర్తించారన్నారు. తన బరువును నిరూపించుకోవడంలో విఫలమైనా, బరువు పరీక్షకు ఆటగాడు హాజరుకాకపోయినా అతడిపై అనర్హత వేటు వేయడంతో పాటు.. ర్యాంకుల జాబితాలో దిగువకు చేరుస్తారని ఒలింపిక్ నిబంధనలు పేర్కొంటున్నాయని.. దీని ప్రకారం వినేష్ ఫొగట్ ఫైనల్స్ ఆడలేకపోతున్నట్లు తెలిపారు. వినేష్ ఫొగట్కు ప్రభుత్వం అన్ని విధాల సహాయ, సహకారాలు అందిస్తోందన్నారు. తనకు క్రీడా సౌకర్యాలు కల్పించడంతో పాటు, అవసరమైన శిక్షణ ఇప్పించినట్లు కేంద్రమంత్రి ప్రకటించారు. పారిస్ ఒలంపిక్స్లో వినేష్ కోసం రూ.70,45,775 ఖర్చు చేసినట్లు తెలిపారు.

**విపక్షాల అసంతృప్తి..ఆగ్రహం:** కేంద్ర క్రీడల మంత్రి మన్సుఖ్ మాండవియా ప్రకటనపై విపక్షాలు అసంతృప్తి వ్యక్తం చేశాయి. కేంద్రప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగానే ఆమెపై అనర్హత వేటు పడిందని, తక్షణమే దీనిపై విచారణ చేయించాలని విపక్షాలు డిమాండ్ చేశాయి. కేంద్రమంత్రి ప్రకటనపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ విపక్షాలు లోక్సభ నుంచి వాకౌట్ చేశాయి.

# సీఎం రేవంత్ చేతుల మీదుగా సీతారామ ప్రాజెక్టు ప్రారంభోత్సవం

## ఉత్తమ్ కుమార్ రెడ్డి



తెలంగాణ బ్యూరో ప్రతినిధి: ఉమ్మడి ఖమ్మం జిల్లా రైతులు ఎన్నాళ్లుగానో ఎదురుచూస్తున్న సీతారామ ప్రాజెక్టు ప్రారంభోత్సవానికి ముహూర్తం ఖరారైంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఆగస్టు 15న ఈ ప్రాజెక్టును ప్రారంభించనున్నట్లు రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. బుధవారం మధ్యాహ్నం హైదరాబాద్లోని జలసౌధలో అధికారులతో కలిసి ఆయన నీటిపారుదల శాఖపై సమీక్ష నిర్వహించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెంలో నిర్మించిన సీతారామ ప్రాజెక్ట్ ను ఈ నెల 15న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నట్లు ఉత్తమ్ పేర్కొన్నారు. నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జ,సహాయ కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్, ఈఎన్సీలు అనిల్ కుమార్, నాగేందర్ రావు, డిప్యూటీ ఈఎన్సీ శ్రీనివాస్ తదితరులు ఈ సమీక్షలో పాల్గొన్నారు.

# ఖమ్మం, వరంగల్ రైల్వే అలైన్ మెంట్ మార్చండి

## దక్షిణమధ్య రైల్వే జి.ఎం.తో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటీ శ్రీనివాస్ రెడ్డి బేటీ



తెలంగాణ బ్యూరో, ప్రతినిధి : ఖమ్మం జిల్లా, వరంగల్ జిల్లా మీదుగా దక్షిణ మధ్య రైల్వే కొత్తగా ఏర్పాటు చేయనున్న రైలు మార్గాల్లోని అలైన్ మెంట్ లో మార్పులు చేయాలని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ కు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుదవారం రైల్ నిలయంలో జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ తో మంత్రి సమావేశం అయ్యారు. డోర్నకల్ నుంచి ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం నాయక్ గూడెం మీదుగా సూర్యాపేట జిల్లా మోతే నుండి గద్వాల్ వరకు ప్రతిపాదించిన నూతన రైల్వే మార్గం ఖమ్మం జిల్లాలోని తన నియోజకవర్గం పాలేరు లోని నాలుగు మండల మీదుగా ఈ రైల్వే మార్గం వెళ్తుందని దీనివల్ల సాగు భూమలను రైతులు కోల్పోవలసి వస్తుందని, దీనికి ప్రత్యామ్నాయంగా అలైన్ మెంట్ లో మార్పుచేసి మరో మార్గములో రైల్వేలైన్ ను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.అదేవిదంగా, కాకతీయ అర్బన్ డెవలప్ మెంట్ అథారిటి (కుడా) మాస్టర్ ప్లాన్ ను పరిగణలోకి తీసుకొని వరంగల్ నగర బైపాస్ రైల్వే లైన్ ను నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. వరంగల్ నగర అభివృద్ధికి తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకొని 2050 కి అనుగుణంగా మాస్టర్ ప్లాన్ ను సిద్ధం చేస్తున్నదని, ఈ నేపద్యంలో రైల్వే శాఖ నష్కల్ నుండి హసన్ పర్తి, నష్కల్ నుండి చింతలపల్లి వరకు కొత్తగా నిర్మించతలపెట్టిన రైల్వే మార్గాన్ని వరంగల్ మాస్టర్ ప్లాన్ కు అనుసందానం చేయాలని కోరారు. ప్రస్తుతం సిద్ధం చేసిన రైల్వే మార్గం వల్ల వరంగల్ మాస్టర్ ప్లాన్ దెబ్బతింటుందని, దీనిని దృష్టిలో పెట్టుకొని అలైన్ మెంట్ మార్చాలని జి.ఎం.కి విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశములో ఆర్.%ఉ%బి. శాఖ, ప్రత్యేక కార్యదర్శి, హరి చందన తదితరులు పాల్గొన్నారు.

# స్వాతంత్ర దినోత్సవం రోజున సీతారామ ప్రాజెక్టు ప్రారంభం

## మంత్రి తుమ్మల



తెలంగాణ బ్యూరో ప్రతినిధి: స్వాతంత్ర్యదినోత్సవంన గోల్కొండ కోటలో సీఎం రేవంత్ జెండా ఎగరేశాక హెలికాప్టర్ ద్వారా నేరుగా ఖమ్మం జిల్లా వైరాకు ముఖ్యమంత్రి చేరుకుంటారని ఉత్తమ్ తెలిపారు. అక్కడే భోజనాలు చేసి వైరాలో జరగనున్న భారీ బహిరంగ సభలో ఆయన పాల్గొంటారని అన్నారు. అంతకుముందే సీతారామ ప్రాజెక్టు పంపుహౌస్లను రేవంత్ ప్రారంభిస్తారని చెప్పారు. కార్యక్రమ పర్యవేక్షణకు ప్రత్యేక అధికారిని నియమించనున్నట్లు చెప్పారు. ఉమ్మడి ఖమ్మం రైతుల కల త్వరలో నెరవేరబోతోందని ఆయన స్పష్టం చేశారు.

**లక్షల సంఖ్యలో రైతులతో సభ:** దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన ఆగస్టు 15న ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజల చిరకాల వాంఛను నెరవేరుస్తూ సీఎం రేవంత్రెడ్డి చేతులమీదుగా సీతారామ ప్రాజెక్టు పంపుహౌస్లను జాతికి అంకితం చేస్తామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రకటించారు. ఈ సందర్భంగా వైరాలో లక్ష మంది రైతులతో బహిరంగ నిర్వహిస్తామని తెలిపారు. సభా స్థలాన్ని ఖమ్మం కలెక్టర్ ముజ్మమిలా?న్, ఖమ్మం సీపీ సునీల్దత్ తదితరులతో కలిసి ఆయన ఇటీవల పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. నాగార్జున సాగర్ ప్రాజెక్టు చరిత్రలోనే తొలిసారిగా ఆగస్టు 5న సాగర్ జలాలను విడుదల చేసిన చరిత్ర కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఒకవైపు కృష్ణా జలాలు, మరోవైపు గోదావరి జలాలు వైరా రిజర్వాయర్ సహా ఖమ్మం జిల్లాలో ఆగస్టు 15 నాటికి ప్రవహించనున్నాయని తెలిపారు. అలాగే రైతు రుణమాఫీకి సంబంధించి కూడా సీఎం రేవంత్రెడ్డి వైరా సభలో స్పష్టమైన ప్రకటన చేస్తారని చెప్పారు. ఆగస్టు 15న రైతు దినోత్సవంగా జరుపుకోబోతున్నామని వెల్లడించారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సొంత ప్రాంతంలో సీఎం బహిరంగ సభ నిర్వహించేందుకు ఆయన కూడా ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారని తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు.

# ఉపకులాల మధ్య సమానత్వం తీసుకురావాలి

- కమిటీ వేసుకొని సిఎం రేవంత్ రెడ్డికి రిప్రజెంటిషన్ ఇస్తాం
- రేవంత్ రెడ్డి వర్గీకరణకు సానుకూలంగా ఉన్నారు
- రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ



తెలంగాణ బ్యూరో ప్రతినిధి : ఇటీవల సుప్రీంకోర్టు ఎస్సీ రిజర్వేషన్ల ను రాష్టాలు వర్గీకరించు కోవచ్చు అనే తీర్పు ఇచ్చిన నేపథ్యం లో మాదిగ ఉపకులాల సమావేశం, హైదరాబాద్ లోని బేగంపేట ప్లాజా హొటల్లో బుధవారం మంత్రి దామోదర రాజనర్సింహ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిధిగా దామోదర రాజ నరసింహ,ఎమ్మెల్యేలు అద్లూరి లక్ష్మీనారాయణ, కవ్వంపల్లి సత్యనారాయణ, మందుల శామ్యూల్, వేముల వీరేశం, కాలే యాదయ్య, ప్రొ.జి. మల్లేశం, లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ, మాదిగ మాదిగ ఉపకులాలకు విద్య ఉద్యోగాల్లో వారి జనాభా ప్రకారం సమాన అవకాశాలు రావలన్నారు. కులాలు ఉపకులలు అని కాకుండా సమానత్వం అనేది సాధించాలన్నారు. సుప్రీంకోర్టు కోర్టు వర్గీకరణ విషయంలో రాష్ట్రాలు అమలు చేసుకోవచ్చని స్వాతంత్ర్య ఇచ్చింది తప్ప అమలు చేయాలని ఆదేశించలేదు. సుప్రీం తీర్పు నేపథ్యం లో ఇద్దరు ముగ్గురు లాయర్లు, ప్రజాప్రతినిధులు సంఘాల నాయకులు, ప్రొఫెసర్లతో ఒక కమిటీ వేసుకొని ముందుకులోవాలన్నారు.అంతేకాకుండా గతంలో జరిగిన వర్గీకరణ ఇప్పుడున్న తెలంగాణ కు వారిస్తుందా లేదా అని ఆలోచించాలన్నారు. కుల గణన చేయడం జాతికి నాయకత్వం వహిస్తున్న వారితో కమిటీ వేసుకొని మేదోమదనం చేసిన తరువత వచ్చిన సారాంశాన్ని ముఖ్యమంత్రి కి రిప్రజెంటిషన్ ఇవ్వాలన్నారు. అన్ని కులాల సామాజిక, ఆర్థిక , స్థితిగతులను తెలుసుకోవాలన్నారు. ముఖ్యమంత్రి వర్గీకరణ విషయంలో సానుములంగా ఉన్నారు. విద్య, ఉద్యోగాల ద్వారా కేవలం 15 శాతం మందికే అవకాశాలు దక్కుతాయని మరి మిగతా వారు ఆర్థికంగా అభివృద్ధి చెందుటకు ప్రభుత్వమే యాభై శాతం సబ్సిడీలతో లోన్లు కూడా ఇచ్చేవిధంగా చూస్తామన్నారు. ప్రతి మనిషి సిద్ధాంతపరులం కావాలి సంస్కారవతులం అవ్వాలి అప్పుడే జాతి బాగుపడుతుంది అన్నారు. ఈ కార్యక్రమంలో మెడి పాపయ్య మాదిగ, కొండ్రు మల్లయ్య, తురుపాటి హన్మంతు, చంద్ర మౌళి, కార్న్ కంటి రాములమ్మ, రోహిదాస్ వాగజేమేరే, వేల్పుల సంజయ్, కొత్తపల్లి తిరుపతి,పులిగంటి వేణుగోపాల్, పెంట కృష, చేరుకూరి రాజు తదితరులు పాల్గొన్నారు.





సూర్య
విజయవాడ
గురువారం
8 ఆగస్టు 2024
7



# ఉత్తమ్ కుమార్ రెడ్డి చైర్మన్‌గా కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు

● సభ్యులుగా మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, జూపల్లి కృష్ణారావు ● తెలంగాణలోని రిజర్వాయర్ల నిల్వ సామర్థ్యపు పునరుద్ధరణ కోసం మంత్రులతో కమిటీ

తెలంగాణ బ్యూరో(ప్రతినిధి: నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చైర్మన్ గా కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు చేసింది ప్రభుత్వం. కేంద్ర జల శక్తి మంత్రిత్వ శాఖ, జల వనరులు, నది అభివృద్ధి , గంగా వునరుజ్జీవన శాఖ, జాతీయ ఫ్రేమ్వర్క్లు స్వీకరించడం మంత్రిత్వ శాఖ ద్వారా నిర్వహణ కోసం జాతీయ ఫ్రేమ్వర్క్ పై పద్ధతులు/మార్గ దర్శకాలను అధ్యయనం చేయడానికి, అలాగే సిఫార్సు చేయడానికి ప్రభుత్వం క్యాబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ నేపథ్యంలో తెలంగాణలోని రిజర్వాయర్ల నిల్వ సామర్థ్యపు వునరుద్ధరణ కోసం మంత్రులతో కమిటీ ఏర్పాటు చేయబడింది. ఈ కమిటీలో నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆహారం, పౌర సరఫరాల మంత్రి ఛైర్మన్ గా, తుమ్మల నాగేశ్వరరావు వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి, మరియు హ్యాండ్లూమ్స్ టెక్స్టైల్స్ మంత్రి సభ్యుడుగా., జూపల్లి కృష్ణారావు (ప్రొహిబిషన్, ఎక్సైజ్ మంత్రి ; టూరిజం, కల్చర్ మరియు ఆర్కియాలజీ మంత్రి సభ్యుడుగా ఎన్నికయ్యారు.

అలాగే ప్రభుత్వ కార్యదర్శి, శాఖపై క్యాబినెట్ సబ్ కమిటీకి సభ్యుడు/కన్వీనర్ గా ఉంటారు. ప్రభుత్వం ఈ క్యాబినెట్ సబ్ కమిటీని అధ్యయనం చేసి సిఫార్సులను సమర్పించాలి.

# అధికారం అనుభవించడానికి కాదు అది ఓ బాధ్యత

● మానవతావాదులు అదిలాబాద్ జిల్లా వాసులు ● ధరణిని బంగాళాఖాతంలో కలిపేస్తాం ● త్వరలోనే ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు పనులు మొదలు పెడతాం ● ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పథకాన్ని త్వరలో ప్రారంభిస్తాం



అదిలాబాద్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి, ఆగస్టు 07 , సూర్య మేజర్ న్యూస్ : అధికారం అనుభవించడానికి కాదు అది ఒక బాధ్యతగా కాంగ్రెస్ ప్రభుత్వం పరిపాలన సాగిస్తుందని ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క అన్నారు. బుధవారం పిప్పిరి గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని ఆయన మాట్లాడుతూ మానవతావాదులు అదిలాబాద్ జిల్లా వాసులు అని అన్నారు. పిప్పిరి గ్రామము నుండే ప్రజలు ఇచ్చిన ఆశీర్వాదంతో పాదయాత్రను ప్రారంభించి దిగ్విజయంగా పూర్తి చేయడం జరిగిందని ,దానికి ఈ గ్రామ ప్రజలు ఇచ్చిన ఆశీర్వాదం తోనే రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని అన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడూ కట్టుబడి ఉందని అన్నారు తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ధరణి పోర్టల్ ద్వారా అనేకమంది రైతులు ఇబ్బందులకు గురవుతున్నారని గుర్తించిన ప్రభుత్వం ధరణిని త్వరలోనే బంగాళాఖాతంలో కలిపేస్తామని అన్నారు. నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని త్వరలోనే ప్రారంభిస్తామని అన్నారు. రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం త్వరలోనే ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు పనులు మొదలుపెడతామని, జాబు క్యాలెండర్ను విడుదల చేస్తామని అన్నారు. గత పది ఏళ్లలో ఐటీడీఏలు నిర్వీర్యం అయ్యాయని, వాటి బలోపేతానికి బడ్జెట్లో 17 వేల కోట్లు కేటాయించామని అన్నారు.ఎస్సీ కార్పొరేషన్ను బలోపేతం చేసేందుకు 35 వేల కోట్లకు పైగా నిధులు కేటాయించామని, పాత పథకాలన్నింటినీ తిరిగి వునరుద్ధరిస్తామని అన్నారు. పాదయాత్రలో ప్రజల గుండెచప్పులను విన్నామని అన్నారు. అదిలాబాద్ జిల్లా ప్రజలను గుండెల్లో పెట్టుకొని చూసుకునే ప్రభుత్వం కాంగ్రెస్సేనని అన్నారు. అదిలాబాద్ జిల్లా సాగునీటి ప్రాజెక్టులకు బడ్జెట్లో 400 కోట్లు కేటాయించామని ఇందిరమ్మ రాజ్యంలో భూ పోరాటాల ద్వారా సంక్రమించిన పోడు భూములకు పట్టాలిస్తాం, చేతులు పట్టుకొని మీ భూములను దున్నిస్తాం, రుణాలు సైతం ఇస్తాం అని అన్నారు. అధికారం అనుభవించడానికి కాదని అన్నారు. పేద ప్రజల ప్రయాణ కష్టాలను తీర్చడానికి మహిళలకు ఉచిత బస్సు సౌకర్యాన్ని కల్పించడంతోపాటు, పెరిగిన వైద్య ఖర్చుల దృష్ట్యా ఆరోగ్యశ్రీ పరిమితిని 10 లక్షలకు పెంచామని అన్నారు. అధికారంలోకి వచ్చిన కొద్ది రోజులలోనే 500 కే గ్యాస్ సిలిండర్లు, 200 యూనిట్ల వరకు గృహజ్యోతి పథకం కింద ఉచిత విద్యుత్ వంటి హామీలను అమలు చేయడం జరిగిందని అన్నారు. నిరుపేదలకు గృహాలను కల్పించడం కోసం ప్రతి నియోజకవర్గంలో 3500 ఇందిరమ్మ ఇల్లు నిర్మించేందుకు ప్రణాళికలను సిద్ధం చేస్తున్నామని, 5 లక్షల రూపాయలతో డబుల్ బెడ్ రూమ్ ఇల్లు నిర్మిస్తాం అని, ఎస్సీ, ఎస్టీలకు అదనంగా లక్ష రూపాయలు జత చేసి ఇస్తామని అన్నారు. ఇది ప్రజల ప్రభుత్వమని, ప్రతి రూపాయి ప్రజలకు ఉపయోగపడేలా చేస్తాం కానీ దుబారా చేయడం జరగదని అన్నారు. నిరుద్యోగ యువతకు ఇచ్చిన మాట ప్రకారం అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే 30 వేల ఉద్యోగ నియామక పత్రాలు ఇవ్వడంతోపాటు మరో 30 వేల ఉద్యోగాల నియామక ప్రక్రియ చివరి దశకు చేరుకుందని త్వరలోనే వారికి నియామక పత్రాలు అందజేస్తామని అన్నారు. గ్రూప్ వన్, టు, త్రీ ,ఎలక్ట్రిసిటీ, సింగరేణిలో ఏడాది మొత్తం ఏ తేదీన ఏ పరీక్ష జరుగుతుందో ఇటీవల అసెంబ్లీలో జాబ్ క్యాలెండర్ను విడుదల చేశామని అన్నారు. ఆగిపోయిన తుమ్మిడి హెట్టి ప్రాజెక్టును తిరిగి వునరుద్ధరించి, అదిలాబాద్ జిల్లా ప్రజలకు నీళ్లు అందిస్తామని అన్నారు. గిరిజన యువతకు చదువు చెప్పించడం, నైపుణ్యం కల్పించడం, డ్వాక్రా సంఘాల ద్వారా ఆర్థిక అభివృద్ధిని సాధించేందుకు బడ్జెట్లో కేటాయింవులు చేయడం జరిగిందని అన్నారు. పాదయాత్ర సమయంలో ప్రజా యుద్ధ నౌక గద్దర్ అన్న ఆరోగ్యం సహకరించకపోయినప్పటికీ అదిలాబాదు నుండి ఖమ్మం వరకు జరిపిన పాదయాత్రలో మండుటెండలను సైతం లెక్కచేయకుండా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని కోరుకున్న వ్యక్తి ఈరోజు మన మధ్య లేకపోవడం విచారకరమని అన్నారు.ఆయన కోరుకున్న ఇందిరమ్మ రాజ్యం వచ్చిందని వారి ఆత్మకు శాంతి చేకూరాలని అన్నారు. గద్దర్ ఆలోచన విధానాన్ని మా ప్రభుత్వం ముందుకు తీసుకోవడానికి, అదిలాబాద్ జిల్లా ప్రజల్ని గుండెల్లో పెట్టుకొని చూసుకోవడానికి ఉందని మరోసారి గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో అదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్, బోత్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మా బొజ్జ ,మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు, అదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షిషా ,ఐ టి డి ఏ పీవో ఖుష్బూ గుప్త, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఇరిగేషన్ అధికారులపై మంత్రి తుమ్మల ఆగ్రహం



తెలంగాణ బ్యూరో(ప్రతినిధిః ఇరిగేషన్ అధికారులపై మంత్రి తుమ్మల నాగేశ్వరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. రామాలయం అన్నదాన సత్రం వద్ద వరద నీరు నిలవడంపై మండిపడ్డారు. మంత్రి ఆదేశాలను గోదావరి నది కరకట్ట స్లూయిజ్ లాక్లను ఎత్తి పట్టణంలోని వర్షపు నీటిని గోదావరిలోకి ఇరిగేషన్ అధికారులు విడుదల చేశారు. ఈ క్రమంలో ఉదయం నుంచి నీటిలో మునిగి వున్న రామాలయ ప్రాంతం వాసులకు ఉపశమనం కలిగినట్లైంది. కాగా.. గోదావరి నీటిమట్టం 33 అడుగులు ఉండటంతో లాక్లను అధికారులు ఎత్తివేశారు. మళ్లీ గోదావరి ప్రవాహం 36 అడుగులకు చేరితేనే లాకులను మూసివేయనున్నారు. కాగా.. భద్రాచలంలో ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురుస్తోంది. ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యంతో రామాలయం పరిసర ప్రాంతాల్లో వరద నీరు పోటెత్తింది. పట్టణంలోని వర్షపు నీరు డ్రైయినేజ్ నీరు మోటార్లతో ఎత్తిపోయక పోవడంతో వరద నీరు నిలిచిపోయింది. దేవస్థానం ఆలయం అన్నదాన సత్రంలోకి చేరిన వరద నీరు చేరింది. దీంతో అన్నదానం సత్రాన్ని మూసివేశారు. భక్తులకు పాకెట్ల ద్వారా అన్నదానానికి ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు. గోదావరి నది కరకట్ట స్లూయిజ్ల నుండి వర్షపు నీటిని పంప్ చెయ్యకపోవడంతో నీట మునిగిన రామాలయ ప్రాంతం నీట మునిగింది. విషయం తెలిసిన మంత్రి తుమ్మల.. అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో గోదావరి నది కరకట్ట స్లూయిజ్ లాక్లను ఎత్తి పట్టణంలోని వర్షపు నీటిని గోదావరిలోకి విడుదల చేయడంతో రామాలయ ప్రాంతం వాసులకు ఉపశమనం కలిగింది. మరోవైపు.. భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానానికి అనుబంధంగా ఉన్న శ్రీ కుసుమ హరినాథ్ బాబా మందిరంలో ఈశాన్య మండపానికి బీటలు వారాయి. భారీ వర్షాల కారణంగా ఈశాన్యం మండపం కూలడానికి సిద్ధంగా ఉంది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు మండప అడుగుభాగం పూర్తిగా దెబ్బతిన్నది. కింద భాగం పెచ్చులు ఊడి కింద పడటంతో తృటిలో భారీ ప్రమాదం తప్పింది. విషయం తెలిసిన వెంటనే జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అక్కడకు చేరుకుని సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మండపాన్ని పూర్తిగా తీసివేసి పరిస్థితి చక్కదిద్దాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. ఎటువంటి ప్రమాదం జరగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు జిల్లా కలెక్టర్ పాటిల్ ఆదేశాలు జారీ చేసింది.

# బీజేపీలో విలీనం ప్రసక్తే లేదు



తెలంగాణ బ్యూరో(ప్రతినిధి : బీజేపీలో బీఆర్ఎస్ విలీనం లేదు.. అలా తప్పుడు వార్తలు ప్రసారం చేసిన వారిపై న్యాయపరమైన చర్యలు తీసుకుంటాం అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హెచ్చరించారు. ఈ మేరకు కేటీఆర్ ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. బీఆర్ఎస్ పార్టీ పైన, విలీనం లాంటి ఎజెండా పూరిత దుష్ప్రచారం చేస్తున్న మీడియా సంస్థలు, వ్యక్తులు వెంటనే ప్రజలకి వివరణ ఇవ్వాలి. లేదంటే వారిపైన చట్టపరమైన చర్యలు తీసుకుంటాం అని కేటీఆర్ హెచ్చరించారు. 24 సంవత్సరాలుగా ఇలాంటి అనేక కుట్రలు, కుతంత్రాలు, కుట్రదారులను ఎదుర్కొన్న పార్టీ మాది. ఇవన్నీ దాటుకొని 24 ఏండ్ల పాటు నిబద్ధతతో, పట్టుదలతో అవిశ్రాంతంగా పోరాడి తెలంగాణ సాధించిన పార్టీ బీఆర్ఎస్. సాధించుకున్న తెలంగాణ సగర్వంగా నిలబెట్టుకొని, అభివృద్ధిలో అగ్రపథాన నిలిపాము అని కేటీఆర్ తెలిపారు. ఆత్మగౌరవం, అభివృద్ధిని పర్యాయపదాలుగా మార్చుకొని ఇతర రాష్ట్రాలకి ఆదర్శంగా ఉండేలా రాష్ట్రాన్ని తీర్చిదిద్దాము. కోట్లాది గొంతుకలు, హృదయాలు తెలంగాణ ఆత్మగౌరవం, తెలంగాణ గుర్తింపు కోసం పోరాడుతున్నాయి కాబట్టే ఇది సాధ్యమైంది. ఎప్పటిలానే బీఆర్ఎస్ పార్టీ తెలంగాణ ప్రజల కోసం నిలబడుతుంది.. పోరాడుతుంది. ఇప్పటికైనా అడ్డగోలు అసత్యాలను, దుష్ప్రచారాలను మానుకోవాలి. పడతాం, లేస్తాం, తెలంగాణ కోసమే పోరాడుతాం కానీ తలవంచం.. ఎన్నటికైనా ఎప్పటికైనా అని కేటీఆర్ తేల్చిచెప్పారు.

# భూ సమస్యలను పరిష్కరిస్తాం

● తిరుమలగిరి సాగర్ మండలాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక
● రాష్ట్ర రెవిన్యూ ప్రిన్సిపల్ కార్యదర్శి, భూ పరిపాలన ఛీఫ్ కమిషనర్ నవీన్ మిట్టల్



తిరుమలగిరి సాగర్ మేజర్ న్యూస్: నల్గొండ జిల్లా తిరుమలగిరి సాగర్ మండల లోని భూ సమస్యలను నూటికి నూరు శాతం పరిష్కరించి రాష్ట్రానికి మార్గదర్శంగా నిలిపేందుకు తిరుమలగిరి సాగర్ మండలాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేయడం జరిగిందని రాష్ట్ర రెవిన్యూ ప్రిన్సిపల్ కార్యద ర్శి, భూ పరిపాలన ఛీఫ్ కమీషనర్ నవీన్ మిట్టల్ అన్నారు. బుధవారం ఆయన తిరుమలగిరి సాగర్ మండలం చింతలపాలెం గ్రామంలో భూసమస్యల పరిష్కారం నిమిత్తం రైతులతో ఏర్పాటు చేసిన గ్రామసభకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నవీన్ మిట్టల్ మాట్లాడుతూ భూములను సంబంధించిన సమస్యలన్నిటికీ పరిష్కారం తీసుకువచ్చేందుకు గాను ప్రభుత్వం కృషి చేస్తున్నదని చెప్పారు. ఇందులో భాగంగా ప్రస్తుతం ఉన్న భూయాజమాన్య హక్కు చట్టంలో (ఆర్ ఓ ఆర్) కొన్ని సాదాబైనామా, విరాసత్ వంటి సమస్యలు తీర్చడానికి నిబంధనలు లేనందున ఈ సమస్యల పరిష్కారం నిమిత్తమైన కొత్త చట్టాన్ని తీసుకురావాల్సిన అవసరాన్ని ప్రభుత్వం గుర్తించినట్లు తెలిపారు. ఈ క్రమంలో రెవిన్యూ చట్టంలో పారదర్శకత తీసుకువచ్చేందుకుగాను, కొత్తం చట్టం తేవాలన్న ఉద్దేశంతో ముసాయిదా చట్టాన్ని రూపొందించడం జరిగిందని తెలిపారు. తిరుమలగిరి సాగర్ మండలాన్ని భూ సమస్యల పరిష్కారంలో పైలట్ మండలంగా తీసుకునే విషయమై రాష్ట్ర ముఖ్యమంత్రి స్థాయిలో చర్చించిన అనంతరం రాష్ట్ర రెవిన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి రాష్ట్ర శాసనసభలో ప్రకటన చేయడం జరిగిందని ఆయన చెప్పారు. ప్రస్తుతం ఉన్న చట్టంలో కొన్ని సమస్యలను పరిష్కరించేందుకు అవకాశం లేదని, వీటిని దృష్టిలో ఉంచుకొని నూతన చట్టం తీసుకురావాలని ప్రతిపాదించి దాన్ని రాష్ట్రవ్యాప్తంగా రైతులు, ప్రజల్లోకి తీసుకెళ్లి సూచనలు, సలహాలతో తీసుకోవడం జరుగుతున్నదని చెప్పారు. రానున్న నూతన చట్టం తప్పనిసరిగా దీర్ఘకాలం రైతులకు ఉపయోగపడుతుందన్న నమ్మకాన్ని ఆయన వెలిబుచ్చారు. తిరుమలగిరి సాగర్ మండలంలోని భూ సమస్యలను అన్నిటిపై అధ్యయనం చేసి ఒక్కో సమస్యను పరిష్కరిస్తామని ముఖ్యంగా ఫారెస్ట్, రెవిన్యూ సంబంధించిన సమస్యలు, అలాగే ఇతర సమస్యలన్నింటిని పరిష్కరిస్తామని తెలిపారు. తిరుమలగిరి సాగర్‌లోని సమస్యలు అన్నింటిని నూటికి నూరు శాతం పరిష్కరించేందుకు కృషి చేసి ఈ మండలాన్ని రాష్ట్రానికి మార్గదర్శకం చేసేలా కృషి చేస్తామన్నారు. జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి మాట్లాడుతూ ధరణి, భూమికి సంబంధించిన సమస్యలను పరిష్కరించే రైతులకు భూ సమస్యలు లేకుండా చేయాలన్న ఉద్దేశంతో తిరుమలగిరి సాగర్ మండలాన్ని పైలట్ ప్రాజెక్టు మండలంగా ఎంపిక చేసినట్లు తెలిపారు. భూ సమస్యల నిమిత్తం పైలట్ మండలానికి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ స్థాయి అధికారిని ఇంచార్జిగా నియమించి, ఐదు మండల బృందాలను, 10 మంది సర్వేలను నియమించామని, గత సోమవారం నుండి సర్వే నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. గ్రామ స్థాయిలో ఎలాంటి సమస్యలు ఉన్నాయో ప్రత్యక్షంగా తెలుసుకునే నిమిత్తం రాష్ట్ర రెవిన్యూ ప్రిన్సిపల్ సెక్రటరీ చింతలపాలెం గ్రామానికి వచ్చినట్లు ఆయన వెల్లడించారు. మండలంలో మొత్తం 14 రెవిన్యూ గ్రామాలు ఉన్నాయని, కృష్ణనది తీర ప్రాంతంలో అటవీ, ప్రభుత్వ పట్టాభూములు, ఉన్నాయని, అయితే ఈ భూములలో కొంతమందికి పట్టాలు లేకపోవడం, కొంతమందికి పట్టాలు ఉన్నా భూమి లేకపోవడం వంటి సమస్యలతో ఉన్నారని తెలిపారు. మొత్తం మండలంలో 11246 ఎకరాల విస్తీర్ణంలో భూములు ఉన్నాయని, ఇందులో 1260 ఎకరాల అటవీ భవనములు ఉన్నాయని, 3931 ఎకరాలు మాత్రం ధరణీలో వచ్చిందని, ఇంకా సుమారు 7 వే ల ఎకరాల ధరణీలోకి రావాల్సిన అవసరం ఉందని అన్నారు. వివిధ భూ సమస్యలన్నీ మండలంలోని 7 గ్రామాలలో ఎక్కువగా ఉన్న దృష్ట్యా దీని ఆధారంగా తిరుమలగిరి సాగర్‌మండలాన్ని పైలట్ ప్రాజెక్ట్ కింద ఎంపిక చేసినట్లు చెప్పారు. ప్రత్యేకించి చింతలపాలెం గ్రామంలో సుమారు 6000 ఎకరాలకు పట్టాలు ఇవ్వాల్సిన అవసరం ఉందని అలాగే పట్టాలు ఇచ్చిన 3900 ఎకరాలలో ఉన్న బోగస్ పట్టాలను తొలగించాల్సిన అవసరం ఉందని తెలిపారు. సీసీఎల్ కార్యాలయ అధికారి లచ్చిరెడ్డి మాట్లాడుతూ గ్రామంలో సమస్యలు తెలుసుకునేందుకు రెవిన్యూ తరుపున తప్పనిసరిగా ఒక ఉద్యోగిని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. భూ సమస్యలకు ఏదో రకంగా పరిష్కారం తెలుసుకునేందుకు కృషి చేస్తున్నామని అందులో భాగంగానే తిరుమలగిరి సాగర్ మండలం చింతలపాలెం గ్రామానికి వచ్చినట్లు ఆయన వెల్లడించారు. ధరణీ కమిటీ సభ్యులు, ప్రముఖ న్యాయవాది భూమి సునీల్ మాట్లాడుతూ భూములకు సంబంధించి ప్రస్తుతం ఉన్న చట్టంలో కొన్ని సమస్యల పరిష్కారానికి మార్గం లేనందున కొత్త చట్టం తీసుకువచ్చే ఆలోచనలో ప్రభుత్వం కృషి చేస్తున్నదని తెలిపారు. ఈ సందర్భంగా రైతులు ఎంపీటీసీ కాశయ్య మాట్లాడుతూ భూ సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర స్థాయి అధికారుల బృందం తమ గ్రామానికి రావడం సంతోషంగా ఉందని, తాము ఎన్నో ఏళ్ల నుండి పోరంబోకు భూములు సాగు చేసుకుంటున్నామని అయితే తమకు ఎలాంటి పట్టాలు లేవు. రెండేళ్ల కింద సర్వే నిర్వహించినప్పటికీ పట్టాలు రాలేదని తెలిపారు. భూమీ ఖాళీ లేదని రెవిన్యూ అధికారులు చెపున్నారన్నారు. అందరూ ఎస్సీ, ఎస్టీ బీసీ వారే ఉన్నందున తమ సమస్యను పరిష్కరించి పట్టాలివ్వాలన్నారు. అదేవిధంగా నాయినాని తండాకు చెందిన ముని నాయక్ మాట్లాడుతూ వదలివేయబడిన భూములకు సంబంధించి తాము సాగు చేసుకుంటున్నాము. 5 దశాబ్దాల కాలంగా కబ్జాలో ఉన్నాము, కానీ పట్టాలు లేవు, ఎలాంటి రికార్డులు లేనందున రుణమాఫీ, రైతు భరోసా వంటివి రావటం లేదు వీటికి శాశ్వత పరిష్కారం చూపించాలని కోరారు.

# అధైర్యపడొద్దు

● సమస్యలను పోరాడి పరిష్కరించుకుందాం ● రైతులకు హరీశ్‌రావు సూచన



తెలంగాణ బ్యూరో(ప్రతినిధిః ఖమ్మం జిల్లాలో రైతులు ఆత్మహత్యలకు పాల్పడటం దురదృష్టకరమని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్రావు అన్నారు. ఖమ్మం రూరల్ మండలం జాన్పహాడ్ తండాకు చెందిన రైతు ఏలేటి వెంకట్రెడ్డి మృతి బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. వురుగుల మందు తాగి ఆత్మహత్య ప్రయత్నం చేసిన వెంకట్రెడ్డి మూడు రోజుల పాటు మృత్యువుతో పోరాడి మరణించడం ప్రజాపాలనపై రైతులు కోల్పోతున్న నమ్మకానికి నిదర్శనమని చెప్పారు. ఇటీవలే ఖమ్మం జిల్లాలోని చింతకాని మండలంలో జరిగిన రైతు ఆత్మహత్య ఘటన మరువక ముందే మరో రైతు మరణించడం శోచనీయమని హరీశ్రావు అన్నారు. రైతులు అధైర్యపడవద్దని.. ఏమైనా సమస్యలుంటే పోరాడి పరిష్కరించుకుందామని తెలిపారు. చావు సమస్య పరిష్కారానికి మార్గం కాదని అన్నారు.

# చేనేత వర్గాలకు మోడీ ప్రభుత్వం అండగా ఉంటుంది

● చేనేత వర్గాలను ఆదుకున్నది బిజెపి ప్రభుత్వమే ● చేనేత దినోత్సవాన్ని గుర్తించిన ప్రభుత్వానికి మనం అండగా ఉండాలి
● ఓయూ జెఏసి నాయకులు రాజు నేత ● స్వయంగా నరేంద్ర మోడీ తనకు ఫోన్ చేశారు కొడిపాక రమేష్



తెలంగాణ బ్యూరో ప్రతినిధి: దేశంలోని చేనేత వర్గాలకు నరేంద్ర మోడీ ప్రభుత్వం అండగా ఉంటుందని మాజీ ఎమ్మెల్సీ రామచంద్ర రావు అన్నారు. చేనేత వ్యవస్థాపక దినోత్సవ సందర్భంగా భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటుచేసిన చేనేత దినోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రామచంద్రరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో వ్యవసాయ వృత్తి తర్వాత చేనేత వృత్తి ప్రధానంగా ఉందని దేశానికి స్వతంత్రం సిద్ధించిన తర్వాత ఏ ప్రభుత్వం కూడా చేనేత వర్గాలను గుర్తించలేదని అన్నారు. చేనేత దినోత్సవాన్ని గుర్తించి ప్రకటించిన నేపథ్యం భారతీయ జనతా పార్టీ భారత ప్రధాని నరేంద్ర మోడీకే ఉంటుందన్నారు. చేనేత వర్గాలను ఆదుకోవడానికి భారత ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందని ఆ పథకాలను చేనేత వర్గాలు ఉపయోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమానికి భారతీయ జనతా పార్టీ రాష్ట్ర వివర్ సెల్ కన్వీనర్ మచ్చ సుధాకర్ రావు అధ్యక్షత వహించారు. భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి, దుగ్యాల ప్రదీప్ రావు, కాసం వెంకటేశ్వర్లు లు మాట్లాడుతూ చేనేత వర్గాలకు భారత ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలోనే న్యాయం జరిగిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. దేశంలో వ్యవసాయ వృత్తి తర్వాత చేనేత వృత్తి రెండవ స్థానంలో కొనసాగుతుందని అలాంటి వర్గాలకు న్యాయం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని దీనికోసం కేంద్ర ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర బిజెపి ఓబీసీ సెల్ అధ్యక్షుడు గంధం ఆనంద్ గౌడ్, ఓ బి సి సెల్ మాజీ అధ్యక్షుడు ఆలయ భాస్కర్ రాజ్, కార్పొరేటర్ భాగ్యలక్ష్మి, పావని, ఎన్నం శివకుమార్, కర్నాటి ధనుంజయ, జితేందర్, కొడిపాక రమేష్, అయిను గంటి రాజునేత, గర్దాసు శ్రీనివాస్ నేత, పెండెం లక్ష్మీనారాయణ, గౌరిటాల శ్రీలత, ఏనుల వినయ్, బల్ల శ్రీనివాస్, ఆహ్వాన కమిటీ సభ్యులు రంగుల శంకర్, కట్ల అశోక్ నేత, రచ్చ చక్రధర్, నామల శ్రీనివాస్ నేత, పాల్గొన్నారు.

**చేనేత దినోత్సవాన్ని గుర్తించింది మోడీ ప్రభుత్వమే :** దేశానికి స్వతంత్రం రావడం కంటే ముందు నుండి చేనేత వర్గాలు భారత స్వతంత్ర పోరాటంలో కీలకంగా భూమికి పోషించారని అలాంటిది స్వతంత్రం సిద్ధించిన తర్వాత కనీసం చేనేత వర్గాలను కాంగ్రెస్ ప్రభుత్వం గుర్తించలేదని చేనేత దినోత్సవాన్ని గుర్తించి చేనేత వర్గాలను గౌరవించి ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన భారత ప్రధాని నరేంద్ర మోడీకి అండగా ఉండాలని ఉస్మానియా యూనివర్సిటీ ఓయూ జేఏసీ నేత రాజు స్పష్టం చేశారు. భవిష్యత్తులో కూడా పద్మశాలి జాతి భారతీయ జనతా పార్టీ, నరేంద్ర మోడీకి అండగా ఉండాలని ఈ సందర్భంగా పిలువునిచ్చారు.

**ప్రధాని నాతో 11 సార్లు మాట్లాడారు :** భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తనతో 11 సార్లు మాట్లాడారని చేనేత వర్గానికి చెందిన పద్మశాలి ముద్దుబిడ్డ, ఉపాధ్యాయుడు కొడిపాక రమేష్ స్పష్టం చేశారు. హైదరాబాదులోని రాష్ట్ర బిజెపి కార్యాలయంలో నిర్వహించిన చేనేత దినోత్సవ కార్యక్రమంలో పాల్గొని ఆయన తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. తాను ఒక సామాన్య పౌరుడినని అలాంటి వాడితో భారత ప్రధాని ఏకంగా మాట్లాడడానికి కారణం ప్రధానమంత్రి నీతి నిజాయితీ ముఖ్యమని పేర్కొన్నారు. తన తండ్రి 1990 సంవత్సరంలో చనిపోయాడని తన తల్లి తమ కుటుంబాన్ని పోషించి ఐదుగురు కుమారులను నీతి నిజాయితీతో బతికే విధంగా తమ పోషణ చూసుకుందని ఇందులో భాగంగానే భారత ప్రధాని నరేంద్ర మోడీ తనతో మాట్లాడి పలుమార్లు ఢిల్లీకి పిలిపించుకొని తమ కుటుంబాలకు గౌరవం ఇచ్చారని గుర్తు చేశారు. సామాన్య మధ్యతరగతి చేనేత కుటుంబంలో వుట్టిన తన కుటుంబానికి గౌరవం ఇచ్చిన భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నీ జీవితంలో మర్చిపోలేనని ఈ సందర్భంగా తెలిపారు.

# చంద్రబాబు నాకు రాజకీయ గురువు



తెలంగాణ బ్యూరో(ప్రతినిధిః ఏపీలో వురాతన దేవాలయాలను, ఎండోమెంట్ భూములను కాపాడాలని ఈనెల 6న సీఎం చంద్రబాబు నాయుడుకు లేఖ రాశానని బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ తెలిపారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. లేఖపై ఏపీ సీఎంవో కార్యాలయం నుంచి తనకు ఇప్పటి వరకు ఎలాంటి రిప్లై రాలేదన్నారు. చంద్రబాబు నాయుడు తనకు రాజకీయ గురువన్నారు. గత వైఎస్ఆర్సీపీ హయాంలో ఏపీలో వేల ఎకరాల దేవాదాయ భూములు, ఆలయాలు అన్యాక్రాంతం అయ్యాయన్నారు. తాను రెగ్యులర్గా తిరుపతి , శ్రీశైలం వెళ్తానన్నారు. ఇప్పటికి శ్రీశైలంలో ఇతర మతస్తులు వ్యాపారం చేస్తున్నారని తెలిపారు. గతంలో శ్రీశైలం దేవస్థానానికి వూలు సరఫరా చేస్తున్న సమయంలో మద్యం, మాంసం దొరికిందన్నారు. దీనిపైన కేసులు అయ్యాయని అన్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నుంచి వచ్చిన సమాధానం ఆధారంగా తమ తదుపరి కార్యాచరణ ఉంటుందని తెలిపారు. తెలంగాణలో 90 వేల ఎకరాల ఎండోమెంట్ భూములు ఉన్నాయన్నారు. ఇందులో చాలా వరకు టీఆర్ఎస్ హయాంలో అక్రమాలకు గురయ్యాయని చెప్పారు. దీనిపైన రేవంత్ రెడ్డి ప్రభుత్వం విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. సీఎం అమెరికా పర్యటన నుంచి రాగానే దీనిపై లేఖ రాస్తానని తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో దేవాదాయ ధర్మాదాయ భూములు, వురాతన దేవాలయాల పరిరక్షణపై త్వరలో తమ కార్యాచరణ ఉంటుందని ఎమ్మెల్యే రాజాసింగ్ పేర్కొన్నారు.

# దద్దరిల్లిన దేశ రాజధాని

● బీసీలకు అన్యాయం జరుగుతోందని ఆగ్రహం ● వెంటనే తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్
● బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలి ● 70 కోట్లకు పైగా గల బీసీలకు బడ్జెట్లో రూ.3వేల కోట్లా..?
● వెంటనే బడ్జెట్లో బీసీలకు న్యాయమైన వాటా ఇవ్వాలి ● జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు, ఎంపీ ఆర్.కృష్ణయ్య



తెలంగాణ బ్యూరో(ప్రతినిధిః దేశ రాజధానిలో బీసీలు గర్జించారు. రాజ్యాధికారంలో వాటా ఇవ్వకుండా గత 75ఏళ్ల నుంచి పాలకులు అన్యాయం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలన్నారు. కేంద్రం – రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలలో బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలని కేంద్రంలో ఖాళీగా ఉన్న 16 లక్షల ఉద్యోగాలు భర్తీ చేయాలని పార్లమెంట్ లో బీసీ బిల్లు పెట్టాలని రాజ్యసభ సభ్యులు, బీసీ సంక్షేమ సంఘ అధ్యక్షులు ఆర్. కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఆంధ్ర భవన్ వద్ద బి.సి ఉద్యోగుల, బి.సి నాయకులు భారీ నిరసన చేపట్టారు. ఈ నిరసన కార్యక్రమానికి ఆర్. కృష్ణయ్యతో పాటు పలు పార్లమెంట్ సభ్యులు మద్దతు తెలిపారు. బీసీ ఉద్యోగులకు ప్రమోషన్ రిజర్వేషన్లు కల్పించడానికి పార్లమెంటులో రాజ్యాంగ సవరణ బిల్లు పెడతామన్నారు. ఈ నిరసనకు జాతీయ బి.సి సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులు గుజ్జ సత్యం, జాతీయ బి.సి యువజన సంఘం అధ్యక్షులు గువ్వల భరత్ కుమార్ అధ్యక్షత వహించారు. జాతీయ బి.సి సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ సమన్వయం చేశారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ బిసి ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు పెట్టడానికి చట్టపరమైన, రాజ్యాంగా పరమైన, న్యాయపరమైన అవరోధాలు, అడ్డంకులు ఏమీలేవు. గతంలో పాలించిన కేంద్ర ప్రభుత్వాలకు చిత్తశుద్ధి లేకపోవడం, బి సి వ్యతిరేక వైకరి అవలంబించడం మూలంగానే ప్రమోషన్లలో రిజర్వేషను పెట్టలేదు. రాజ్యాంగ బద్ధమైన మండల్ కమీషన్ బి సి ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు పెట్టాలని సిఫార్సు చేసింది. చట్టబద్ధమైన పార్లమెంటరీ కమిటీ ఛైర్మన్ నాచియప్పన్ కమిటీ బి సి ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు పెట్టాలని సిఫార్సు చేసింది. ఇక ఇటీవల సుప్రీంకోర్టు ఉత్తరప్రదేశ్ రిజర్వేషన్ల కేసు సందర్భంగా జనాభా ప్రకారం ఉద్యోగుల సంఖ్య లేకపోతే ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు పెట్టాలని తీర్పు చెప్పింది. అన్ని వైపుల నుంచి బిసి ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు పెట్టాలని సిఫార్సులున్నాయి. అయినప్పటికీ కేంద్ర ప్రభుత్వం అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. అన్నీ పార్టీలతో చర్చిస్తున్నాం. త్వరలోనే బి.సి లకు మంచి రోజులు వస్తాయున్నారు. ఆర్.కృష్ణయ్య ప్రసంగిస్తూ పార్లమెంట్ లో బీసీ బిల్లు పెట్టి 50 శాతం రిజర్వేషన్లు పెట్టాలని కోరారు. బీసీలకు ఇచ్చేది బిక్షం కాదు. ఇది రాజ్యాంగ బద్ధమైన ప్రజాస్వామ్య హక్కు స్వాతంత్రం వచ్చినప్పుడు బీసీలకు అసెంబ్లీ – పార్లమ్మెటుల్లో రిజర్వేషన్లు పెట్టకుండా అన్యాయం చేశారు. ఈ 75 సంవత్సరాలు బీసీలకు దక్కవాల్సిన రాజకీయ పధవులు ఉద్యోగాలు దక్కకుండ పోయాయి. ఉద్దేశవూర్వకంగా ఈ కులాలను అణిచివేస్తునారని విమర్శించారు. జనాభా ప్రకారం బీసీ రిజర్వేషన్లను కేంద్ర ప్రభుత్వం విద్యా, ఉద్యోగ రంగాలలో,స్థానిక సంస్థల ఎన్నికలలో , కేంద్రంలో 27 శాతం నుంచి 50శాతం పెంచాలని, చట్టసభలలో కూడా బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ పార్లమెంటులో బీసీ బిల్లు పెట్టాలని అలాగే బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలలో రిజర్వేషన్ కల్పించాలని రాజ్యసభ జాతీయ బీసీ సంఘం అధ్యక్షులు డిమాండ్ చేశారు. రిజర్వేషన్లపై విధించిన గరిష్ట పరిమితి 50 శాతంనూ సుప్రీం కోర్టు తొలగించినందున ఎలాంటి న్యాయపరమైన, రాజ్యాంగపరమైన అవరోధాలు లేనందున బిసి/ ఎస్సీ/ఎస్టీ రిజర్వేషన్లను జనాభా ప్రకారం పెంచాలని డిమాండ్ చేస్తున్నాం. ఇటీవల ఈడబ్లూఎస్ రిజర్వేషన్లు చెల్లుతాయని, 50% గరిష్ట పరిమితి కూడా సరికాదని సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. అలాగే 103వ రాజ్యాంగ సవరణ ద్వారా పార్లమెంట్ 50 శాతం గరిష్ట పరిమితి తొలగించి ఈడబ్లూఎస్ లకు 10 శాతం రిజర్వేషన్లు కల్పించారు. కేంద్ర స్థాయిలో 2 లక్షల కోట్ల బడ్జెట్ తో బి.సి సబ్ ప్లాన్ ఏర్పాటు చేయాలని, జనాభా లెక్కలలో బి.సి కులాల వారి లెక్కలు సేకరించాలని కోరారు.ఈ నిరసన కార్యక్రమానికి గోరేగే మల్లేష్, నీల వెంకటేష్, హనుమంత్ ముదిరాజ్, వేముల రామకృష్ణ, పద్మలత, వంశీ కృష్ణ, సతీశ్, సురేశ్, ఉదయ్, మురలి, కిరణ్, రాఘవేందశ్రీవ, మోడి రాందేవ్, జయంతి తదితరులు పాల్గొన్నారు.

# రైతుల పక్షాన పోరాటం చేస్తాం

● త్వరలోనే కార్యాచరణ ప్రకటిస్తాం ● బీఆర్ఎస్ నేత పెద్ది సుదర్శన్ రెడ్డి



తెలంగాణ బ్యూరో(ప్రతినిధిః కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న రైతు రుణమాఫీ నిర్ణయంలో లొసుగులు, కుట్రలు ఉన్నాయని ఉన్నాయని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి అన్నారు. రైతు రుణమాఫీ నిర్ణయం రైతుల పక్షాన కాకుండా ప్రభుత్వ పక్షాన ఉందని బీఆర్ఎస్ పార్టీ అనేకసార్లు చెప్పిందని పేర్కొన్నారు. అదే ఇప్పుడు ముమ్మాటికి నిజమైందని తెలిపారు. అర్హత ఉండి కూడా రుణమాఫీ వర్తించకుండా ఇబ్బంది పడుతున్న రైతుల నుంచి ఫిర్యాదులను స్వీకరించేందుకు ప్రత్యేకించి ఒక ఫోన్ నంబర్ ఇచ్చామని తెలిపారు. దీనివల్ల లక్షలాది మంది రైతులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆధార్ కార్డులో చిన్న చిన్న తప్పులు ఉన్నాయని రైతు రుణమాఫీ కావడం లేదని ఫిర్యాదులు అందాయని తెలిపారు. కొందరికి వీసా ఉందని రైతు రుణమాఫీని తిరస్కరిస్తున్నారని చెప్పారు. కొన్ని తండాల్లో అయితే భూ రికార్డులు సరిగ్గా లేవని రుణమాఫీ చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఊబీఆర్ఎస్ ఒత్తిడితో, దేవుళ్ల మీద ఒట్లు వేశానని సీఎం రేవంత్ రెడ్డి కేవలం తూతూ మంత్రంగా రుణమాఫీ చేశారని రేవంత్ రెడ్డి మండిపడ్డారు. రైతు పంట ఆధారంగా అందరికీ రుణమాఫీ చేయాలని బీఆర్ఎస్ పార్టీ డిమాండ్ చేస్తోందని అన్నారు. రైతు భరోసా ఎగ్గొట్టారని.. పంటలకు బోనస్ బోగస్ చేశారని ఆరోపించారు. రైతు భరోసా, బోనస్ డబ్బులు మిగుల్చుకుని ఆ డబ్బులను రుణమాఫీకి కేటాయించారని విమర్శించారు. బ్యాంకర్లకు లేని నిబంధనలు ప్రభుత్వానికి ఎందుకని ప్రశ్నించారు. కేసీఆర్ హయాంలో రైతులకు రైతుబంధు రూపంలో రూ. 72వేల కోట్లు, రైతు రుణమాఫీ రూపంలో మరో రూ. 30వేల కోట్లు అందించారని గుర్తు చేశారు. తెలంగాణ భవన్లో బీఆర్ఎస్ ఏర్పాటు చేసిన ఫిర్యాదు నంబర్లకు గంటకు దాదావు 900 ఫోన్ కాల్స్ వస్తున్నాయంటే రైతులు ఏవిధంగా సమస్యలు ఎదుర్కొంటున్నారో అర్థం చేసుకోవచ్చని పెద్ది సుదర్శన్ రెడ్డి అన్నారు.

# ఎస్బీఐ కొత్త ఛైర్మన్‌గా తెలుగు



### చల్లా శ్రీనివాసులు శెట్టిని సిఫారసు చేసిన ఎఫ్ఎస్ఐబీ
### సివిల్స్ రాకపోవడంతో బ్యాంకింగ్ రంగంలోకి
### 1988లో ఎస్బీఐలో ప్రొబేషనరీ ఆఫీసర్ గా చేరిక

దేశీయ దిగ్గజ ప్రభుత్వ రంగ బ్యాంక్ గా ఉన్న స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్బీఐ) ఛైర్మన్గా చల్లా శ్రీనివాసులు శెట్టి నియమితులయ్యారు. ఈయన నియామకానికి కేబినెట్ నియామకాల కమిటీ (ఏసీసీ) ఆమోదం తెలిపింది. ఈయన ప్రస్తుతం ఎస్బీఐ ఎండీగా ఉన్నారు. ఎస్బీఐ ఛైర్మన్ పోస్టుకి ఈయనను కేంద్ర పరిధిలో ఉండే స్వయంప్రతిపత్తి సంస్థ ఫైనాన్షియల్ సర్వీసెస్ ఇన్స్టిట్యూషన్స్ బ్యూరో (ఎఫ్ఎస్ఐబీ) కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేసింది. ఛైర్మన్ పోస్ట్ కోసం జూన్ 29న ముగ్గురిని ఇంటర్వ్యూ చేసింది ఎఫ్ఎస్ఐబీ ప్యానెల్. ఈ ముగ్గురిలో చల్లా శ్రీనివాసులని ఎంపిక చేసింది ప్యానెల్. ఆయనను ఎంపిక చేయడానికి గల కారణాలను కూడా వెల్లడించింది.

**ప్రతిభావంతులను ఎంపిక చేయడమే ప్యానెల్ పని**

ప్రభుత్వ యాజమాన్యంలో బ్యాంకులు సహా ఆర్థిక సంస్థల డైరెక్టర్ల కోసం ప్రతిభావంతులను ఎంపిక చేయడమే ఎఫ్ఎస్ఐబీ పని. అనుభవం, పని తీరుని బట్టి సరైన వ్యక్తులను కేంద్రానికి సిఫారసు చేస్తుంది. ఈ క్రమంలో ఎస్బీఐ నూతన ఛైర్మన్ గా అన్ని అర్హతలు కలిగిన వ్యక్తిగా చల్లా శ్రీనివాసులు శెట్టిని ఎంపిక చేసింది. పని తీరు, అనుభవం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని ఛైర్మన్ పదవికి ఆయనను సిఫారసు చేసింది. ప్రస్తుతం ఎస్బీఐ ఛైర్మన్ గా దినేష్ కుమార్ ఖరా ఉన్నారు. 2020 అక్టోబర్ 7న ఛైర్మన్ గా ఎంపికయ్యారు. ఆయన పదవీకాలం గత ఏడాదిలోనే ముగిసింది. గత ఏడాది అక్టోబర్ నెలలో పదవీకాలాన్ని పొడిగించింది. ఆయనకు 63 ఏళ్ళు వచ్చే వరకూ అంటే ఆగస్టు 28 వరకూ ఛైర్మన్ పదవిలో కొనసాగనున్నారు. ఈయన రిటైర్మెంట్ తర్వాత కొత్త ఛైర్మన్ గా చల్లా శ్రీనివాసులు శెట్టి బాధ్యతలు చేపట్టనున్నారు. అయితే ఎఫ్ఎస్ఐబీ ప్రతిపాదించినప్పటికీ ప్రధాని మోడీ నేతృత్వంలోని కేబినెట్ నియామకాల కమిటీ తుది నిర్ణయం తీసుకుంది.

**గద్వాలలో హైస్కూల్.. ఇంటర్**


శ్రీనివాసులు శెట్టి జన్మస్థలం జోగులాంబ గద్వాల జిల్లా (ఉమ్మడి మహబూబ్నగర్), మానవపాడు మండలం పెద్దపోతులపాడు గ్రామం. ఏడో తరగతి వరకూ సొంతూర్లోని ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యాభ్యాసం జరిగింది. ఇంటర్మీడియట్ వరకూ గద్వాలలో చదువుకున్నారు. అనంతరం హైదరాబాద్ రాజేంద్రనగర్లోని వ్యవసాయ విశ్వవిద్యాలయంలో బీఎస్సీ అగ్రికల్చర్ చదివారు. ఆ తర్వాత 1988లో ఎస్బీఐలో ప్రొబేషనరీ ఆఫీసర్గా విధుల్లో చేరారు. గుజరాత్, హైదరాబాద్, ముంబయితో పాటు న్యూయార్క్లోనూ పలు హోదాలలో పనిచేశారు. డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్, చీఫ్ జనరల్ మేనేజర్, జనరల్ మేనేజర్, డిప్యూటీ జనరల్ మేనేజర్గా పలు కీలక బాధ్యతలను నిర్వర్తించారు. బ్యాంకింగ్ రంగంలో 35 ఏళ్లకు పైగా అనుభవం ఉంది. అయితే ఈయన సివిల్స్ రాకపోవడంతో బ్యాంకింగ్ రంగంలోకి వచ్చానని గతంలో ఓ సందర్భంలో వెల్లడించారు. అలా వచ్చిన ఆయన ఈ ఫీల్డ్ లోనే నిలదొక్కుకుని అంచెలంచెలుగా ఎదుగుతూ ఇప్పుడు ఛైర్మన్ అయ్యే స్థాయికి వచ్చారు.

**మూడేళ్లపాటు పదవిలో..**

ఎస్బీఐ కొత్త ఛైర్మన్గా చల్లా శ్రీనివాసులు శెట్టి ఈ నెల 28వ తేదీన చల్లా శ్రీనివాసులు ఛైర్మన్గా బాధ్యతలు స్వీకరించనున్నారు. ఆయన నియామకానికి కేంద్ర ప్రభుత్వం మంగళవారం ఆమోదం తెలిపింది. ఈ మేరకు బాధ్యతలు అప్పగిస్తూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి మూడేళ్ల వరకు ఆయన ఈ పదవిలో కొనసాగుతారు. శ్రీనివాసులు శెట్టిని ఎస్బీఐ ఛైర్మన్గా నియమించాలని ఆర్థిక సేవల డిపార్ట్మెంట్ ప్రతిపాదించగా.. ఆ ప్రతిపాదనను అపాయింట్మెంట్స్ కమిటీ ఆఫ్ ది కేబినెట్ ఆమోదించింది. అలాగే, రాణా అశుతోష్ కుమార్ సింగ్ను బ్యాంక్ కొత్త ఎండీగా నియమించింది. చల్లా శ్రీనివాసులు శెట్టి ప్రస్తుతం ఎస్బీఐలో అంతర్జాతీయ బ్యాంకింగ్, గ్లోబల్ మార్కెట్స్, టెక్నాలజీ విభాగాల బాధ్యతలను చూసుకుంటున్నారు. 2020 జనవరిలో ఆయన ఎస్బీఐ ఎండీగా నియమితులయ్యారు. ప్రభుత్వ రంగ బ్యాంకులు, ఆర్థిక సంస్థల డైరెక్టర్లను ఎంపిక చేసే ఎఫ్ఎస్ఐబీ గతవారం సీఎస్ శెట్టి పేరును ఛైర్మన్ పదవికి సిఫారసు చేసింది.

# బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వాధినేతగా యూనస్

### పార్లమెంట్ రద్దు చేయాలని పట్టుపట్టి సాధించిన ఉద్యమకారులు
### ప్రభుత్వ సారథిగా యూనస్ పేరు సైతం వారి ప్రతిపాదనే
### పార్లమెంటు రద్దు చేసి ఎన్నికలకు లైన్ క్లియర్ చేసిన అధ్యక్షుడు
### ప్రధాన డిమాండ్లను నెరవేర్చే పనిలో అధ్యక్షుడు



రాజకీయ సంక్షోభం తలెత్తిన బంగ్లాదేశ్లో తాత్కాలిక ప్రభుత్వానికి మహమ్మద్ యూనస్ నేతృత్వం వహించనున్నారు. ఆయన నోబెల్ శాంతి పురస్కార గ్రహీత. ప్రధానిగా ఉన్న షేక్ హసీనా వైదొలగాల్సి రావడంతో అధ్యక్షుడు మొహమ్మద్ షహబుద్దీన్ మంగళవారం ఉదయం పార్లమెంటును రద్దు చేశారు. తొలుత తాత్కాలిక పరిపాలన యంత్రాంగం ఏర్పాటుకు, తర్వాత కొత్తగా ఎన్నికలు నిర్వహించడానికి మార్గం సుగమం చేశారు. యూనస్ను సారథిగా నియమిస్తున్నట్లు మంగళవారం అర్ధరాత్రి సమయంలో ఆయన ప్రకటన వెలువరించారు. యూనస్ 2012 నుంచి 2018 వరకు స్కాట్లాండ్లోని గ్లాస్గో కాలెడోనియన్ విశ్వవిద్యాలయానికి కులపతిగా ఉన్నారు. చిట్టగాంగ్ విశ్వవిద్యాలయంలో ఆర్థికశాస్త్ర ఆచార్యునిగా సేవలందించి, బంగ్లాదేశ్లోని పేదల అభ్యున్నతి కోసం కృషిచేశారు. చిట్టగాంగ్లో 1940లో జన్మించిన ఆయన ఓ సామాజిక కార్యకర్త, బ్యాంకర్, ఆర్థిక వేత్త. మైక్రోఫైనాన్స్ బ్యాంక్ ద్వారా లక్షల మంది ప్రజలను పేదరికం నుంచి బయటపడేసిన ఘనత సాధించారు. అందుకు 2006లో నోబెల్ శాంతి బహుమతి అందుకున్నారు. అనేక ప్రతిష్ఠాత్మక అవార్డులను పొందారు. పార్లమెంటును రద్దు చేయాలన్నది బంగ్లాదేశ్లో ఉద్యమకారుల ప్రధాన డిమాండ్. తాత్కాలిక ప్రభుత్వ సారథి పేరునూ వాళ్లే ప్రతిపాదించారు. సైనిక సర్కారును, సైన్యం మద్దతు ఉండే మరేదైనా సర్కారును అంగీకరించేది లేదని స్పష్టంచేశారు. హసీనా సర్కారుతో ఘర్షణపడినందుకు యూనస్పై కొన్ని డజన్ల కేసులు నమోదయ్యాయి. ఒక కేసులో ఆరు నెలల జైలుశిక్ష పడింది. తన దేశం, ప్రజల కోసం ఎలాంటి బాధ్యతలైనా తీసుకుంటానని యూనస్ చెప్పారు. దేశంలో స్వేచ్ఛాయుత ఎన్నికలు జరగాలని పిలుపునిచ్చారు. హసీనా వైదొలగడంతో దేశానికి రెండోసారి విముక్తి లభించిందని వ్యాఖ్యానించారు.

**సైన్యంలో భారీ మార్పులు.. అదుపులోకి మాజీ మంత్రులు :** బంగ్లాదేశ్ సైన్యంలో మేజర్ జనరల్గా ఉన్న జియావుల్ అహ్సన్పై వేటుపడింది. లెఫ్టినెంట్ జనరల్ మహమ్మద్ సైఫుల్ అలాంను విదేశాంగ మంత్రిత్వశాఖకు కేటాయించారు. మరికొందరు లెఫ్టినెంట్ జనరల్లనూ వారి స్థానాల నుంచి తప్పించారు. బంగ్లాదేశ్ను వీడి భారత్కు వెళ్లేందుకు ప్రయత్నించిన ఐటీశాఖ మాజీ మంత్రి జునైద్ అహ్మద్ పలక్ను, విదేశాంగ మాజీ మంత్రి హసన్ మహమూద్ను అధికారులు ఢాకా విమానాశ్రయంలో అదుపులోకి తీసుకున్నారు. సముద్ర మార్గం ద్వారా భారత్కు వెళ్లాలని కూడా తొలుత మహమూద్ విఫలయత్నం చేశారు. హసీనాకంటే ముందే పలువురు నేతలు దేశం వీడి వెళ్లినట్లు తెలుస్తోంది. హసీనాను, ఆమె సోదరిని అరెస్టు చేసి బంగ్లాదేశ్కు తిరిగి పంపాలని బంగ్లాదేశ్ సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మహబూబ్ ఉద్దీన్ ఖోఖోన్ భారత్ను కోరారు.

**పరిణామాలు నిశితంగా గమనిస్తున్నఅమెరికా, చైనా :** బంగ్లాదేశ్ పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనిస్తున్నట్లు అమెరికా, చైనా తెలిపాయి. తాత్కాలిక ప్రభుత్వ ఏర్పాటు సహా ప్రజాస్వామ్య పునరుద్ధరణకు వీలైనంత త్వరగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని బ్రిటన్ అభిప్రాయపడింది. బంగ్లాదేశ్ పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నామని ఐక్యరాజ్యసమితి తెలిపింది. శాంతియుతంగా ఆందోళన చేస్తున్నవారిపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని, నిరసన తెలిపే హక్కును కాపాడాలని పిలుపునిచ్చింది.

**ప్రార్థనామందిరాలపై దాడులు :** జషోర్ జిల్లాలో అవామీలీగ్ నేతకు చెందిన హోటల్కు అల్లరిమూకలు నిప్పుపెట్టిన ఘటనలో 8 మంది సజీవ దహనమైనట్లు తొలిరోజు వార్తలు వెలువడగా మంగళవారానికి ఈ సంఖ్య 24కి పెరిగింది. మూడు వారాల ఆందోళనల్లో ఇప్పటివరకు ప్రాణాలు కోల్పోయినవారి సంఖ్య 440కి చేరుకుంది. సోమవారం ఒక్కరోజే 109 మంది మృతిచెందారు. హిందువులు, ఇతర మైనారిటీల ప్రార్థన మందిరాలు, ఇళ్లు, దుకాణాలపై దాడులు జరుగుతున్నాయి. కనీసం ఇద్దరు హిందూ నేతలు ప్రాణాలు కోల్పోయారు. కోల్కతా–ఢాకా బస్సు సేవలు నిలిచిపోయాయి. భారత్–బంగ్లాదేశ్ మధ్య రైలు సేవల్ని నిరవధికంగా రద్దుచేశారు. విమానాలు పాక్షికంగా పునరుద్ధరణకు నోచుకున్నాయి. బంగ్లాదేశ్కు ప్రయాణాలు చేయవద్దని అమెరికా తమ పౌరుల్ని హెచ్చరించింది. కొన్నిరోజులుగా మూసివేసిన పాఠశాలలు, దుకాణాలు, కార్యాలయాలు మంగళవారం తెరచుకున్నాయి. ప్రజారవాణా వ్యవస్థ పనిచేస్తోంది. వీధుల్లో పోలీసులు, సైనికులు గస్తీ తిరుగుతున్నారు. మాజీ ప్రధాని, బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్పీ) అధిపతి ఖాలిదా జియా (79) గృహ నిర్బంధం నుంచి విడుదలయ్యారు. జులై ఒకటో తేదీ నుంచి వివిధ ఘటనల్లో అరెస్టైనవారిని విడుదల చేసే పని మొదలైంది.

**వెంటాడి.. వేటాడి ..హసీనా పార్టీ నేతల ఊచకోత :** బంగ్లాదేశ్లో విధ్వంస కాండ కొనసాగుతోంది. ఆర్మీ విశ్వప్రయత్నం చేస్తున్నా.. ఆందోళనకారుల దాడులు ఆగడం లేదు. ముఖ్యంగా మాజీ ప్రధాని షేక్ హసీనా అవామీ లీగ్ పార్టీ నేతలను వెంటాడి.. వేటాడి మరీ ఊచకోత కోస్తున్నారు. దేశ వ్యాప్తంగా ఆ పార్టీ నేతల మృతదేహాలు కనిపిస్తుండడం ఆందోళనకారుల హింసాకాండకు నిదర్శనం. స్థానిక మీడియా కథనాల ప్రకారం.. బంగ్లాదేశ్ వ్యాప్తంగా 29 మంది మృతదేహాలను గుర్తించారు. అందులో 20 అవామీ లీగ్ నేతలవేనని మీడియా వెల్లడించింది. సాతి రా ప్రాంతంలో 10 మంది, కొమిల్లాలో 11 మంది దాడుల్లో ప్రాణాలు కోల్పోయారు. అశోక్తలాలో ఒక మూక మాజీ కౌన్సిలర్ ఎండీ షా ఆలం ఇంటికి నిప్పుపెట్టిందని ప్రత్యక్ష సాక్షి వెల్లడించారు. దాంట్లో ఐదుగురు టీనేజర్లతో పాటు మొత్తం ఆరుగురు సజీవదహనమయ్యారు. నటోరె ప్రాంతంలో ఒక ఎంపీ ఇంటికి నిప్పుపెట్టారు. ఆ ఇంట్లోని పలు గదులు, బాల్కనీలు, పైభాగంలో తాజాగా మృతదేహాలు లభ్యమయ్యాయి. తీవ్ర ఆగ్రహంతో ఊగిపోయిన ఆందోళనకారులు అవామీ లీగ్తో సంబంధాలు ఉన్నవారిపై విరుచుకుపడ్డారు. వెంటాడి మరీ వారిని ఊచకోత కోశారు. మంగళవారం కూడా ఈ హింసాకాండ కొనసాగింది. ఈ ఘటనల్లో యువ నటుడు శాంతో, దర్శకుడైన అతడి తండ్రిని అతికిరాతకంగా చంపేశారు. నిరసనకారులు వీరిని చుట్టుముట్టి కర్రలతో కొట్టి చంపినట్లు స్థానిక పోలీసులు ధ్రువీకరించారు. ఈ నటుడు గతంలో హసీనా తండ్రి షేక్ ముజిబుర్ రెహమాన్ బయోపిక్లో నటించడం గమనార్హం. అలాగే బంగ్లాదేశీ జానపద గాయకుడు రాహుల్ ఆనందో నివాసానికి ఆందోళనకారులు నిప్పు పెట్టారు. నిరసనకారులు దాడి చేయగానే రాహుల్ కుటుంబం అక్కడినుంచి పారిపోవడంతో వారు ప్రాణాలతో బయటపడ్డారు. ప్రస్తుతం వారు రహస్య ప్రాంతంలో తలదాచుకున్నట్లు సమాచారం.





## పోరాడి ఓడిన టేబుల్ టెన్నిస్ జట్టు ఒలంపిక్స్ ముగిసిన భారత మహిళల పోరాటం

పారిస్: ఒలంపిక్స్ టేబుల్ టెన్నిస్ టీమ్ ఈవెంట్లో భారత్ పోరాటం ముగిసింది. ఇప్పటికే పురుషుల టీమ్ ప్రిక్వార్టర్స్లో నిష్క్రమించగా.. తాజాగా క్వార్టర్స్లో మహిళల జట్టు ఓడింది. క్వార్టర్స్లో భారత్పై 1-3 తేడాతో జర్మనీ విజయం సాధించింది. తొలుత డబుల్స్లో ఆకుల శ్రీజ, అర్చనా కామత్ 1-3 (5-11, 11-8, 10-12, 6-11)తో యువాన్, జియోనా చేతిలో ఓడింది. దీంతో జర్మనీ ఆధిక్యంలోకి వెళ్లింది. సింగిల్స్ తొలి మ్యాచ్లో మనికా బాత్రా 1-3 (11-8, 5-11, 7-11, 5-11)తో కౌఫ్మాన్ అన్నెట్ చేతిలో పరాజయం చవిచూసింది. మూడో మ్యాచ్లో అర్చనా కామత్ 3-1 (19-17, 1-11, 11-5, 11-9) అద్భుతంగా పోరాడి షాన్ జియోనాపై విజయం సాధించింది. నాలుగో మ్యాచ్లో శ్రీజ 0-3 (6-11, 7-11, 7-11) నిరాశపర్చడంతో భారత్ ఓటమిపాలైంది.


**ప్రిక్వార్టర్స్లో ఓడిన అంతిమ్**

మహిళల రెజ్లింగ్లో అంతిమ్ నిరాశపర్చింది. మహిళల 53 కేజీల ప్రిక్వార్టర్స్లో అంతిమ్పై 0-10 తో యెట్గిల్ (తుర్కియే) విజయం సాధించింది. అథ్లెటిక్స్ మహిళల జావెలిన్ త్రో క్వాలిఫికేషనల్లో భారత అథ్లెట్ అన్ను రాణి నిరాశపర్చింది. ఫైనల్కు అర్హత సాధించాలంటే జావెలిన్ను 62 మీటర్లు విసరాల్సి ఉండగా.. అన్ను రాణి తొలి ప్రయత్నంలో 55.91మీ, రెండో ప్రయత్నంలో 53.22మీ, మూడో ప్రయత్నంలో 53.55 మీటర్ల ప్రదర్శన చేసింది. ఓవరాల్గా తన గ్రూప్లో 15వ స్థానంలో నిలిచింది. పురుషుల హైజంప్ క్వాలిఫికేషన్లో సర్వేశ్ అనిల్ (2.15 మీ) నిరాశపర్చాడు. ఫైనల్కు వెళ్లాలంటే 2.29 మీటర్ల జంప్ చేయాలి.

# వినేశ్ ఫోగాట్‌పై అనర్హత వేటు


## స్పందించిన ప్రధాని మోడీ

● నువ్వు చాంపియన్లకే చాంపియన్ ● సవాళ్లను ఎదిరించడం నీకు తెలుసు
● ఆ క్రమంలో నీకు అండగా మేముంటాం : మోడీ



ఢిల్లీ: ఒలంపిక్స్లో ఫైనల్ చేరిన రెజ్లర్ వినేశ్ ఫోగాట్పై అనర్హత వేటు పడడంపై ప్రధాని నరేంద్ర మోడీ బుధవారం ఎక్స్ ఖాతా వేదికగా స్పందించారు. వినేశ్.. నువ్వు చాంపియన్లకే చాంపియన్. నీవు భారత్కే గర్వకారణం. అలాగే ప్రతీ భారతీయకుడికి నీవు స్ఫూర్తిదాయం. ఈ రోజు నీకు తగిలిన ఎదురు దెబ్బ తనను బాగా బాధిస్తుంది. దీనిని వ్యక్తం చేసేందుకు తన వద్ద మాటలు సైతం లేవు. ఈ బాధ నుంచి తిరిగి బయటకు రాగలవని ఆశిస్తున్నాను. సవాళ్లను ఎదిరించడం నీకు తెలుసు. ఆ క్రమంలో నీకు అండగా మేముంటామన్నారు. 50 కేజీల విభాగంలో వినేశ్ ఫోగట్ నిర్ణీత బరువు పెరిగారు.
ఉండాల్సిన బరువు కంటే 100 గ్రాములు పెరగడంతో వినేశ్పై అనర్హత వేటు పడింది.
ఈ మేరకు పారిస్ ఒలింపిక్ నిర్వాహకులు ప్రకటించారు. వినేశ్ ఫోగాట్పై అనర్హత వేటు పడటంతో క్రీడాభిమానులు భారీ షాక్కు గురయ్యారు. బంగారు పతకం సాధించడానికి కేవలం అడుగు దూరంలో ఉండగా ఇలా జరిగిందని సర్వత్ర ఆవేదన వ్యక్తమవుతోంది.

## వినేశ్ స్థానంలో ఫైనల్స్‌కు గుజ్మన్ లోపేజ్




పారిస్: ఒలంపిక్స్ మహిళల 50 కేజీల ఫ్రీస్టైల్ రెజ్లింగ్ ఫైనల్లో మన స్టార్ క్రీడాకారిణి వినేశ్పై అనర్హత వేటు పడింది. దీంతో అమెరికా క్రీడాకారిణి సారా హిల్డబ్రాంట్ స్వర్ణపతకం ఏమీ ఖాయం కాలేదు. ద్వితీయ స్థానంలో రజత పతకం ఎవరికి దక్కుతుందనే విషయం తేలలేదు. యూనైటెడ్ వరల్డ్ రెజ్లింగ్ ఫెడరేషన్ నిబంధనల ప్రకారం బరువు ప్రమాణాలను అందుకోని క్రీడాకారిణిపై అనర్హత వేటు వేస్తారు. అంతేకాదు.. ఆ పోటీల్లో చివరి ర్యాంక్ను ఇస్తారు. ఫైనల్స్ నుంచి బయటకు వెళ్లిపోయిన వినేశ్కు రజత పతకం ఇవ్వరు. అంతర్జాతీయ రెజ్లింగ్ నిబంధనల్లో ఆర్టికల్ 11 ప్రకారం.. క్వార్టర్ ఫైనల్లో వినేశ్ చేతిలో ఓడిపోయిన గుజ్మన్ లోపేజ్ (క్యూబా)కు అమెరికాకు చెందిన సారా హిల్డబ్రాంట్కు ఫైనల్స్ జరుగుతుంది. ఈ విషయాన్ని ఒలంపిక్ నిర్వాహకులు ప్రకటించారు. బుధవారం రాత్రి 11.23కు ఈ మ్యాచ్ మొదలు అవుతుందని షెడ్యూల్ ప్రకటించారు. కాంస్యపతక పోరులో జపాన్ క్రీడాకారిణి సుసాకీ, ఉక్రెయిన్కు చెందిన ఒక్సాన తలపడనున్నారు.

**అవగాహన లోపమా..?**

వినేశ్పై ఒలంపిక్స్ ఫైనల్లో అనర్హత వేటు పడటంతో భారత్ కనీసం ఒక పతకం కోల్పోయింది. దీనికి భారత అధికారుల అవగాహన లోపం ఉందనే కథనాలు వస్తున్నాయి. వినేశ్ బరువు ప్రమాణాలకు తగినట్లు లేదని తెలిసిన వెంటనే.. అనారోగ్య కారణాలను చూపి పోటీ నుంచి వైదొలగితే అమెరికా క్రీడాకారిణికి స్వర్ణపతకం దక్కేదని అవి పేర్కొంటున్నాయి. ఇక వినేశ్కు రన్నరప్ కింద రజతం అందేదన్నది వాటి సారాంశం. దీనిపై ఒలంపిక్ నిబంధనలు ఏం చెబుతున్నాయన్న దానిపై స్పష్టత లేదు. కానీ, ఇప్పుడు వినేశ్పై అనర్హత వేటు పడటంతో వరుస విజయాలు సాధించినా ఆమెకు ఏ పతకం లభించకుండా పోయిందని అభిమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


# ఒలంపిక్ అథ్లెట్ల విజయాల వెనుక ఉన్నదెవరు?




గగన్ నారంగ్, మేరీ కోమ్, సైనా నెహ్వాల్, పీవీ సింధు, మీరాబాయ్ చాను, లవ్లీనా బోర్గెయిన్.. వీళ్లంతా ఒలింపిక్స్లో మెడల్స్ సాధించిన వాళ్లే. ఒకప్పుడు ఇండియన్ అథ్లెట్లు ఒలంపిక్స్కు వెళ్లామా.. వచ్చామా అన్నట్లు ఉండేది. 1952 హెల్సింకీ ఒలంపిక్స్లో కేడీ జాదవ్ రెజ్లింగ్లో బ్రాంజ్ మెడల్ గెలిచాడు. ఆ తర్వాత 1996లో లియాండర్ పేస్ టెన్నిస్లో, 2000లో కరణం మల్లీశ్వరి వెయిట్ లిఫ్టింగ్లో బ్రాంజ్ గెలిచే వరకు మనకు వ్యక్తిగత పతకాలే రాలేదు. 2008లో అభినవ్ బింద్రా తొలి సారి వ్యక్తిగత గోల్డ్ మెడలిస్టా చరిత్ర సృష్టించాడు. 2004 ఏథెన్స్ ఒలంపిక్స్ వరకు ఇండియాకు వస్తే ఒకటి లేదంటే సున్నా.. అంతకు మించి పతకాలు గెలవడం గగనమే అయ్యేది. బీజింగ్లో మాత్రం తొలి సారి మూడు పతకాలు గెలిచింది. అభినవ్ బింద్రా షూటింగ్లో గోల్డ్ గెలవగా.. విజేందర్ సింగ్ బాకింగ్లో, సుశీల్ కుమార్ రెజ్లింగ్లో కాంస్య పతకాలు గెలిచారు.

**2012 నుంచి రాత ఎలా మారింది?**

2012 లండన్ ఒలంపిక్స్లో భారత అథ్లెట్లు ఆరు పతకాలు గెలిచారు. అంతకు ముందు ఏం జరిగింది? ఇండియాలో టాలెంట్ ఉన్నా.. ఎంకరేజ్ చేసే వాళ్లు తక్కువ. పేద, మధ్యతరగతి కుటుంబాల్లో పిల్లలను చదివించడమే భారం. ఇక వాళ్లకు క్రీడల్లో శిక్షణ ఎక్కడ ఇప్పించగలరు. మన దేశంలో క్రికెట్కు తప్ప వేరే క్రీడల వైపు వెళ్లినా.. స్పాన్సరర్లు అంత త్వరగా ముందుకు రారు. నువ్వు ఏదైనా అంతర్జాతీయ వేదిక మీద పతకం సాధిస్తే తప్ప క్రీడాకారుల వెంట పడరు. ఈ పరిస్థితిని గమనించిన భారత బిలియర్డ్స్ ప్లేయర్ గీత్ సేథీ, బ్యాడ్మింటన్ లెజెండ్ ప్రకాశ్ పదుకొనెలు ఒలింపిక్ గోల్డ్ క్వెస్ట్ (ఓజీక్యూ) అనే నాన్ ప్రాఫిట్ స్పోర్ట్స్ ఫౌండేషన్ను ప్రారంభించారు. భారత హాకీ జట్టు మాజీ కెప్టెన్ వీరేన్ రస్కీనా ప్రస్తుతం ఓజీక్యూకి ఎండీ అండ్ సీఈవోగా ఉన్నారు. 2010లో టెన్నిస్ ప్లేయర్ లియాండర్ పేస్, చెస్ గ్రాండ్ మాస్టర్ విశ్వనాథన్ ఆనంద్ ఈ ఒలింపిక్ గోల్డ్ క్వెస్ట్లో బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లుగా చేరారు.
మంచి టాలెంట్ ఉండి.. పతకం సాధించే సత్తా ఉన్న క్రీడాకారులకు అంతర్జాతీయ స్థాయి శిక్షణ ఇప్పించడమే ఈ ఓజీక్యూ ప్రధాన లక్ష్యం. నాణ్యమైన కోచ్లు, ఆహారం, కిట్లు ఈ సంస్థ క్రీడాకారులకు ఉచితంగానే అందించింది. విదేశీ కోచ్లను ఓజీక్యూ నిధులతో ఏర్పాటు చేసింది. ఓజీక్యూకు మొదటి నుంచి జమ్నాలాల్ బజాజ్ ఫౌండేషన్ తోడుగా ఉంది. 2012 ఒలింపిక్స్ టార్గెట్గా అనేక మంది క్రీడాకారులకు అంతర్జాతీయ స్థాయి శిక్షణను ఇప్పించింది. ఈ క్రమంలో విజయ్ కుమార్ (షూటింగ్), గగన్ నారంగ్ (షూటింగ్), సైనా నెహ్వాల్ (బ్యాడ్మింటన్), మేరీ కోమ్ (బాక్సింగ్) పతకాలు గెలిచారు. లండన్ ఒలింపిక్స్లో 6 పతకాలు రాగా.. అందులో నాలుగు పతకాలు ఒలింపిక్ గోల్డ్ క్వెస్ట్ ద్వారా శిక్షణ పొందిన వారే గెలవడం గమనార్హం.






2016 రియో ఒలింపిక్స్లో పీవీ సింధు సిల్వర్ గెలవడం వెనుక కూడా ఓజీక్యూ సంస్థ ఉన్నది. సింధుకు అవసరమైన తోడ్పాటును ఓజీక్యూ అందించింది. టోక్యో ఒలింపిక్స్లో పతకాలు సాధించిన మీరాబాయ్ చాను, రవికుమార్ దహియా, పీవీ సింధు, లవ్లీనా బోర్గెయిన్ వెనుక ఉన్నది కూడా ఓజీక్యూనే. ఇండియాలో సాయ్ (స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా), ఐవోఏ (ఇండియన్ ఒలింపిక్ అసోసియేషన్) ఉన్నా.. అవి ప్రత్యేకంగా ఒక క్రీడాకారుడిపై కోట్లాది రూపాయలు వెచ్చించవు. పైగా అక్కడ ఉండే రాజకీయాలు అందరికీ తెలిసిందే. ఇలాంటి సమయంలోనే ఓజీక్యూ తెరపైకి రావడం.. సత్తా చాటే అవకాశం ఉన్న క్రీడాకారులను గుర్తించి వారికి అంతర్జాతీయ స్థాయి శిక్షణను ఇప్పించడంతో భారత్ పతకాల వేట షూరు అయ్యింది. కేవలం సాధారణ క్రీడాకారులకే కాకుండా పారాలింపిక్స్లో పాల్గొనే వారికి కూడా ఓజీక్యూ అండగా నిలుస్తోంది. టోక్యో పారాలింపిక్స్లో భారత్ తరవున ఒక గోల్డ్, ఏడు సిల్వర్, రెండు బ్రాంజ్ పతకాలను పారాలింపియన్స్ గెలవడం వెనుక ఓజీక్యూనే ఉన్నది.

**వినేశ్ ఫోగట్కు అండగా..**

భారత రెజ్లర్ వినేశ్ ఫోగట్ ప్యారీస్ ఒలింపిక్స్లో ఫైనల్కు చేరుకున్నది. స్వర్ణం లేదా రజతం పక్కా గెలిచే అవకాశాలు ఉన్నాయి.
రెజ్లింగ్లో ఫైనల్స్కు చేరిన తొలి క్రీడాకారిణిగా వినేశ్ రికార్డు సృష్టించింది. అయితే ఐదేళ్ల నుంచి వినేశ్ ఫోగట్కు అన్ని రకాలుగా ఓజీక్యూ అండగా ఉన్నది. 2018లో వినేశ్ కోసం హంగేరియన్ కోచ్ వోలర్ అకోస్ను నియమించింది. టెక్నికల్ కోచ్గా వోలర్కు అత్యంత అనుభవం ఉన్నది. అతని భార్య కూడా రెజ్లరే. రెండు సార్లు ఆమె హంగేరీ తరవున ఒలింపిక్స్లో పాల్గొన్నది. 2018 నుంచి వినేశ్కు పర్సనల్ కోచ్గా వ్యవహరిస్తున్నాడు. అతని ఖర్చు మొత్తం ఓజీక్యూ భరించింది. టోక్యో ఒలింపిక్స్లో వినేశ్ విఫలం అవడంతో ఇదే కోచ్పై రెజ్లింగ్ ఫెడరేషన్ అధ్యక్షుడు బ్రిజ్ భూషన్ సింగ్ తీవ్రమైన విమర్శలు చేశాడు. వినేశ్కు వోలర్ సరిగా కోచింగ్ ఇవ్వలేదని.. అతడు కోచ్గా పనికి రాడని మీడియా ముందు నోరు పారేసుకున్నాడు. అయినా సరే వినేశ్ కోరిక మేరకు ఓజీక్యూ అతడినే కోచ్గా కంటిన్యూ చేసింది. హంగేరి, బెంగళూరు, మొహాలీ తదితర ప్రాంతాల్లో వినేశ్ కోచింగ్ సాగింది. గత ఏడాది రెజ్లర్ల నిరసనల ఫలితంగా చాలా కాలం కోచింగ్కు దూరంగా ఉన్నది.
అయినా సరే కోచ్ వోలర్ ఆమెకు వెన్నంటి ఉన్నాడు. నిన్న రాత్రి సెమీస్లో వినేశ్ గెలవడానే వోలర్ ఒక్కసారిగా కంటతడి పెట్టాడు. ఆరేళ్లు ఆయన పడని మాట లేదు.. అతడిని తిట్టని రెజ్లింగ్ ఫెడరేషన్ సభ్యుడు లేడు. కానీ వినేశ్, ఓజీక్యూ పెట్టుకున్న నమ్మకాన్ని వోలర్ వమ్ము చేయలేదు.

**రాహుల్ ద్రవిడ్ పాత్ర ఏంటి?**

మన క్రీడాకారుల కోసం విదేశీ కోచ్లను తీసుకొని రాగలం.. కానీ అంతర్జాతీయ స్థాయి సౌకర్యాలు ఉన్న స్పోర్ట్స్ సెంటర్లను ప్రభుత్వమే నిర్మించాలి. క్రికెట్ స్టేడియంలను అడిగితే వెంటనే స్థలాలు ఇచ్చే ప్రభుత్వాలు.. ఇతరులు ఎవరైనా స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మిస్తామంటే వెంటనే ఒప్పుకోదు. ఈ క్రమంలో కర్ణాటకా రాష్ట్ర బ్యాడ్మింటన్ చాంపియన్ వివేక్ కుమార్ ఒక అంతర్జాతీయ స్థాయి స్పోర్ట్స్ సెంటర్ నిర్మించాలని భావించారు. గతంలో ఆయనకు ప్రకాశ్ పదుకునే బ్యాడ్మింటన్ అకాడమీ ఏర్పాటులో అనుభవం ఉంది. దీంతో క్రికెట్ దిగ్గజం రాహుల్ ద్రవిడ్, బ్యాడ్మింటన్ లెజెండ్ ప్రకాశ్ పదుకొనె సహకారంతో బెంగళూరులో 16 ఎకరాల విస్తీర్ణంలో పదుకొనె-ద్రవిడ్ సెంటర్ ఆఫ్ స్పోర్ట్స్ ఎక్సెలెన్స్ (పీడీసీఎస్ఈ)ని 2017లో ఏర్పాటు చేశారు. అంతర్జాతీయ స్థాయి క్రీడా సౌకర్యాలు ఈ సీఎస్ఈలో ఉన్నాయి. ఫిఫా ప్రమాణాలతో నిర్మించిన ఫుట్బాల్ గ్రౌండ్, ఐసీసీ ఆమోదించిన క్రికెట్ గ్రౌండ్, స్విమ్మింగ్ పూల్, బ్యాడ్మింటన్ ఇండోర్ స్టేడియం, ఇతర క్రీడల కోసం ప్రత్యేక నిర్మాణాలు ఇందులో ఉన్నాయి.
ఓజీక్యూ ప్రతిపాదించిన క్రీడాకారులతో పాటు ఇతర టాలెంటెడ్ అథ్లెట్లకు ఇక్కడ శిక్షణ ఇస్తున్నారు. అభినవ్ బింద్రా నేతృత్వంలో స్పోర్ట్స్ సైన్స్ సెంటర్ కూడా ఉన్నది. క్రీడాకారులకు కేవలం శిక్షణ మాత్రమే కాకుండా మెంటల్ హెల్త్, స్పోర్ట్స్ సైన్స్ వంటి ఇతర విభాగాల్లో కూడా పూర్తి స్థాయి శిక్షణ ఇస్తారు. పదుకొనె, రాహుల్ ద్రవిడ్ ఈ సెంటర్ కోసం ఎంతో కృషి చేస్తున్నారు. వినేశ్ ఫోగట్, లక్ష్య సేన్లు ఒలింపిక్స్ కోసం ఇక్కడే సన్నద్ధం అయ్యారు.
అంతే కాకుండా అనేక మంది ఔత్సాహిక క్రీడాకారులు ఇక్కడ శిక్షణ పొందుతున్నారు. ప్రభుత్వాలు చేయాల్సిన పనిని కొందరు మాజీ ఒలింపియన్లు, క్రీడాకారులు చేస్తుండటం గమనార్హం. వివిధ కార్పొరేట్ కంపెనీల నుంచి నిధులు సమకూర్చుకొని ఒలింపిక్స్లో పతకాలు గెలిచేలా క్రీడాకారులను తయారు చేస్తున్నారు. క్రికెట్లో పెట్టుబడి పెడితే కోట్లాది రూపాయలు సంపాదించే అవకాశం ఉన్నా.. రాహుల్ ద్రవిడ్ మాత్రం ఇతర క్రీడల్లోని ఆణిముత్యాలను వెలికితీసే పనిలో తాను భాగస్వామి అయ్యాడు. రాబోయే రోజుల్లో ఓజీక్యూ, పీడీసీఎస్ఈ ద్వారా మరిన్ని పతకాలు గెలవడం ఖాయమే. ఇలాంటి సెంటర్లు ప్రతీ రాష్ట్రంలో ఏర్పాటు చేస్తే.. ఇండియా కూడా ప్రతీ ఒలింపిక్స్లో డబుల్ డిజిట్ మెడల్స్ సాధించే స్థాయికి తప్పకుండా ఎదుగుతుంది.



## ఆహారం తగ్గించి.. జుట్టు కత్తిరించినా..

● వినేశ్ బరువును తగ్గించేందుకు విశ్వప్రయత్నాలు
● షాక్‌కు గురైన యావత్ ప్రపంచం



పారిస్: ఒలంపిక్స్ రెజ్లింగ్లో పతకానికి చేరువైన వినేశ్ ఫోగాట్పై చివరి నిమిషంలో అనర్హత వేటు పడటంపై యావత్ దేశం షాక్కు గురైంది. అయితే, వినేశ్ బరువును నిర్దేశిత పరిమితిలోపు ఉంచేందుకు భారత బృందం అన్ని చర్యలు తీసుకున్నట్లు తెలుస్తోంది. ఆమె జుట్టును కూడా కత్తిరించినట్లు పారిస్లో భారత బృందం చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ దిన్షా పార్థీవాలా వెల్లడించారు. అయినప్పటికీ 100 గ్రాముల అదనపు బరువుతో ఆమె పతకానికి దూరమైందని చెప్పారు.
పోటీలో పాల్గొన్న తర్వాత నిర్దేశిత బరువు కంటే 2.7కిలోలు ఎక్కువగా ఉన్నట్లు గుర్తించాం. బరువు తగ్గించడానికి చాలా సమయం పడుతుంది. కానీ దురదృష్టవశాత్తు మా చేతిలో 12గంటలు మాత్రం ఉంది. వెంటనే కోచ్ అన్ని చర్యలు



తీసుకున్నారు. నీరు పరిమిత స్థాయిలో ఇచ్చాం. ఆహారం ఇవ్వలేదు. చెమట కోసం వ్యాయామాలు, ఆవిరి స్నానం వంటి మార్గాలతో బరువు తగ్గించేందుకు ప్రయత్నించాం. చివరకు చెమట రావడం లేదని గుర్తించి జుట్టును కూడా కత్తిరించాం. అయినప్పటికీ 50 కేజీల విభాగంలో ఆమె 100 గ్రాములు ఎక్కువ ఉన్నట్లు వెల్లడైంది. దాంతో అనర్హతకు గురైంది. మరికొంత సమయం ఉంటే ఆ కొంత బరువును కూడా తగ్గించేవాళ్లం అని ఇండియన్ ఒలింపిక్ అసోసియేషన్ జారీ చేసిన ప్రకటనలో డాక్టర్ పార్థీవాలా పేర్కొన్నారు.
బరువు తగ్గడం అనేది అనేక అంశాలపై ఆధారపడి ఉంటుందన్న డాక్టర్ పార్థీవాలా.. బరువు తగ్గించే చర్యలు శక్తిని కోల్పోయేందుకు దారితీస్తాయన్నారు. మునుపటి పోటీలో పాల్గొన్న తర్వాత బరువు ఒక్కసారిగా పెరిగే అవకాశాలున్నాయన్నారు. అనర్హత అనంతరం డీహైడ్రేషన్కు గురైన వినేశ్ను వెంటనే క్రీడా ప్రాంగణంలో ఉన్న ఆసుపత్రికి తీసుకెళ్లామని చెప్పారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి నిలకడగానే ఉందని.. ముందుజాగ్రత్త చర్యగా ఐవీ ఫ్లూయిడ్స్ అందిస్తున్నామని, రక్త పరీక్షలు చేస్తున్నామని చెప్పారు. శారీరకంగా, మానసికంగా సాధారణ స్థితిలోనే ఉన్నప్పటికీ అనర్హత వేటుతో తీవ్ర నిరాశతో ఉందన్నారు. ఈ క్రమంలో వినేశ్తో భేటీ అయిన ఐవోఏ అధ్యక్షురాలు పీటీ ఉష ఆమె యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు.



# సూర్య సినిమా

## డబ్బింగ్ పనులు షురూ చేసిన "గేమ్‌ఛేంజర్" టీమ్



గ్లోబల్ స్టార్ రామ్ చరణ్, సెన్సేషనల్ డైరెక్టర్ శంకర్ కాంబినేషన్‌లో రూపొందుతోన్న భారీ బడ్జెట్ చిత్రం 'గేమ్ చేంజర్'. ఈ మూవీ మీద ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్, జీ స్టూడియోస్ బ్యానర్స్‌పై దిల్ రాజు, శిరీష్ నిర్మిస్తోన్న ఈ సినిమాలో కియారా అద్వాని హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఇప్పటికే వదిలిన పోస్టర్స్, 'జరగండి జరగండి..' సాంగ్, వస్తోన్న అప్డేట్లతో గేమ్ ఛేంజర్‌పై మరింత హైప్ ఏర్పడింది. క్రిస్మస్ సందర్భంగా భారీ బడ్జెట్ పాన్ ఇండియా చిత్రాన్ని వరల్డ్ వైడ్‌గా రిలీజ్ చేస్తున్నారు. ఈ ఏడాది క్రిస్మస్ కి గ్రాండ్‌గా రిలీజ్ చేస్తున్నాం అని చెప్పడమే కాదు, ఎప్పటికప్పుడు అప్‌డేట్స్ ఇస్తూ ఫ్యాన్స్ లో పండగ వాతావరణాన్ని తీసుకొస్తున్నారు నిర్మాతలు. తాజాగా గేమ్ ఛేంజర్ డబ్బింగ్ పనులు షురూ అయ్యాయి. పూజా కార్యక్రమాలతో డబ్బింగ్ కార్యక్రమాలను మొదలుపెట్టారు. ఆల్ సెట్ ఫర్ ద మెగా ఫైర్ వర్క్స్ – క్రిస్మస్ 2024 అంటూ డబ్బింగ్ ప్రారంభించిన విషయాన్ని పంచుకున్నారు మేకర్స్.

## థియేటర్లలో చూడాల్సిన 'కమిటీకుర్రోళ్ళు'



నిహారిక కొణిదెల సమర్పణలో పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ ఎల్.ఎల్.పి, శ్రీరాధా దామోదర్ స్టూడియోస్ బ్యానర్స్‌పై రూపొందిన చిత్రం 'కమిటీ కుర్రోళ్ళు'. ఈ సినిమాకు యదు వంశీ దర్శకుడు. అంతా కొత్త వారితో చేసిన ఈ చిత్రం ఇప్పటికే అందరిలోనూ అంచనాలు పెంచేసింది. ఈ మూవీ ఆగస్ట్ 9న రాబోతోంది. ఈ క్రమంలో రిలీజ్ చేసిన టీజర్, ట్రైలర్, పాటలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ క్రమంలో బుధవారం నాడు దర్శకుడు యదు వంశీ మీడియాతో ముచ్చటించారు. ఆయన చెప్పిన విశేషాలివే.. నేను ఓ ఇండీ ఫిల్మ్ తీశాను. ఆ చిత్రానికి మంచి పేరు వచ్చింది. నేను ఇంత వరకు ఎవరి దగ్గరా పని చేయలేదు. సినిమాలకు సంబంధించిన అనుభవం లేదు. కానీ ఈ కథను రాసుకుని చాలా ప్రొడక్షన్ కంపెనీలు తిరిగాను. చివరకు నిహారిక గారి వద్దకు ఈ కథ వెళ్లింది. మా ఊళ్లో జరిగే జాతరను బేస్ చేసుకుని ఈ కథను రాసుకున్నాను. ఇందులో ప్రతీ ఒక్కరి కథ ఉంటుంది. ప్రతీ కుర్రాడి కథ ఇందులో కనిపిస్తుంది. ఇందులో నా పర్సనల్ ఎక్స్‌పీరియెన్స్ కూడా ఉంటుంది. స్క్రీన్ మీద సినిమా ఎలా కనిపించాలనేది నిహారికగారికి తెలుసు. దానికి ఏం కావాలో అన్నీ సమకూర్చారు. చెప్పింది చెప్పినట్టుగా తీసే ఫ్రీడం ఇచ్చారు. నిహారికగారు మొదటి రోజు నుంచి ఈ రోజు వరకు ఒకేలా ఉన్నారు. నాకు ఈ కథ మీద చాలా నమ్మకం ఉంది. రెగ్యులర్ పంథాలో వెళ్లకూడదనే ఉద్దేశంలో ఇలాంటి కథను ఎంచుకున్నాను. 2019లో కొంత రీసెర్చ్ చేశాను. జయప్రకాష్ నారాయణ గారు, పవన్ కళ్యాణ్‌గారు కొన్ని మాటలు మాట్లాడారు. వాళ్లు మాట్లాడిన కొన్ని మాటల స్ఫూర్తితోనే కొన్ని సీన్లను రాసుకున్నాను. ఫ్రెండ్ షిప్, పొలిటికల్ అంశాలను ఇందులో జొప్పించాను. నెక్స్ట్ థ్రిల్లర్ కాన్సెప్ట్‌తో కథను రాసుకుంటున్నాను. అందరూ భయపడేలా ఈ కథ ఉంటుంది. ఈ మూవీ పెద్ద హిట్ అయితే.. నేను అనుకున్న హీరోతోనే ఆ సినిమా చేస్తాను.

## 30న గద్దర్ ఆఖరి చిత్రం 'ఉక్కు సత్యాగ్రహం'

విశాఖ ఉక్కు తెలుగు వారి హక్కు నినాదం తో దర్శక, నిర్మాత హీరో జనం స్టార్ సత్యారెడ్డి నిర్మాణంలో ప్రజా యుద్ధనౌక, విప్లవ కవి గద్దర్ నటించిన ఆఖరి చిత్రం,"ఉక్కు సత్యాగ్రహం " ఈ చిత్రాన్ని ఈ నెల 30 న విడుదల చేస్తున్నారు. జాతీయ ఉత్తమ ప్రముఖ దర్శకులు నిర్మాత బి.నర్సింగరావు. తెలంగాణా రాష్ట్ర గీతం రూపశిల్పి అందెశ్రీ, గద్దర్ తనయుడు సూర్యం, జానపద కవి



గోరేటి వెంకన్న, ప్రొఫెసర్ కోదండరాం, నందిని సిద్ధారెడ్డి, అల్లం నారాయణ ప్రముఖులు సంయుక్తంగా పోస్టర్ విడుదల చేసి రిలీజ్ డేట్ నిర్ణయించి ప్రకటించారు. గద్దరన్న మూడు పాటలు పాడి రెండు పాటల్లో మరియు కొన్ని సందేశాత్మక సీన్స్‌లో నటించారు. గోరేటి వెంకన్న, సుద్దాల అశోక్ తేజ అద్భుతమైన సాహిత్యం అందించారు. ఈసందర్భంగా చిత్ర దర్శక, నిర్మాత, కథానాయకుడు సత్యారెడ్డి మాట్లాడుతు : విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకి వ్యతిరేకంగా, భూనిర్వాశితులకి న్యాయం కోసం ఉక్కు సత్యాగ్రహం సినిమాని ఒక గ్రంథంలా, కళా ఖండంలా మూడు సంవత్సరాలు పాటు ఎంతో కష్టపడి నిర్మించామని నిజమైన స్టీల్ ప్లాంట్ యూనియన్ లీడర్స్, ఎంప్లాయిస్, భూనిర్వాసితులు, ఎంతోమంది మేధావులు,కవులు కళాకారుల, రచయితలు కూడా ఈ చిత్రం లో నటించారని తెలిపారు. ఢిల్లీ ఇండియా గేట్, జంతర్ మంతర్, ఆంధ్రప్రదేశ్ భవన్, సింగరేణి కోల్ మైన్స్, విశాఖపట్నం ప్రాంతాల్లోని వివిధ లొకేషన్ లలో షూటింగ్ చేశామని చెప్పారు.



## 'కుందనాల బొమ్మ..' లిరికల్ సాంగ్

చేతన్ కృష్ణ, హెబ్బా పటేల్ హీరో హీరోయిన్లుగా నటిస్తున్న సినిమా "ధూం ధాం". సాయి కుమార్, వెన్నెల కిషోర్, పృథ్వీరాజ్, గోపరాజు రమణ ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రాన్ని ఫ్రైడే ఫ్రేమ్ వర్క్స్ బ్యానర్ పై ఎంఎస్ రామ్ కుమార్ నిర్మిస్తున్నారు. "ధూం ధాం" సినిమాను లవ్, ఫ్యామిలీ ఎంటర్



టైనర్ గా దర్శకుడు సాయి కిషోర్ మచ్చా రూపొందిస్తున్నారు. గోపీ మోహన్ స్టోరీ స్క్రీన్ ప్లే అందిస్తున్నారు. ఈ సినిమా వచ్చే నెలలో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. "ధూం ధాం" సినిమా మ్యూజికల్ ప్రమోషన్స్ సక్సెస్ ఫుల్ గా సాగుతున్నాయి. ఇప్పటికే ఈ సినిమా నుంచి రిలీజ్ చేసిన 'మల్లెపూల టాక్సీ..', 'మాయా సుందరి..', 'టమాటో బుగ్గల పిల్ల..' పాటలు పాట ఛాట్ బస్టర్స్ అయ్యాయి. "ధూం ధాం" సినిమా ఫోర్త్ సింగిల్ 'కుందనాల బొమ్మ..'ను దర్శకేంద్రుడు రాఘవేంద్రరావు విడుదల చేశారు. గోపీ సుందర్ మంచి బీట్ తో కంపోజ్ చేసిన 'కుందనాల బొమ్మ..' పాటకు 'సరస్వతీ పుత్ర' రామజోగయ్య శాస్త్రి అందమైన సాహిత్యాన్ని అందించారు.

## జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా రాయల్ క్లాన్‌తో పూనమ్ కౌర్

ఆగస్ట్ 7న జాతీయ చేనేత దినోత్సవం, భారతదేశ సాంస్కృతిక, ఆర్థిక వ్యవస్థలో భాగమైన చేనేత కార్మికుల యొక్క కీలక పాత్రను, ప్రాముఖ్యతను తెలియజేసే రోజుది. అందులో భాగంగా ఈ ఏడాది నటి పూనమ్ కౌర్ చేనేత కళ పట్ల తన మద్ధతుని తెలియజేసింది.. ఆమె హృదయపూర్వకమైన కథను తెలియజేసింది. చేనేత, చేనేత వస్త్రాలపై పూనమ్ కౌర్ పరిశోధన చేస్తున్నారు. అలాగే న్యాయవాది కూడా అయిన ఆమెకు కేరళలోని ఇద్దరు యువరాణులు కలిసే సువర్ణావకాశం దక్కింది. వారే పూయం తిరునాళ్ పద్మనాభ సేవిని గౌరీ పార్వతి బాయి, పద్మనాభ సేవిని పద్మశ్రీ అవార్డు గ్రహీత గౌరీ లక్ష్మీ బాయిలను కలిశారు పూనమ్. ఈ సందర్భంలో కేరళ సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షించడంలో తమ అనుభవాలను, అభిరుచిని ఇద్దరు యువరాణిలు తెలియజేశారు. పూయం తిరునాళ్ పద్మనాభ సేవిని గౌరీ పార్వతి బాయి పద్మనాభ స్వామి ఆలయం పట్ల తనకున్న భక్తిని తెలియజేయగా, పద్మనాభ సేవిని పద్మశ్రీ అవార్డు గ్రహీత గౌరీ లక్ష్మీ బాయి పూనమ్‌కు అందమైన కేరళ చేనేత చీరను బహుమతిగా ఇచ్చారు. ఆటోఇమ్యున్ డిజార్డర్‌తో బాధపడుతున్నప్పటికీ పూనమ్ కౌర్ చేనేత అభివృద్ధిలో భాగంగా చేసున్న పనికి నిబద్ధతతో కట్టుబడి ఉన్నారు. అలాగే ఓ కొత్త ప్రాజెక్ట్‌ను చేపట్టాలని చాలా ఉత్సాహంగా ఎదురుచూస్తున్నారు. విషయం తెలుసుకున్న యువరాణులు దేశంలోని చేనేత కార్మికులకు మంచి భవిష్యత్త ఉండేలా చూడాలని కోరటమే కాకుండా పూనమ్ చేయనున్న భవిష్యత్ కార్యాచరణలన్నీ విజయవంతం కావాలని అభిలషించారు.



## వయనాడ్ బాధితులకు రెబెల్ స్టార్ విరాళం

సమాజంలో ఏ విపత్తు జరిగినా తక్షణమే స్పందిస్తుంటారు రెబెల్ స్టార్ ప్రభాస్. పెద్ద మనసుతో భారీగా విరాళం ఇస్తుంటారు. కేరళలోని వయనాడ్ లో జరిగిన ప్రకృతి విపత్తు బాధితులకు ఆపన్నహస్తం అందించారు ప్రభాస్. వయనాడ్ బాధితుల సహాయార్థం 2 కోట్ల రూపాయల విరాళం ఇస్తున్నట్లు ప్రకటించారు. కేరళ సీఎం రిలీఫ్ ఫండ్ కు ఈ విరాళం అందిస్తున్నారు ప్రభాస్. వయనాడ్ ప్రజలకు తన ప్రగాఢ సానుభూతిని ప్రభాస్ తెలియజేశారు. ఈ కష్ట సమయంలో కేరళ ప్రజలు ధైర్యంగా ఉండాలని, వారికి మనమంతా అండగా ఉండాలని ప్రభాస్ కోరారు.

## ఆగస్టు 9న మాస్టర్ పీస్ సూపర్ డీలక్స్



దైవసెల్వితీర్థం ఫిలిమ్స్ బ్యానర్ పై దైవసిగమణి, తీర్థమలై, పూల మధు నిర్మాతలుగా త్యాగరాజ కుమార రాజా దర్శకత్వంలో మక్కల్ సెల్వన్ విజయ సేతుపతి, పుష్ప ఫేమ్ ఫహద్ ఫాసిల్, సమంత ముఖ్య పాత్రల్లో రమ్యకృష్ణ, మిస్కిన్, గాయత్రి, భగవతి పెరుమాళ్ ఇతర ముఖ్య పాత్రల్లో నటించగా మాస్టర్ పీస్ మూవీగా నిలిచిన సూపర్ డీలక్స్ ఆగస్టు 9న తెలుగులో గ్రాండ్ రిలీజ్ అవుతోంది. తమిళంలో పెద్ద విజయం అందుకున్న సినిమా సూపర్ డీలక్స్. విజయ్ సేతుపతి ఈ సినిమాలో స్పెషల్ లేడీ క్యారెక్టర్ రోల్‌లో నటించారు. అదే విధంగా ఆ క్యారెక్టర్ గాను ఎన్నో అవార్డ్స్ అందుకున్నారు. ఫహద్ ఫాసిల్, సమంత, రమ్యకృష్ణ పాత్రలు ప్రత్యేక ఆకర్షణ. యువన్ శంకర్ రాజా మ్యూజిక్ అందించగా పి. ఎస్. వినోద్, నీరవ్ షా డిఓపిగా పని చేశారు. నాలుగు విభిన్న కథలను జోడించి చిత్రీకరించిన ఈ చిత్రం ఎన్నో అవార్డులను క్రిటిక్స్ నుంచి అద్భుతమైన రెస్పాన్స్ అందుకుంది. తమిళంలో బ్లాక్ బస్టర్ హిట్‌గా నిలిచిన సూపర్ డీలక్స్ సినిమాని ఈనెల 9న గ్రాండ్‌గా రిలీజ్ చేస్తున్నారు.

## 'మెకానిక్ రాకీ' నుంచి వైబ్రంట్ ఫోక్ సాంగ్



మాస్ కా దాస్ విశ్వక్ సేన్ తన అప్ కమింగ్ మూవీ 'మెకానిక్ రాకీ'తో ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమౌతున్నారు. ఈ మోస్ట్ ఎవైటెడ్ మూవీని మాస్ యాక్షన్, కామెడీ ఎంటర్‌టైనర్‌గా రూపొందించారు. ఈ చిత్రానికి రవితేజ ముళ్లపూడి రచన, దర్శకత్వం వహించారు. ప్రముఖ నిర్మాత రామ్ తాళ్లూరి తనఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై నిర్మించారు. ఫస్ట్ లుక్, ఫస్ట్ గేర్‌కి ట్రెమం డస్ రెస్పాన్స్ వచ్చింది. మేకర్స్ ఫస్ట్ సింగిల్ గుల్లేడు గుల్లేడు రిలీజ్ చేయడంతో మ్యూజిక్ జర్నీ ప్రారంభించారు. ఈ పాట లైవ్లీ ఫోక్ టచ్‌తో ఆకట్టుకుంది. లిరిక్ రైటర్ సుద్దాల అశోక్ తేజ ట్రెడిషన్ ఉట్టిపడేలా అద్భుతమైన సాహిత్యాన్ని అందించారు. జేక్స్ బెజోయ్ సాంగ్‌ని ఫోక్ రూట్స్‌తో పెప్పీ బీట్‌లతో, డైనమిక్, ఎనర్జిటిక్ మ్యూజిక్ ఎక్స్‌పీరియన్స్‌ని క్రియేట్ చేశారు. వెడ్డింగ్ షెనానిగన్స్, ఫోక్ ఎనర్జీతో కలిసినప్పుడు రిజల్ట్ వైబ్రెంట్ సెలబ్రేషన్ లా వుంటుంది. ఇది ట్రెడిషన్స్ తో ఎంటర్టైన్మెంట్ ని బ్లెండ్ చేసి మెమరబుల్ వైబ్‌ని క్రియేట్ చేస్తోంది. సింగర్ మంగ్లీ ప్లజెంట్, ఎంగేజింగ్ పెర్ఫార్మెన్స్ తో సాంగ్‌ని పాడటం ఆకట్టుకుంది. ఈ పాటలో విశ్వక్ సేన్, మీనాక్షి చౌదరిల ఎట్రాక్టివ్ డ్యాన్స్ మూవ్స్ మరింత ఆకర్షణను పెంచాయి. వారి ఎలిగెంట్ కెమిస్ట్రీ, కొరియోగ్రఫీ వీడియోను విజువల్ డిలైట్‌గా మార్చాయి, యష్ మాస్టర్ కొరియోగ్రఫీ ఆకట్టుకుంది. అద్భుతమైన సెట్‌లో చిత్రీకరించిన విజువల్స్ ఆకట్టుకున్నాయి. ట్రెడిష నల్, మోడరన్ ఎలిమెంట్స్ కూడిన గుల్లేడు గుల్లేడు మెమరబుల్ హిట్ అవుతుందని ప్రామిస్ చేసింది. మెకానిక్ రాకీ సౌండ్‌ట్రాక్స్ పై హై బార్‌ను సెట్ చేసింది.

## సమాజానికి ఉపయోగపడే చిత్రాలే చేస్తా



అనసూయ, జగపతి బాబు ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'సింబా'. సంపత్ నంది టీం వర్క్స్, రాజ్ దాసరి ప్రొడక్షన్స్ బ్యానర్ల మీద సంపత్ నంది, దాసరి రాజేందర రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మించారు. సంపత్ నంది అందించిన ఈ కథకు మురళీ మనోహర్ దర్శకత్వం వహించారు. ఈ చిత్రాన్ని ఆగస్ట్ 9న రిలీజ్ చేయబోతోన్నారు. ఈ క్రమంలో బుధవారం నాడు చిత్ర నిర్మాత రాజేందర్ రెడ్డి మీడియాతో ముచ్చటించారు. ఆయన చెప్పిన విశేషాలివే..

కేవలం కాన్సెప్ట్ ఓరియెంటెడ్‌గా మాత్రమే కాకుండా అన్ని రకాల అంశాలు ఈ చిత్రంలో ఉంటాయి. నాకు ప్రకృతి అంటే చాలా ఇష్టం. కరోనా టైంలో సంపత్ నంది గారు నాకు ఈ కథను చెప్పారు. సమాజానికి ఉపయోగపడేలా ఓ సినిమాను చేయాలని అనుకున్నాను. ఈ కథ బాగా నచ్చడంతో సింబాను ప్రారంభించాను. అంతకు ముందు కూడా చాలా కథలు వినిపించారు. కానీ సింబాను తీయాలని అనిపించింది. సింబా అంటే అడివికి రాజు సింహం. పైగా అమ్మవారి వాహనం. ఇందులో అడివిని కాపాడే వ్యక్తిగా కనిపిస్తాడు. అందుకే సింబా అనే పవర్ ఫుల్ టైటిల్‌ను పెట్టాం. మురళీ మనోహర్ గారు సంపత్ నంది వద్ద ఎన్నో చిత్రాలకు పని చేశారు. ఆయన లండన్‌లో ఫిల్మ్ స్కూల్‌లో ట్రైనింగ్ తీసుకున్నారు. మురళీ మనోహర్ మీద సంపత్ నంది గారెకి నమ్మకం ఉంది. ఆ ఇద్దరూ ఒక్కరే అని నా అభిప్రాయం. ఆయన్ను నేను కూడా నమ్మాను. అందుకే ఈ ప్రాజెక్ట్‌ను ఆయనకు ఇచ్చాం. కరోనా కంటే ముందు కథను అనుకున్నాం. కరోనా వల్ల షూటింగ్‌లన్నీ ఆగిపోయాయి. ఆ తరువాత మెల్లిగా షూటింగ్‌ను స్టార్ట్ చేశాం. కరోనా మాకు కలిసి వచ్చిందనే చెప్పొచ్చు.

జగపతి బాబు గారితో నాకు 25 ఏళ్ల నుంచి బంధం ఉంది. జగపతి బాబు ఇంట్లో పచ్చదనమే కనిపిస్తుంది. ఈ కథకు ఆయన ఎక్కువగా కనెక్ట్ అయ్యారు. ఎంతో డెడికేటెడ్‌గా పని చేశారు.

## 'స్వీటీ నాటీ క్రేజీ' లాంచనంగా ప్రారంభం



త్రిగుణ్, శ్రీజిత ఘోష్ కాంబోలో అరుణ్ విజువల్స్ బ్యానర్ మీద ఆర్. అరుణ్ నిర్మించిన చిత్రం 'స్వీటీ నాటీ క్రేజీ'. ఈ మూవీకి రాజశేఖర్.జి దర్శకత్వం వహించారు. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. అతిథుల సమక్షంలో ఈ చిత్రాన్ని లాంఛనంగా ప్రారంభించారు. త్రిగుణ్, శ్రీజిత ఘోష్, ఇనయ, రాధ, అలీ, రఘుబాబు, రవి మరియు ప్రముఖ పాత్రల్లో నటించిన ఈ చిత్రాన్ని నేడు ప్రారంభించారు. ముహూర్తపు సన్నివేశానికి అలీ క్లాప్ కొట్టగా.. దామోదర ప్రసాద్ స్క్రిప్ట్ అందజేయగా.. బెక్కెం వేణుగోపాల్‌గారు దర్శక త్వం వహించారు. అనంతరం మీడియాతో.. హీరో త్రిగుణ్ మాట్లాడుతూ.. 'అరుణ్‌గారు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. అరుణ్ విజువల్స్ మీద రాజశేఖర్ ఈ చిత్రాన్ని తెరకె క్కిస్తున్నారు. శ్రీజిత, ఇనియలు ఇందులో మంచి పాత్రలుంటాయి. టైటిల్‌కు తగ్గట్టుగా.. స్వీటీ, నాటీ, క్రేజీలా ఉంటాయి. నాకు ఇంత వరకు కామెడీ చిత్రాలు బాగా వర్కౌట్ అయ్యాయి. 'కథ'తో మొదలైన నా ప్రయాణానికి మీడియా వారు సపోర్ట్ అందించారు' అని అన్నారు.

PRINTED & PUBLISHED BY NUKARAPU PADMAJA ON BEHALF OF SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR, NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081. PRINTED AT SPR PRINTING PRESS, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR, NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081, TELANGANA, PUBLISHED AT SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR,NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081. EDITOR : NUKARAPU PADMAJA. Fax No:040-30473232 RNI Registration No. APTEL/2007/22044.